PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 225 | విజయవాడ, మంగళవారం 18 మార్చి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 18 March 2025 | Rs

బిసిసిఐ నిర్ణయం సరైందే

- బ్రూక్ నిషేధంపై మొయిన్, రషీద్
- ఐపిఎల్ సీజన్-18

8

తొమ్మిది నెలల ఎదురుచూపులకు తెర

- నేడు భూమికి చేరుకోనున్న సునీత, విల్మోర్

వాషింగ్టన్ : తొమ్మిది నెలల ఎదురుచూపులకు మంగళవారంతో తెరపడనుంది. అనివార్య కారణాలతో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో జూన్ నుంచి చిక్కుకుపోయిన సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ స్పేస్ ఎక్స్ వ్యోమ నౌక క్రూ డ్రాగన్ ద్వారా అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం భూమికి తిరిగి రానున్నారని నాసా సోమవారం ప్రకటించింది. వీరితోపాటు మరొక అమెరికా వ్యోమగామి, రష్యా అంతరిక్ష యాత్రికుడు కూడా క్రూ డ్రాగన్‌లో తిరిగి రానున్నారు. ఈ నౌక సోమవారం రాత్రి 10:45 గంటలకు అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరి, మంగళవారం సాయంత్రం 5:57 గంటలకు ఫ్లోరిడా తీరంలో దిగనుందని నాసా అంచనా వేసింది. గతేడాది జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక స్టార్‌లైనర్ ద్వారా సునీత, విల్మోర్ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం వీరు వారం రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉన్నా, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు కారణంగా అక్కడే చిక్కుకుపోయారు.

చట్టవిరుద్ధ శక్తులపై చర్యలు

న్యూజిలాండ్ ప్రధానితో భేటీలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : భారత్‌ను వ్యతిరేకిస్తూ కార్యకలాపాలు సాగిస్తున్న చట్ట విరుద్ధ శక్తులపై న్యూజిలాండ్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే విశ్వాసం ఉందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. మన దేశ పర్యటనలో ఉన్న న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ సోమవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల ప్రధానులు తమ దేశాల మధ్య ఉన్న రక్షణ, భద్రతా సంబంధాలను దృఢం చేసుకునే భారీ ఒప్పందంపై సంతకం చేశారు. వాణిజ్యం, రక్షణ, విద్య, వ్యవసాయం రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేయడం లక్ష్యంగా ఇరు దేశాల మధ్య చర్చలు సాగాయి. అనంతరం నరేంద్ర మోడీ ఒక మీడియా ప్రకటన విడుదల చేశారు. 'ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రతా భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, దృఢపరుచుకునేందుకు రెండు వైపుల నుంచి నిర్ణయం తీసుకున్నాం' అని తెలిపారు. రక్షణ పరిశ్రమ రంగంలో సహకారం కోసం ఒక రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేస్తామన్నారు. 'మేమిద్దరం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఒకే మాటపై ఉన్నాం. 2019 మార్చి 15న జరిగిన క్రీస్తు చర్చిపై ఉగ్రదాడి అయినా, లేదా 2008 నవంబర్ 26న జరిగిన ముంబయి ఉగ్రదాడి అయినా సరే.. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా.. ఆమోదయోగ్యం కాదు. వారిపై కఠిన చర్యలు అవసరం' అని మోడీ తెలిపారు. ఉగ్రవాద, వేర్పాటువాద, రాడికల్ శక్తులకు వ్యతిరేకంగా న్యూజిలాండ్‌తో సహకారాన్ని కొనసాగిస్తామని, అక్కడ కొన్ని చట్ట విరుద్ధ శక్తులు భారత వ్యతిరేక కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయనే మా ఆందోళనను పంచుకున్నాం' అని మోడీ పేర్కొన్నారు. పరస్పరం ప్రయోజనకరమైన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు ప్రారంభించాలని భారత్-న్యూజిలాండ్ నిర్ణయించుకున్నాయని ప్రధాని మోడీ ప్రకటించారు. దీంతో పరస్పర వాణిజ్యం, పెట్టుబడులు పెరుగుతాయని, పాడిపరిశ్రమ, ఆహార ప్రాసెసింగ్, ఫార్మా వంటి రంగాల్లో పరస్పర సహకారం, పెట్టుబడులు ప్రోత్సహిస్తామని మోడీ చెప్పారు. స్వేచ్ఛాయుతమైన, సురక్షితమైన ఇండో - పసిఫిక్‌కు భారత్, న్యూజిలాండ్ మద్దతు ఇస్తున్నాయని మోడీ తెలిపారు. 'మేం విస్తరణవాదాన్ని కాదు, అభివృద్ధి విధానాన్ని నమ్ముతాం' అని మోడీ తెలిపారు.

సంపన్నమైన ఇండో-పసిఫిక్‌కు దోహదం : న్యూజిలాండ్ ప్రధాని

ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సవాళ్లను ఎదుర్కోవడంపై మోడీతో చర్చించినట్లు న్యూజిలాండ్ ప్రధాని క్రిస్టోఫర్ తెలిపారు. సంపన్నమైన ఇండో-పసిఫిక్‌కు దోహదపడటంతో పాటు, ఇరుదేశాల ఉమ్మడి సమస్యల పరిష్కరించడానికి చర్చలు ఉపకరిస్తాయని చెప్పారు.

వర్గీకరణ నివేదికకు కేబినెట్ ఓకే



కేబినెట్ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

గ్రూపు1లో రెల్లి ఉపకులాలకు ఒకశాతం • గ్రూపు2లో మాదిగ ఉపకులాలకు 6.5శాతం
గ్రూపు3లో మాల ఉపకులాలకు 7.5శాతం • జిల్లాల వారీ అమలు • త్వరలోనే కేంద్ర కమిషన్‌కు నివేదన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

షెడ్యూల్ కులాల వర్గీకరణ సిఫార్సులకు రాష్ట్ర మంత్రివర్గం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి మండలి సమావేశం సోమవారం సాయంత్రం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మంత్రివర్గ ఉప సంఘం సిఫార్సులకు మేరకు మాజీ ఐఎఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ ఇటీవలే షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై సమర్పించిన నివేదిక విషయం చర్చకు వచ్చినట్లు సమాచారం. కమిషన్ నివేదికను యధాతధంగా ఆమోదించాలని మంత్రి మండలి నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో ఈ నివేదికను త్వరలో కేంద్ర ఎస్సీ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం పంపనుంది. ఈ నివేదికలో షెడ్యూల్డ్ కులాలను మూడు గ్రూపులుగా విభజించి ఒకటో గ్రూపులో రెల్లి ఉప కులాలకు ఒక శాతం, గ్రూపు-2లో మాదిగ ఉప కులాలకు 6.5 శాతం, గ్రూపు-3లో మాల ఉపకులాలకు 7.5 శాతం చొప్పున రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించినట్లు తెలిసింది. అలాగే రాష్ట్రం ఒక యూనిట్‌గా ఈ రిజర్వేషన్లు ఉండాలని కూడా సూచించినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో బేడ బుడగ, జంగాలను రెల్లి ఉపకులాల్లో చేర్చే అంశంపై శాసనసభలో తీర్మానం చేయాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు సమాచారం. ఈ రిజర్వేషన్లను జిల్లాల వారీగా అమలు చేయాలని సమావేశంలో భావించినట్లు తెలిసింది.

చేనేత కార్మికులను ఆదుకునేందుకు వారికి 200 యూనిట్ల చొప్పున విద్యుత్‌ను ఉచితంగా అందించాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయించినట్లు తెలిసింది. మరమగ్గాలు వినియోగించే వారికి కూడా ఐదు వందల యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించడం విశేషం. ఈ నిర్ణయంతో మరమగ్గాల ద్వారా వస్త్రాలు తయారుచేసే వారికి మేలు కలుగుతుండగా, దాని ప్రభావం చేనేత కార్మికులపై పడుతుందన్న భావన కూడా వ్యక్తమవుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సప్లిమెంటరీ స్టేట్‌మెంట్‌కు ఆమోదం తెలిపారు. అలాగే ఉపాధ్యాయ బదిలీల నియంత్రణ కోసం కొత్తగా తయారుచేసిన బిల్లును కూడా ఆమోదించారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న వారే కాకుండా జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఈ చట్టం వర్తిస్తుంది.

రాజధాని ప్రాంతంలో పనులకు ఆమోదం

రాజధాని అమరావతి ప్రాంతంలో నిర్మించే, చేపడుతున్న అనేక పనులకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఇప్పటికే ఈ పనులకు టెండర్లు ఆహ్వానించగా, సిఆర్‌డిఎ అధికారులు వాటిని పరిశీలించి ఎల్-1లను ఖరారు చేసినట్లు తెలిపింది. ఈ పనులకు తాజాగా మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ఇందులో విద్యుత్ లైన్లు, రోడ్లు, డ్రైనేజ్ వంటివి ఉన్నాయి. కాంట్రాక్టర్లకు సంబంధించి నగదు సీలింగ్ క్లాజ్‌ను కూడా ఆమోదించారు. 22,,607 కోట్ల రూపాయల విలువైన పనుల టెండర్లను ఆమోదించే అధికారాన్ని మిగతా 7లో

వైసిపి పాలనపై విచారణ

- మండలిలో మంత్రులు అనగాని, కొల్లు రవీంద్ర ప్రకటన
- ఏకపక్ష చర్చను అంగీకరించం : బొత్స
- నిరసనగా వైసిపి వాకౌట్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ జరుగుతోందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. సోమవారం శాసనమండలిలో 2019-24కు సంబంధించి జరిగిన లఘు చర్చకు తొలుత మంత్రి సత్యప్రసాద్ సమాధామిచ్చారు. ఈ మేరకు త్వరలో చర్యలుంటాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో అనేక కుంభకోణాలు జరిగాయన్నారు. జగనన్న కాలనీల పేరుతో భూ సేకరణ, మౌలిక సదుపాయాలు, ఇళ్ల పట్టాల పంపిణీలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపించారు. పార్టీ కార్యాలయాలను ప్యాలెస్‌ల మాదిరి కట్టారని, కానీ కొత్త జిల్లాల్లో కలెక్టర్ల కార్యాలయాలను ఎక్కడా నిర్మించలేదన్నారు. మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు భూ కబ్జాలకు పాల్పడ్డారని తెలిపారు. విశాఖపట్నం, మదనపల్లి, ఉమ్మడి గుంటూరు జిల్లా కొత్తపల్లిలో భూకబ్జాలు జరిగాయన్నారు. తాజాగా భూ కబ్జాలను వ్యతిరేకించిన నేపథ్యంలో చిత్తూరు జిల్లాలో నాలుగు రోజుల క్రితం టిడిపి కార్యకర్తను హత్య చేశారని గుర్తు చేశారు. అగ్రిగోల్డ్ ఆస్తులు 2,300 గజాల స్థలాన్ని కాజేశారని తెలిపారు. మొత్తంగా గత ప్రభుత్వ హయాంలో 1.70 లక్షల ఎకరాల భూమి కబ్జాకు గురైందన్నారు. మద్యం, ఇసుక విక్రయాల్లోనూ పలు అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. మద్యాన్ని నిషేధిస్తామని చెప్పి జగన్ విచ్చలవిడిగా విక్రయించారని విమర్శించారు. ఒక దశలో మంత్రి అనగాని తరువాత మరో మంత్రి కొల్లు రవీంద్ర కూడా ఇదే అంశంపై సమాధానం ఇచ్చేందుకు ప్రయత్నించగా, మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అంగీకరించలేదు. ఒక అంశంపై ఒక్క మంత్రి సమాధానం చెప్పాలని, ఇద్దరు మంత్రులు సమాధానం చెప్పడం సభా సంప్రదాయం కాదన్నారు. 25 నిమిషాల పాటు మంత్రి అనగాని మాట్లాడిన తరువాత కొల్లు రవీంద్ర కూడా మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం విక్రయాలను సాకుగా చూపి రూ.36,340 కోట్ల రుణాలు తెచ్చారన్నారు. మద్యం అమ్మకాల్లో రూ.21,500 కోట్ల అవినీతి జరిగిందన్నారు. ప్రభుత్వానికి రావాల్సిన రూ.18,860 కోట్ల ఆదాయం రాలేదన్నారు.

వైసిపి వాకౌట్.. మార్షల్స్‌తో సభ్యులను తీసుకురావాలి : లోకేష్

గత ప్రభుత్వ హయాంలో జరిగిన కుంభకోణాలపై చర్చ గత గురువారం మండలిలో చేపట్టారు. అదేరోజు టిడిపి, వైసిపి సభ్యులు మాట్లాడిన తరువాత వైసిపి వారు వాకౌట్ చేశారు. దీంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ ఇచ్చే సమాధానాన్ని కూడా సోమవారానికి వాయిదా వేశారు. సోమవారం తిరిగి మంత్రి అనగాని సమాధానం చెప్పేందుకు పూనుకోగా వైసిపి అభ్యంతరం తెలిపింది. ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. 2014-2019 మధ్య జరిగిన అవినీతిపై చర్చ జరపాలని తాము కోరామన్నారు. అందుకు ప్రభుత్వం అంగీకరించలేదని, 2019 నుంచి 2024 మధ్య అవినీతిపై మాట్లాడుతారంటే అంగీకరించబోమని, ఇందుకు తాము నిరసన వ్యక్తం చేస్తూ వాకౌట్ చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి నారా లోకేష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే మార్షల్స్‌తో సభ్యులను బయటకు పంపేవారని, ఇప్పుడు బయటకు వెళ్లే సభ్యులను మార్షల్స్‌తో లోపలికి తీసుకురావాలని అన్నారు.

ట్రూ డౌన్ అంటే అధిక వసూళ్లలో మిగులే!

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి



ఎపి ట్రాన్స్‌కో నాల్గవ నియంత్రణ కాలానికి (2019-20 నుండి 2023-24 వరకు) రూ.1059.75 కోట్ల మేరకు ట్రూ డౌన్ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేసింది. దీనర్థం ఆ మొత్తాన్ని వినియోగదారులకు తిరిగి చెల్లించడానికి అనుమతి వ్వాలని కోరడం. ఈ పిటిషన్ దాఖలు కాగానే ఇదేదో టిడిపి కూటమి ఘనకార్యమన్నట్లుగా ప్రచారం ప్రారంభమైంది. అయితే, వాస్తవం భిన్నం! ట్రాన్స్‌కోకు ఆదాయంలో మిగులు ఏర్పడితే ఈ పరిస్థితి వస్తుంది. ఆ మిగులు ఎలా వచ్చిందన్నదే కీలకం. మన రాష్ట్రంలో ప్రజల నుండి చేసిన అధిక వసూళ్లలో మిగుళ్లు ఏర్పడటం, చేయవలసిన చోట అవసరమైన ఖర్చును చేయకపోవడం ఈ పరిస్థితికి కారణం. కమిషన్ వార్షిక ప్రాతిపదికపై అనుమతించిన వ్యయం, ఆదాయాలలో వచ్చిన తేడాల ఆధారంగా ట్రూ అప్ లేదా ట్రూ డౌన్ చేయాల్సిన మొత్తాలు తేలతాయి. ట్రాన్స్‌కోకు ఆదాయంలో లోటు వస్తే ట్రూ అప్ కింద వినియోగదారుల నుండి వసూలు చేసుకునేందుకు కమిషన్ అనుమతిస్తుంది. ఆదాయంలో మిగులు తేలితే ట్రూడౌన్ కింద ఆ మొత్తాన్ని వినియోగదారులకు డిస్కాంల ద్వారా తిరిగి చెల్లించాలని కమిషన్ ఆదేశిస్తుంది. 2వ, 3వ నియంత్రణ కాలాలకు (2009-2014, 2014-2019) కూడా ఎపి ట్రాన్స్‌కో అదనపు ఆదాయాలను ట్రూ డౌన్ చేసి పెట్టుబడులు, ఇతర వ్యయాలను అధికంగా చూపడం, వాటి ఆధారంగా ప్రసార ఛార్జీలను న్యాయంగా ఉండాల్సిన దాని కన్నా ఎక్కువగా నిర్ణయించి, వసూలు చేయటం వల్ల అదనపు ఆదాయాన్ని ట్రాన్స్‌కో పొందింది.

అదనపు ఛార్జీలను సమర్థించుకున్నది ఇలా...

2019-20 నుండి 2023-24 మధ్య కాలానికి రూ.50,341.44 కోట్ల ఆర్‌ఆర్‌బిను నిర్ణయించారు. ఆర్‌ఆర్‌బి అంటే రెగ్యులేటేడ రేట్ బేస్. ఇది ట్రాన్స్‌కో విద్యుత్ ప్రసార వ్యవస్థలో వినియోగంలో ఉన్న ఆస్తుల విలువ. ఇంత విలువ కల ఆస్తులను ఉపయోగించి విద్యుత్ ప్రసారం చేసినందుకు అయ్యే ఖర్చును ముందుగానే లెక్కించి వినియోగదారుల నుండి ముందే వసూలు చేసేశారు. కానీ, వాస్తవంగా ట్రాన్స్‌కో 2023 -2024 నాటికి రూ.37,863.98 కోట్ల విలువగల ఆర్‌ఆర్‌బిని మాత్రమే సాధించగలిగింది. అందువల్ల, తగ్గిన ఈ పెట్టుబడి ఆధారంగా విద్యుత్ ధరలను తగ్గించాలి. కానీ, ఇప్పటికే రూ.50,341.44 కోట్ల మిగతా 7లో

ట్రూడౌన్‌పై మభ్యపరిచే ప్రచారం

- చిత్తశుద్ధి ఉంటే సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి
- విద్యుత్ టారిఫ్ తగ్గించాలి : వి.శ్రీనివాసరావు డిమాండ్

2

ప్రతి పేద కుటుంబానికీ ఇంటి పట్టా ఇవ్వాలి

- 1975లో విడుదల చేసిన జిఒను పునరుద్ధరించాలి
- టిడ్కో ఇళ్లు ఇవ్వకపోతే స్వాధీనానికి లబ్ధిదారులు సిద్ధం : వి.శ్రీనివాసరావు

3

విజయవాడ నిర్మల కాన్వెంట్ కేంద్రంలో పరీక్ష రాసేందుకు వెళ్తున్న పదో తరగతి విద్యార్థులు

టెన్త్ ప్రశాంతం

- నంద్యాల జిల్లాలో మారిన తెలుగు ప్రశ్నాపత్రం
- విధుల నుండి ఇన్విజిలేటర్‌ను రిలీవ్ చేసిన డిఇఒ
- చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌కు షోకాజు నోటీసులు

7

సమ్మె వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు

24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె

- విజయవంతం చేయాలని యుఎఫ్‌బియు పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బ్యాంకు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) ఈ నెల 24, 25 తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని ఎన్‌సిబిఇ నేషనల్ కౌన్సిల్ సభ్యులు వి.ఎస్.ఆర్ శేఖర్ కోరారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది మార్చిలో నిర్వహించిన ద్వైపాక్షిక సమావేశంలో ఇచ్చిన హామీలను 180 రోజుల్లో అమలు చేస్తామని చెప్పినా నేటికీ అమలు చేయలేదన్నారు. అన్ని ఆర్థిక రంగ సంస్థల్లో 5 రోజుల పని విధానం కొనసాగుతున్నా బ్యాంకుల్లో మాత్రం అమలు చేయడం లేదన్నారు. బ్యాంకుల్లో ఖాళీలను భర్తీ చేయడం లేదని, ఖాళీగా ఉన్న పర్మినెంట్ పోస్టులను ఔట్ సోర్సింట్ ఉద్యోగులతో భర్తీ చేయడం నిలిపివేయాలని కోరారు. బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బిఇఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి ఆర్.అజయ్ కుమార్ మాట్లాడుతూ... బ్యాంకుల్లో 1.51 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పర్మినెంట్ ఉద్యోగాలను క్యాజువలైజేషన్ చేయడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఆర్థిక రంగ సంస్థల్లో శాశ్వత ప్రాతిపదికనే ఉద్యోగుల నియామకం జరగాలన్నారు. సమ్మె కారణంగా ఖాతా దారులకు కలిగే అసౌకర్యాన్ని ప్రభుత్వం, బ్యాంక్ యాజమాన్యాలు బాధ్యత వహించాలన్నారు. నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాంక్ వర్కర్స్ మిగతా 7లో

కోరమండల్ గుర్తింపు సంఘం ఎన్నికల్లో సిహెచ్ఎన్ఆర్, బాషా ప్యానెల్ గెలుపు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖపట్నంలోని కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీలో సోమవారం జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులంతా కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఎంప్లాయీస్ యూనియన్ ప్యానెల్‌కు చారిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారు. తాజా ఎన్నికల్లో యూనియన్ అధ్యక్షులుగా సిహెచ్.నర్సింగరావు, ప్రధాన కార్యదర్శిగా ఎస్ఎం.బాషాను ఏకగ్రీవంగా గెలిపించారు. మొత్తం 351 మంది ఓటర్లకు గాను 344 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. జాయింట్ సెక్రటరీలుగా 259 ఓట్లతో ఎ.రామరాజు, 281 ఓట్లతో బి.విశ్వనాథ్, ఉపాధ్యక్షులుగా పి.సుధాకర్‌కు 300 ఓట్లు, 254 ఓట్లతో జె.సందీప్, 224 ఓట్లతో ఎం.దినకర్ గెలిచారు. వీళ్లంతా సిహెచ్.నర్సింగరావు, ఎస్ఎం.బాషా ప్యానల్ కావడం విశేషం. గెలుపొందిన ప్యానెల్‌కు సిఐటియు విశాఖ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కెఎం. శ్రీనివాస్, ఆర్‌కె ఎస్‌వి కుమార్ అభినందనలు తెలిపారు.

కనీస వేతనం ఇచ్చి కడుపు నింపండి

- హోరెత్తిన పంచాయతీ కార్మికుల నినాదాలు
- విజయవాడలో భారీ ధర్నా
- సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం : కె. ఉమామహేశ్వరరావు

విజయవాడలో ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

'కనీస వేతనం ఇచ్చి మా కడుపునింపండి. 'పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించండి. ప్రభుత్వం ఇచ్చిన జిఒలను, కోర్టు తీర్పులను వెంటనే అమలు చేయండి' అంటూ పంచాయతీ కార్మికుల నినాదాలతో విజయవాడ ధర్నా చౌక దద్దరిల్లింది. తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కార్మికులు తరలివచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బి.వెంకట్రామయ్య అధ్యక్షతన జరిగిన సభలో యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఉప్పు, పప్పు, కరెంటు బిల్లులు అన్నింటి ధరలు పెంచిన పాలకులకు గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుతున్న పంచాయతీ కార్మికులకు కనీస వేతనమిచ్చి కడుపునింపాలనే బుద్ధి మాత్రం కలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు నెలవారీ ఇచ్చే రూ.ఏడు వేల నుంచి తొమ్మిది వేల రూపాయల వేతనాలు కడుపు నింపుకోవడానికి సరిపోవన్నారు. మున్సిపల్ కార్మికుల తరహాలో గ్రామాల్లో అదే పని చేస్తున్న పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని కోరారు. పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాద బీమా, గతంలో ప్రభుత్వాలిచ్చిన మిగతా 7లో

ప్రతి నియోజకవర్గానికీ విజన్

- ఎమ్మెల్యే ఛైర్మన్, జిల్లాస్థాయి అధికారి స్పెషల్ ఆఫీసర్
- పి4పై చర్చలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

స్వర్ణాంధ్ర విజన్-2047 తరహాలో ప్రతీ నియోజకవర్గానికి విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. స్వర్ణాంధ్ర విజన్ 2047పై సోమవారం అసెంబ్లీలో లఘు చర్చ జరిగింది. దీనిలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ దీనిలో భాగంగా నియోజకవర్గ స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వీటిని అమలు చేసి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యేలు సంకల్పం తీసుకోవాలని చెప్పారు. నియోజకవర్గాలవారీ విజన్ రూపకల్పనకు కుప్పం, పిఠాపురం, మంగళగిరి, ఉరవకొండ నియోజకవర్గాలను పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేశామని తెలిపారు. ఏటా 15 శాతం వృద్ధిరేటు లక్ష్యంగా పెట్టుకున్నామని, 2047 నాటికి రూ.308 లక్షల కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే ఆశయంతో ఉన్నామని తెలిపారు. తలసరి ఆదాయం రూ.55 లక్షలకు చేరుకునేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. దీనికి సూక్ష్మం నుండి సూక్ష్మం అనే విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. దీనిలో భాగంగా మండల, మున్సిపాలిటీ విజన్ యాక్షన్‌ప్లానును గ్రామ, వార్డు సచివాలయం యూనిట్‌గా తీసుకుని అమలయ్యేలా చూస్తామని తెలిపారు. జిల్లా విజన్ డాక్యుమెంట్ రూపొందించి కలెక్టర్ల సదస్సులో విడుదల చేస్తామని, ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేస్తామని చెప్పారు. ప్రస్తుతం నెలకొన్న సమస్యలను ప్రజలు కూడా అర్థం చేసుకోవాలని, ఎమ్మెల్యేలు పరిశ్రమలను తరిమేయడం కాకుండా తీసుకురావడం నేర్చుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఉండాలని, ఉపాధి కలగాలంటే పరిశ్రమలు రావాలని, సేవల రంగం వృద్ధితో ఆదాయం పెరుగుతుందని పేర్కొన్నారు. ఒకప్పుడు అనంతపురం కరువు జిల్లాగా ఉండేదని, దానిపై ఎక్కువ దృష్టి పెట్టేవాళ్లమని చెప్పారు. ఇప్పుడు రాయలసీమ హార్టీకల్చర్ హబ్‌గానూ, విండ్, సోలార్, పంప్డ్ ఎనర్జీకి కేంద్రంగా మారుతోందని



పేర్కొన్నారు. ఇప్పుడు అనంతపురం జిల్లా 26 జిల్లాల్లో ఐదోస్థానంలో ఉందని, మొదటిస్థానానికి వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పస్తుతం నీళ్లున్నా ఎన్‌టిఆర్, శ్రీకాకుళం, ఆదిలాబాద్ జిల్లాల్లో అభివృద్ధి కనిపించడం లేదన్నారు. దీనికోసం రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, మున్సిపాలిటీ స్థాయిలో విజన్ ఫ్రేమ్‌వర్కు రూపొందించుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే 686 మండలాల్లో బలాలు, అవకాశాలను గుర్తించామని చెప్పారు. 2028-29కి ఐదేళ్ల ప్లానును కలెక్టర్ల మార్గదర్శకంలో రూపొందిస్తామని చెప్పారు. నియోజకవర్గాల్లో మైక్రోలెవల్ ప్లాను అమలు చేస్తామని వివరించారు.

ప్రతీ కుటుంబానికి సొంతిల్లు

నియోజకవర్గంలో ప్రతీ కుటుంబానికి ఇంటిస్థలం ఉండాలని, గ్రామీణ ప్రాంతాల్లో మూడుసెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇస్తామని చెప్పారు. గత ప్రభుత్వం సెంటుపట్టాను ఊరికి దూరంగా ఇచ్చిందని, దాంతో అవి ఎవరికీ పనికిరాకుండా పోయాయని తెలిపారు. సెంటుపట్టా ఉన్నచోటనే స్థలం కావాలంటే రెండు సెంట్లు ఇస్తామని, 2029 నాటికి ప్రతి కుటుంబానికి సొంతిల్లు నిర్మించి ఇస్తామని తెలిపారు.

2047 నాటికి నూరు శాతం అక్షరాస్యత

ప్రస్తుతం 5.3 కోట్లు ఉన్న జనాభా 2047 నాటికి 5.8 కోట్లకు పెరుగుతుందని 70 ఏళ్లుగా ఉన్న సగటు జీవితకాలం 85 ఏళ్లకు పెరుగుతుందని పేర్కొన్నారు. పట్టణ జనాభా 36 శాతం నుండి 60 శాతానికి చేరుకుంటుందని, నూరు శాతం అక్షరాస్యత సాధిస్తామని చెప్పారు. నిరుద్యోగ రేటు 4.1 శాతం నుండి 2 శాతానికి తగ్గుతుందని, ఎగుమతులూ రూ.1.68 లక్షల కోట్ల నుండి రూ.39.12 లక్షల కోట్లకు చేరుకుంటాయని చెప్పారు.

నియోజకవర్గాల వారీ ర్యాంకులు

విజన్ అమలు కోసం సంస్థాగత యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని, ఎమ్మెల్యే ఛైర్మన్‌గా, జిల్లా స్థాయి అధికారిని ప్రత్యేక అధికారిగా నియమిస్తామని తెలిపారు. వీరికి సహాయంగా యంగ్ ప్రొఫెషనల్, జివిఎస్‌డబ్ల్యుఎస్ నుండి ఐదుగురిని నియమిస్తామని చెప్పారు. దీన్ని నియోజవకర్గ మోనటరింగ్ యూనిట్ పర్యవేక్షిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే, ప్రత్యేకాధికారికి సమర్థత, జవాబుదారీతనం పెంచేందుకు కీ ఫెర్మార్మెన్స్ ఇండికేటర్స్ అధారంగా చేసుకుని ర్యాంకులను నియోజకవర్గం వారీగా ఇస్తామని తెలిపారు. నెలకోసారి పురోగతిని పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు. సిఎస్ రెండు నెలలకు, సిఎం మూడు నెలలకు ఒకసారి విజన్ అమలును సమీక్షిస్తారని వివరించారు.

ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత మేలు

ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత ఎక్కువ ఉపయోగం ఉంటుందని సిఎం అన్నారు. తన ప్రసంగంలో ఈ అంశాన్ని ప్రస్తావించిన ఆయన భాషను ద్వేషించడంలో అర్థం లేదన్నారు. మాతృభాష తెలుగు, హిందీ జాతీయ భాష, అంతర్జాతీయ భాష ఇంగ్లీషని అన్నారు. తెలుగువాళ్లు జపాన్, జర్మనీ ఇతర దేశాలకు వెళుతున్నారని, అవసరమైతే ఆ భాషలను ఇక్కడే మనం నేర్చుకుంటే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

మాతృభాషలో చదువుకున్నవారే ప్రపంచవ్యాప్తంగా రాణించారని చెబుతూనే సిఎం ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. భాషలపై లేనిపోని రాజకీయాలు చేయడం మంచిది కాదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. విజన్‌పై లఘు చర్చ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

అప్పటి ఓటమికి నేనే కారణం

2004, 2019లో పనిలో పడి కొన్ని పనులు చేయలేకపోవడం వల్ల ఓటమి పాలయ్యామని, దానికి తానే కారణమని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రజాసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాలని తెలిపారు.

పేదలను దత్తత తీసుకుంటే అవార్డులు

రాష్ట్రంలో 35 లక్షల మంది అట్టడుగుస్థాయిలో ఉన్నారని, వారికి మొదటిదశ కింద 20 లక్షల మందిని, రెండోదశలో 15 లక్షల మందిని పి4లో భాగస్వాములను చేస్తామని తెలిపారు. పేదలను దత్తత తీసుకునే వారికి ప్రభుత్వం తరపున అవార్డులు, గుర్తింపు ఇచ్చి గౌరవిస్తామని తెలిపారు. ప్రతి కుటుంబానికి కనీస సదుపాయాలు కల్పించడం బాధ్యతగా తీసుకుంటామని చెప్పారు. పి4. జీరోపావర్టీ, బ్లూఎకానమీ, నాలెడ్జ్ ఇన్నోవేషన్, వంటి పలు అంశాలపై స్టీరింగ్ కమిటీ ఉంటుందని, వీటన్నింటికీ అత్యుత్తమస్థాయిలో లీడర్‌షిప్ కౌన్సిల్ ఉంటుందని పేర్కొన్నారు. 2029 నాటికి హామీలన్నీ అమలు చేస్తామని తెలిపారు. లఘు చర్చలో గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కొలికిపూడి శ్రీనివాసరావు మాట్లాడారు.

సహకార కేంద్ర బ్యాంకుల్లో రూ.వేలకోట్ల అవినీతి

- విచారణకు హౌస్ కమిటీ వేయాలి
- టిడిపి సభ్యులు యార్లగడ్డ, ధూళిపాళ్ల, కూన రవికుమార్
- కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భారీ అవినీతి నిజమే : మంత్రి అచ్చెన్న

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సహకార కేంద్ర బ్యాంకుల్లో 2019-24 మధ్య రూ.వేల కోట్ల అవినీతి జరిగిందని, హౌస్ కమిటీ వేసి, ఐఎఎస్ అధికారిని విచారణాధికారిగా నియమించాలని ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, ధూళిపాళ్ల నరేంద్ర, కూన రవికుమార్, రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో 'సహకార కేంద్ర బ్యాంకుల్లో అవినీతి'పై చర్చ జరిగింది. చర్చలో పాల్గొన్న సభ్యులు మాట్లాడుతూ.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో (పిఎసిఎస్) సెక్రటరీలు దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేస్తుండటం, సెంట్రల్ బ్యాంకుకు సంబంధం లేని వాటికి రుణాలివ్వడం, ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకాలు, డాక్యుమెంట్లు నకిలీతో రూ.వేలకోట్లు అవినీతికి పాల్పడ్డారని సభ దృష్టికి తీసుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.5 వేలకోట్ల అవినీతి జరిగిందని, గుంటూరు జిల్లాలోనే రూ.600 కోట్లకు పైగా ఆప్కాబ్ ఎమ్‌డితో పాటు అధికారులు, సిబ్బంది, రాజకీయ నేతలు కుమ్మక్కై, రుణాల పేరుతో నిధులను కాజేశారని ఆరోపించారు. తక్షణమే ఆప్కాబ్ ఎమ్‌డిని బదిలీ చేయాలని, డిసిసిబిలపై వేసిన విచారణ ఎప్పటికి పూర్తవుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ విషయంపై మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ.. 2019-24 మధ్య భారీ స్థాయిలో అవినీతి జరిగిన మాట నిజమేనన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో భారీ అవినీతి జరిగిందన్నారు.

ఇందుకు సంబంధించి పూర్తి స్థాయి విచారణ జరిపిస్తున్నామని, హౌస్ కమిటీ విషయంపై సిఎంతో చర్చిస్తానని తెలిపారు. పిఎసిఎస్‌లో దీర్ఘకాలంగా సెక్రటరీలు ఒకచోట పనిచేస్తుండటం వల్లే అవకతవకలు భారీగా జరిగాయని, అందువల్ల వారిని బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించి ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఉద్యోగులు వెంటనే హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారని, అందువల్ల బదిలీ ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. స్టే ఎత్తివేత గురించి ఎజితో మాట్లాడుతున్నట్లు మంత్రి తెలిపారు.

సభ్యులకు పూర్తి స్థాయి సమాధానాలు రావడం లేదు : కూన రవికుమార్

పేర్లు ఇచ్చిన సభ్యులకు తాము అడిగిన ప్రశ్నలకు పూర్తి స్థాయి సమాధానాలు రావడం లేదని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సభ దృష్టికి తీసుకొచ్చారు. సభ్యులకు కేవలం అవునండి, లేదండి, ఆ ప్రశ్న ఉద్భవించదు.. అనే సమాధానాలు మాత్రమే అందుతున్నాయని, ఈ సమాధానాలతో ఎలా తాము ప్రశ్న అడగాలని ప్రశ్నించారు. అధికార యంత్రాంగం పూర్తి స్థాయి సమాధానాలు ఇవ్వకుండా సభను పక్కదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ఇదే విషయంపై స్పందించిన మంత్రి అచ్చెన్నాయుడు.. సభ్యులు ప్రశ్నించే సమయంలో సమాధానాలు కాపీని ఒకసారి చూసుకుని అడగాలని, సమాధానాలు ఇచ్చారు కదా అని అన్నారు. దీంతో కూన రవికుమార్ మాట్లాడుతూ.. ఏ సభ్యునికీ సమాధానాలు పూర్తిస్థాయిలో రావడం లేదన్నారు. గతంలో సిగ్నేచర్ సభ్యులకు ఒకరోజు ముందు సమాధానాలు కాపీ అందించేవారన్నారు. చర్చలో డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు జోక్యం చేసుకుంటూ సభ్యులకు పూర్తి స్థాయి సమాధానాలు అందకపోవడం తమ వైఫల్యమేనని, అటువంటి పొరపాటు ఇకపై లేకుండా చూసుకుంటామన్నారు.

ముందస్తు బెయిల్ కోరుతూ ఎంపి మిథున్‌రెడ్డి పిల్

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కొనుగోళ్లలో అక్రమాలపై సిఐడి నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ రాజంపేట ఎంపి పివి మిథున్‌రెడ్డి సోమవారం హైకోర్టును ఆశ్రయించారు. గతేడాది సెప్టెంబర్‌లో సిఐడి పెట్టిన కేసులో గత వారం ఓ ప్రభుత్వాధికారిపై ఒత్తిడి చేయించి తనకు వ్యతిరేకంగా వాంగ్మూలం ఇప్పించారని, ఈ కేసులో తనను ఇరికించే అవకాశం ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన పిటిషన్‌లో కోరారు. కుప్పం నియోజకవర్గంలో సిఎం చంద్రబాబుకు వ్యతిరేకంగా తనతోపాటు తన తండ్రి కూడా పనిచేస్తున్నందున కక్షసాధింపుతో తప్పుడు కేసు నమోదు చేయాలనే కుట్ర జరుగుతోందన్నారు. వైసిపి అధికారంలో ఉండగా కొత్త డిస్టలరీకి ఒక్కటి కూడా అనుమతి ఇవ్వలేదన్నారు. 2014-19 వరకు ఉన్న బ్రాండ్లే ఉన్నాయన్నారు. 2019కు ముందు ఖరారు చేసిన ధరలే అమలయ్యాయని చెప్పారు. కేబినెట్ ఆమోదంతోనే ఎక్సైజ్ పాలసీ అమలైందన్నారు.

అణు ప్లాంటు ప్రతిపాదన విరమించుకోవాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజల జీవనానికి, పర్యావరణానికి ముప్పు కలిగించే అణు విద్యుత్ ప్లాంటును అనకాపల్లిలో పెట్టాలనే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సోమవారం లేఖ రాశారు. అణు విద్యుత్ ప్లాంటు కోసం అనకాపల్లి జిల్లాలో రెండువేల ఎకరాల భూమిని కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేంద్ర ప్రభుత్వం కోరినట్లు వార్తలు వస్తున్నాయని తెలిపారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను విరమించుకునేటట్లు చూడాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంటు నిర్మాణంతో ఆంధ్ర ప్రజానీకం తీవ్రంగా ఆందోళన చెందుతున్నారని, అనకాపల్లి జిల్లాలో అణు విద్యుత్ ప్లాంటు నిర్మాణానికి ప్రతిపాదనలు వచ్చాయని తెలిసి ఆ ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని పేర్కొన్నారు. అణు విద్యుత్ ఎంత ప్రమాదకరమైనదో సిఎంగా మీకు తెలియందికాదని, అంతర్జాతీయంగా రష్యాలో చెర్నోబిల్, అమెరికాలో ఐస్లాండ్, 2011లో జపాన్‌లోని ఫుకుషిమాలో అణు ప్రమాదాల తరువాత ప్రపంచ దేశాలన్నీ అణు విద్యుత్ కేంద్రాల ఆలోచనలను విరమించుకున్నాయని పేర్కొన్నారు. అమెరికా తమ దేశంలో ఉన్న నాలుగు అణు విద్యుత్ కేంద్రాలను మూసివేసిందని, ఈ నేపథ్యంలో అనకాపల్లి జిల్లాలో న్యూక్లియర్ పవర్ ప్లాంటు నిర్మాణానికి అనుమతులుంటే ఆంధ్ర రాష్ట్ర మొత్తం పెను ప్రమాదంలోకి వెళుతుందని పేర్కొన్నారు. గాలి, నీరు, పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఈస్ట్రన్ నేవల్ కమాండ్, వైజాగ్ స్టీల్‌ప్లాంటు, హిందుస్తాన్ షిప్‌యార్డు, నేవల్ డాక్‌యార్డు, విశాఖపట్నం, గంగవరం పోర్టులు, ఎన్‌టిపిసి, బార్క్, ఫార్మా పరిశ్రమలు, ఎస్ఇజెడ్, ఎన్ఎఒబి వంటి కీలకమైన రంగాలు, పరిశ్రమలు ఉన్నాయని తెలిపారు. అణు ప్రమాదం జరిగితే క్షణాల్లో ఈ ప్రాంతం విధ్వంసం అవుతుందని, దీని తీవ్రత 80 కిలోమీటర్ల వరకూ ఉంటుందని పర్యావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారని పేర్కొన్నారు. 30 కిలోమీటర్ల పరిధిలో అణుధార్మిక ప్రభావం ఉంటుందని, ప్రజల జీవితాలపై దుర్భర ప్రభావం పడుతుందని తెలిపారు. ఇప్పటికే సముద్రతీరమంతా ఫార్మా కంపెనీలతో కలుషితమైందని, సంప్రదాయ మత్స్యకారులు తీవ్ర అన్యాయానికి గురయ్యారని వివరించారు. 1984లో భోపాల్‌లో జరిగిన గ్యాస్ ప్రమాదంలో వేలాదిమంది ప్రజలు దీర్ఘకాలిక వ్యాధులతో అక్కడ బాధపడుతూనే ఉన్నారని, ఈ ప్రమాద దుర్ఘటన వల్ల కలిగిన నష్టాన్ని పూడ్చుకోవాలంటే వందల సంవత్సరాలు పడుతుందని అనుభవం తెలుపుతుందని వివరించారు. 2020లో విశాఖలో ఎల్‌జి పాలిమర్స్ విషవాయువుల లీకేజీ ప్రమాదం ఎంత విషాదం సృష్టించిందో అందరికీ విదితమేనని, 2024 ఆగస్టు 21న అచ్యుతాపురం ఎస్ఇజెడ్‌లో ఎసెన్షియా ఫార్మా ప్రమాదంలో 17 మంది మరణించి 39 మంది క్షతగాత్రులయ్యారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నాయని, వీటితో పోల్చుకుంటే అణు విద్యుత్ తీవ్రమైన రేడియేషన్ కలిగి ఉంటుందని పేర్కొన్నారు. కేన్సర్, ఎక్యూట్ రేడియేషన్ సిండ్రోమ్, ఎనీమియా వంటి ప్రమాదకర వ్యాధులు వస్తాయని తెలిపారు. ఈ నేపథ్యంలో దేశ భద్రతాపరంగానూ, ప్రజల ఆరోగ్యం, జీవనోపాధి దృష్ట్యా అణు విద్యుత్ ప్లాంటుకు భూములు కేటాయించరాదని, విద్యుత్ పెంపునకు సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్, పర్యావరణహిత గ్రీన్ ఎనర్జీ వంటి అనేక ప్రత్యామ్నాయ మార్గాలు ఉండగా విషతుల్యమైన అణు విద్యుత్ ప్లాంటుకు అనుమతులు ఇవ్వొద్దని కోరారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఈ ప్లాంటు ప్రతిపాదనను ఉపసంహరించుకునేలా చూడాలని శ్రీనివాసరావు కోరారు.

ట్రూడౌన్‌పై మభ్యపరిచే ప్రచారం

- చిత్తశుద్ధి ఉంటే సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి
- విద్యుత్ టారిఫ్ తగ్గించాలి
- వి.శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విద్యుత్ భారాలపై కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించాలని, ట్రూడౌన్ పేరుతో మభ్యపరిచే ప్రచారం సరికాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఎపి ట్రాన్స్‌లో 2014-19 సంవత్సరాలకు సంబంధించి రూ.1050 కోట్లు, ఆదాయ వ్యయాల్లో మిగులు వచ్చిందని ఆ మేరకు ట్రూ డౌన్ ద్వారా వినియోగదారులకు భారం తగ్గిస్తున్నట్లు మీడియాలో వచ్చిన కథనాలను ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ తొమ్మిది నెలల కాలంలో విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోగా రూ15,485 కోట్లను అదనంగా సర్దుబాటు ఛార్జీల భారాన్ని ప్రజలపై మోపి, బలవంతంగా వసూలు చేస్తుందని తెలిపారు. ఇది కాకుండా యూనిట్‌కు ప్రతినెలా రూ.0.40 పైసలు చొప్పున సర్దుబాటు ఛార్జీలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ వాస్తవాలను మభ్యపరచి ఛార్జీలు తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రజలను మభ్యపెట్టే విధంగా ప్రచారానికి పూనుకోవడం తగదన్నారు. ఎపి ట్రాన్స్‌కో కోవిడ్ సమయంలో నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు తదితర అభివృద్ధి కార్యక్రమాలను నిలిపేసిందని, కొత్త ప్రాజెక్టులు చేపట్టలేదని, దీనివల్ల అంచనాల్లో చూపిన అభివృద్ధి వ్యయం చేయలేదని తెలిపారు. దీంతో మిగులు ఏర్పడిందని పేర్కొన్నారు. ఈ వాస్తవాలను మరుగునపరచి కూటమి ప్రభుత్వం భారాల తగ్గింపు గురించి ఆలోచన చేస్తున్నట్లు ప్రచారానికి దిగడం హాస్యాస్పదమని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని ఇచ్చిన హామీ పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే పెంచిన సర్దుబాటు ఛార్జీల భారాలను పూర్తిగా రద్దు చేయాలని కోరారు. ట్రాన్స్‌కోలో వచ్చిన మిగులు ద్వారా రూ.1000 కోట్లు ట్రూడౌన్ చేసి విద్యుత్ టారిఫ్‌ను కూడా తగ్గించాలని కోరారు. వినియోగదారులు వాస్తవాలను గమనించి విద్యుత్ సర్దుబాటు ఛార్జీల భారాలపై ఆందోళనకు సిద్ధం కావాలని, ఈ నెల 28న జరగనున్న ధర్నాలను జయప్రదం చేయాలని శ్రీనివాసరావు కోరారు.

మా భూములు లాక్కోవద్దు

- ఆర్‌డిఒ కార్యాలయాన్ని ముట్టడించిన బిపిసిఎల్ భూ బాధితులు
- భూ సేకరణ ఉపసంహరించుకోకపోతే ఆందోళనలు తీవ్రతరం : వెంకటేశ్వర్లు

కావలి ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న వ్యకాస నాయకులు, ఆయా గ్రామస్తులు

ప్రజాశక్తి-నెల్లూరు

బిపిసిఎల్ కంపెనీ నిర్మాణం కోసం తమ భూములను బలవంతంగా లాక్కోవద్దని నెల్లూరు జిల్లా కావలి మండలం ఆనిమడుగు, మొండి దిన్నె పాలెం, కట్టకిందపాలెం, భైనోడిపాలెం, ఆకుతోట, గ్రామాల రైతులు కావలి ఆర్‌డిఒ కార్యాలయాన్ని ముట్టడించారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. తమ సమస్యలకు పరిష్కారం చూపే వరకూ ఇక్కడి నుంచి కదిలేది లేదని ఆయా గ్రామస్తులు భీష్మించుకూర్చున్నారు. ఈ సమస్య తమ పరిధిలోనిది కాదని పై అధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డిఒ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... కావలికి కూత వేటు దూరంలోని గ్రామాల్లో సుమారు 1200 కుటుంబాలు జీవిస్తున్నాయన్నారు. మూడు పంటలు పండే సారవంతమైన భూములను ప్రభుత్వం బలవంతంగా లాక్కొని రైతుల కడుపు కొట్టడం బాధాకరమన్నారు. 2013 భూసేకరణ చట్టప్రకారం బహుళ పంటలు పండే భూములు తీసుకోకూడదని, గ్రామ సభలు పెట్టి ప్రజాభిప్రాయ సేకరణ తీసుకోవాలని, 80 శాతం ఆమోదం పొందాలని తెలిపారు. చట్టాన్ని అధికారులు తుంగలో తొక్కి ప్రజలకు ఎలాంటి సమాచారం లేకుండా పత్రికల్లో ప్రకటనలు ఇచ్చి భూములు లాక్కోవాలని చూడటం బాధాకరమన్నారు. భూ సేకరణ ఉపసంహరించుకోకపోతే మార్చి 25 తర్వాత ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళ పుల్లయ్య, జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమరాజు, రైతు సంఘం నాయకులు గడ్డం మాల్యాద్రి, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

వాళ్లు 16 నెలలకు ఇచ్చారు.. మేమూ ఇస్తాం

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సమాధానం చెప్పారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన 16 నెలలు తరువాత టిడిపి ప్రభుత్వంలో ఉన్న బకాయిలను చెల్లించిందని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చి 10 నెలలే అవుతుందని, బకాయిలను త్వరలో చెల్లిస్తామని వెల్లడించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని వైసిపి సభ్యులు తలశిల రఘురామ్, టి కల్పలత, పి చంద్రశేఖర్ రెడ్డి శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో భాగంగా అడిగారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇబిసి, కాపు, మైనార్టీ విద్యార్థుల 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.3,169.30 కోట్లు ఉన్నాయని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చెప్పారు. ఈ సందర్భంగా వైసిపి సభ్యులు మాట్లాడుతూ.. బకాయిలు ఉండటంతో యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించడం లేదన్నారు.

వలంటీర్లు లేరు : మంత్రి డోలా

రాష్ట్రంలో వలంటీర్లు లేరని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. వలంటీర్ల సంఖ్యతోపాటు వారికి గౌరవ వేతనం పెంచేందుకు ఏమైనా ప్రతిపాదనలు ఉన్నాయా? అని వైసిపి సభ్యులు పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, రాజగోళ్ల రమేష్ యాదవ్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ సందర్భంగా సభ్యులు రామసుబ్బారెడ్డి, రమేష్, ఎం అరుణ్‌కుమార్, వి కళ్యాణి, తోట త్రిమూర్తులు మాట్లాడుతూ.. వలంటీర్ల గౌరవ వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం హామీ కూడా ఇచ్చిందని, విజయవాడలో వచ్చిన వరదల్లో బాధితులకు సహాయం అందించేందుకు ప్రభుత్వం వలంటీర్లను ఉపయోగించుకుందని అన్నారు. మంత్రి డోలా మాట్లాడుతూ.. వలంటీర్లకు వేతనం పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని, అయితే ఆ వ్యవస్థే లేదని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం వీరిని రెన్యువల్ చేయలేదన్నారు. లేనివారికి జీతాలు ఎలా పెంచుతామని ప్రశ్నించారు. రెన్యువల్ చేయనప్పుడు వేతనాలు పెంచుతామని ఎలా హామీ ఇచ్చారని వైసిపి సభ్యులు నిలదీశారు.

వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి

- ఎపి గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్ ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ధనలక్ష్మి

ప్రభుత్వ సేవలనూ, సంక్షేమ పథకాలనూ ప్రజలకు అందించిన వలంటీర్లను రాష్ట్ర ప్రభుత్వం రోడ్డున పడేసిందని ఎపి గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మి, విమర్శించారు. గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వలంటీర్లు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, బలవంతంగా రాజీనామా చేయించిన వారిని తిరిగి కొనసాగించాలని నినాదాలు చేశారు.

ఈ సందర్భంగా యూనియన్ నాయకులు పిజానీ, శ్యామల అధ్యక్షతన జరిగిన సభలో ధనలక్ష్మి మాట్లాడుతూ.. వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, వలంటీర్ల వేతనాన్ని రూ.10 వేలకు పెంచుతామని కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసి వారి ఉపాధిని కాపాడాలని అన్నారు. వలంటీర్లలో మహిళలే ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, ఎన్నికల్లో ఆడపడుచులకు న్యాయం చేస్తామని మాట్లాడిన పవన్ కల్యాణ్ డిప్యూటీ సిఎం అయిన తర్వాత వలంటీర్లు, కార్మికుల సమస్యలపై నోరు మెదపడం లేదన్నారు. పుట్టని బిడ్డకు పేరు ఎలా పెడతారని అడుగుతూ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి వంటి వారు వలంటీర్ల వ్యవస్థను అవమానిస్తున్నారన్నారు. పుట్టని బిడ్డలతో వరదల్లో ఎలా పనిచేయించుకున్నారో చెప్పాలని ప్రశ్నించారు. వలంటీర్లను వైసిపి కార్యకర్తలు అంటూ వారిని మేము నెత్తిన పెట్టుకోవాలా? అని మంత్రి లోకేష్ అనడం తగదన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఉమామహేశ్వరరావు ధర్నాకు సంఘీభావం ప్రకటించారు. న్యాయమైన సమస్యల పరిష్కారానికి వలంటీర్లు ఐక్యంగా రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. వారి పోరాటానికి సిఐటియు అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు ప్రసాద్, సిహెచ్ సుబ్రహ్మణ్యం, కుమార్, రంజిత్, కె పద్మావతి, జి దేవయ్య, రాధిక, కె చిన్నయ్య, జి తాతారావు, కె కృష్ణారావు, కళావతి, భాను, ఎస్ రవి తదితరులు పాల్గొన్నారు.

పలు యూనియన్‌ల సంఘీభావం

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, మున్సిపల్ ఆశా వర్కర్స్ యూనియర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి రమాదేవి, కోశాధికారి ఎ కమల, గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు పోలినాయుడు తదితరులు వలంటీర్ల ధర్నాకు సంఘీభావం ప్రకటించారు.

ఉద్యోగ భద్రత సర్క్యులర్ అమలు చేయాలి

- ఆర్‌టిసి కమిషనర్‌కు ఎస్‌డబ్ల్యూఎఫ్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ ఆర్‌టిసిలో ఉద్యోగ, కార్మికుల ఉద్యోగ భద్రతకు ఉపయోగపడే 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, జిఓ 70లో సమూల మార్పులు చేయాలని ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆర్‌టిసి కమిషనర్ ద్వారకా తిరుమలరావుకు యూనియన్ నాయకులు సోమవారం ఆర్‌టిసి హౌస్‌లో వినతిపత్రం అందించారు. ప్రభుత్వంలో ఆర్‌టిసిని విలీనం చేసిన సందర్భంలో గత ప్రభుత్వం ఉద్యోగ భద్రతకు ఇచ్చిన సర్క్యులర్ 1/2019లోని అంశాలను అమలు చేయకుండా నిలిపేసిందని ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవాధ్యక్షులు జిలానీ బాషా వివరించారు. ఫలితంగా ఆర్‌టిసిలో వందల మంది ఉద్యోగ, కార్మికులు అక్రమ సస్పెన్షన్‌లు, ఉద్యోగ తొలగింపులకు గురవుతున్నారని, క్యుములేటివ్ ఇంక్రిమెంట్లలో కోత పడుతోందని తెలిపారు. ఏడాదిన్నర క్రితం ఆర్‌టిసి కార్మికుల కాండక్ట్ రెగ్యులరైజేషన్‌పై ఇచ్చిన జిఓ నెంబర్ 70లో అనేక కార్మిక, రాజ్యాంగ వ్యతిరేక అంశాలున్నాయని అన్నారు.

జిఓలో మార్పుల కోసం, 1/2019లో సర్క్యులర్ అమలు కోసం కింద స్థాయి అధికారులకు ఉత్తర్వులు ఇవ్వడానికి అసోసియేషన్‌ల అభిప్రాయాలు తీసుకోవాలని, సమస్యల పరిష్కారానికి ఆర్‌టిసి ఉద్యోగ సంఘాలతో చర్చించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రెసిడెంట్ సిహెచ్ సుందరరావు, ప్రధాన కార్యదర్శి ఎం అయ్యపరెడ్డి, కట్టా సుబ్రహ్మణ్యం, ట్రెజరర్ జె దినకర్, కార్యదర్శి పట్టాభిరామ్ తదితరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీల ఆస్తుల రక్షణకు చర్యలు

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

గ్రామ పంచాయతీల ఆస్తుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. గ్రామ పంచాయతీల ఆస్తులను గుర్తించి జిల్లా గెజిట్లో ప్రచురించే అంశాన్ని అమలుకు ప్రయత్నించాలంది. చట్ట ప్రకారం అన్ని చర్యలూ తీసుకోవాలంది. గ్రామ పంచాయతీ ఆస్తుల రక్షణకు తీసుకున్న చర్యలను నివేదించాలంది. విచారణను ఏప్రిల్ 30కు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది. ఎపి గ్రామ పంచాయతీల ఆస్తుల రక్షణ నిబంధనలు 2011 ప్రకారం ప్రతి పంచాయతీ ఆస్తులను గుర్తించి వాటిని జిల్లా గెజిట్లో ప్రచురించాలంటూ కృష్ణా జిల్లాకు చెందిన సబ్బెల వీర వెంకట సత్యనారాయణరెడ్డి పిల్ దాఖలు చేశారు. గ్రామ పంచాయతీల ఆస్తులు పలు ఆక్రమణలకు గురవుతున్నాయని పేర్కొన్నారు. ఆస్తుల రక్షణకు చట్టాలున్నా అమలు కావడం లేదన్నారు. ఆస్తులను గుర్తించి వాటిని జిల్లా గెజిట్లో ప్రచురించేందుకు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు.

ప్రతి పేద కుటుంబానికీ ఇంటి పట్టా ఇవ్వాలి

- 1975లో విడుదల చేసిన జిఓను పునరుద్ధరించాలి
- టిడ్కో ఇళ్లు ఇవ్వకపోతే స్వాధీనానికి లబ్ధిదారులు సిద్ధం : వి.శ్రీనివాసరావు

భీమవరం కలెక్టరేట్ వద్ద సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- భీమవరం

రాష్ట్రంలో ఇంటి పట్టాలు లేని నిరుపేద కుటుంబాలు 20 లక్షల వరకూ ఉన్నాయని, ప్రతి కుటుంబానికీ ఇంటి పట్టా ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కోరారు. ప్రభుత్వ భూమిలో నివాసం ఉంటున్న నిరుపేదల ఇళ్లను అన్యాయంగా తొలగిస్తున్నారని, ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటే ఇంటి పట్టా ఇవ్వొచ్చని 1975లో జిఒ ఇచ్చారని, ఆ జిఒను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఇంటి పట్టాలు, టిడ్కో గృహాల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లాలో చేపట్టిన ప్రజా చైతన్య సైకిల్ యాత్ర ముగింపులో భాగంగా భీమవరంలోని కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో నిరుపేదలు, లబ్ధిదారులు తరలొచ్చారు. ఇళ్లు, ఇళ్ల స్థలాల సమస్యలతోపాటు రేషన్ కార్డులు, పింఛన్లు, రోడ్లు, డ్రెయినేజీ సమస్యలపై వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అభివృద్ధి గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు గొప్పలు చెప్తున్నారని, ఎవరిని అభివృద్ధి చేస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పటి టిడిపి ప్రభుత్వం ఆర్భాటంగా నిర్మించిన టిడ్కో గృహాలు దెయ్యాల కొంపలను తలపిస్తున్నాయన్నారు. 60 ఏళ్లపాటు ఉండాల్సిన ఇళ్లు 20 ఏళ్లకే ధ్వంసమవుతున్నాయని తెలిపారు. తక్షణం టిడ్కో ఇళ్లను అప్పగించకపోతే లబ్ధిదారులే వాటిని స్వాధీనం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. ప్రజాసమస్యలను పక్కన పెట్టి కొంతమంది ఎంఎల్ఎలు, మంత్రులు దుకాణం పెట్టుకుని మరీ డబ్బులు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ స్థలంలో నివాసం ఉంటే ఇల్లు తొలగించడమే కాకుండా పట్టాలు ఇవ్వట్లేదని, సాక్షాత్తూ ముఖ్యమంత్రి అనధికార లేఅవుట్‌లో నివాసం ఉంటున్నారని, ఆయన ఇల్లు తొలగించే ధైర్యం ఉందా? ప్రశ్నించారు. గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇస్తామని ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదన్నారు. మంత్రులు, ఎంఎల్ఎలు, ఇచ్చే ప్రతి హామీకి చట్టబద్ధత తేవాలని కోరారు. ఒక ప్రత్యేకమైన చట్టాన్ని రూపొందిస్తే వాగ్దానాలను ఉల్లంఘించకుండా ఉంటారని అన్నారు. పన్నులు, భారాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు.

మొత్తం ట్రూఅప్ ఛార్జీలను వెనక్కి తీసుకోవాలి

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొమ్మిది నెలల కాలంలో రూ.16 వేల కోట్లు ట్రూఅప్ ఛార్జీలను వేసిందని వి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రస్తుతం రూ.వెయ్యి కోట్లు తగ్గిస్తున్నామని చెబుతున్నారని, ట్రూఅప్ ఛార్జీలను మొత్తం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అని గొప్పలు చెప్పుకుంటున్నారని, ప్రజల సమస్యల పట్ల స్లో ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా ప్రభుత్వం తీరు ఉందని అన్నారు. స్పీడ్ ఆఫ్ పీపుల్ డూయింగ్ బిజినెస్‌గా ఉండాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి రాబోయే రోజుల్లో పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వ విధానాల మధ్య పెద్ద తేడా ఏమీ లేదని వివరించారు. సమస్యలు పరిష్కరించకపోగా వివిధ రకాల భారాలు మోపడం సిగ్గుచేటన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో నివసిస్తున్న వారికి ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇళ్ల పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా ప్రాంతానికి వచ్చిన జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లుకు, జిల్లా గృహనిర్మాణ శాఖ ఇఇ రమణకు సైకిల్ యాత్రలో వచ్చిన సమస్యలను వినతిపత్రం రూపంలో అందజేశారు. వాటి పరిష్కారానికి బాధితులు, సిపిఎం నేతలతో ప్రత్యేక సమావేశాన్ని జిల్లా కలెక్టర్‌తో ఏర్పాటుకు కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. సభకు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వాసుదేవరావు అధ్యక్షత వహించగా రాష్ట్ర నాయకులు వై.రాము, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు, కవురు పెద్దిరాజు, కర్రి నాగేశ్వరరావు, కేత గోపాలన్, పివి.ప్రతాప్, సీనియర్ నాయకులు జుత్తిగ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

హంద్రీనీవా కాలువ వెడల్పుతోనే ప్రయోజనం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

ప్రజాశక్తి-ఉరవకొండ

హంద్రీనీవా కాలువను పది వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేసి ఆయకట్టుకు నీరు అందిస్తేనే రైతులకు ప్రయోజనం చేకూరుతుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.రాంభూపాల్ అన్నారు. అనంతపురం జిల్లా ఉరవకొండ ప్రాంతంలోని ఇంద్రావతి, ముష్టూరు గ్రామాల్లో జరుగుతున్న కాలువ పనులను సిపిఎం బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ.. హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు ప్రారంభించడాన్ని సిపిఎం స్వాగతిస్తోందన్నారు. అయితే ఎన్నికల ముందు టిడిపి కూటమి నేతలు ఇచ్చిన హామీ మేరకు పది వేల క్యూసెక్కుల సామర్థ్యంతో వెడల్పు చేయకుండా పాత డిజైన్ ప్రకారం 3850 క్యూసెక్కుల కంటే తక్కువకు కాలువ సామర్థ్యం కుదించడం సరికాదన్నారు. హంద్రీనీవా కాలువలు వెడల్పు చేయకుంటే అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలను ఎలా అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. రాయలసీమ అభివద్ధి కావాలంటే సాగునీటి వనరుల అభివృద్ధి కీలకమన్నారు. హంద్రీనీవా డిస్ట్రిబ్యూటరీలు పూర్తి చేసి ఆయకట్టును స్థిరీకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్పందించి ముఖ్యమంత్రితో ఈ అంశంపై సానుకూల నిర్ణయం ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రంగారెడ్డి, మధుసూదన్, శ్రీనివాసులు, మురళి, రామాంజనేయులు, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - ఫిరంగిపురం (గుంటూరు జిల్లా)

అప్పుల బాధ తాళలేక కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం 113 తాళ్లూరులో సోమవారం వెలుగు చూసింది. ఎస్ఐ బి రవీంద్రబాబు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన డేగల వెంకట సత్యనారాయణ (36) నాలుగేళ్ల నుండి కౌలుకు పొలం తీసుకుని మిర్చి సాగుచేస్తున్నారు. ఈ ఏడాది రెండున్నర ఎకరాల్లో పంట వేశారు. నష్టం రావడంతో తీవ్ర మానస్తాపానికి గురై ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో వెంకట సత్యనారాయణ ఉరేసుకున్నారు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరులోని ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. సత్యనారాయణకు భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

రాష్ట్ర మహాసభ జయప్రదం చేయండి

- ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం

రాష్ట్ర మహాసభ ఆహ్వాన సంఘ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి - భీమవరం

రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార మార్గాలు, ప్రభుత్వ విధానాలు, తదితర అంశాలపై చర్చించేందుకు జరుగుతున్న రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఏడో మహాసభను జయప్రదం చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి గురుశేఖర్ అధ్యక్షతన భీమవరం మున్సిపల్ పట్టణ పరిధిలోని చంద్రిక హోటల్ వద్ద సోమవారం జరిగిన రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆహ్వాన సంఘ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది రజక జనాభా నివసిస్తున్నారని, దేశానికి స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లైన రజకులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఇప్పటికీ అణచివేతకు గురవుతున్నారని పేర్కొన్నారు. గత మూడేళ్లలో సంఘం నిర్వహించిన కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రజక అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్‌కు విధివిధానాలు రూపొందించకపోవడం, బడ్జెట్‌లో కేటాయించిన నిధులను రజకుల అభ్యున్నతికి, సంక్షేమానికి ఖర్చు చేయకుండా ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం వల్ల వారి స్థితిగతులు నేటికీ దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా కొండపల్లి పట్టణంలో ఏప్రిల్ 20, 21 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ మహాసభ కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా, పట్టణ, గ్రామ ప్రాంతాల్లోను ప్రచారం నిర్వహిస్తూ రజకులను చైతన్య పరచనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోనేటి రాజు, రేకులకుంట అంకయ్య, మడక రాజు, ఈశ్వరరావు, ఆహ్వాన సంఘ అధ్యక్షులు చెక్కవరపు వెంకట రెడ్డయ్య, కోశాధికారి బొజ్జ సుబ్బారావు, పాగోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాజధాని ప్రాంత పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించండి

- సిఆర్‌డిఎ కమిషనర్‌కు సిఐటియు నేతల వినతి

సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబుకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నేతలు సిహెచ్ బాబూరావు, ఎం రవి, ఎం భాగ్యరాజు తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ

రాజధాని అమరావతి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిఆర్‌డిఒ కమిషనర్ కన్నబాబుకు సిఐటియు నేతలు సోమవారం వినతిపత్రం అందజేశారు. విజయవాడలోని సిఆర్‌డిఎ కార్యాలయంలో కమిషనర్‌ను సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్ బాబూరావు, రాజధాని ప్రాంత అధ్యక్ష కార్యదర్శులు ఎం రవి, ఎం భాగ్యరాజు తదితరులు కలిసి రాజధాని కార్మికుల సమస్యలపై చర్చించారు. రాజధానిలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని, వారికి ఇస్తున్న రూ.12 వేల వేతనాన్ని రూ.21 వేలకు పెంచాలని, పని భారానికి తగ్గట్లుగా కార్మికుల సంఖ్యను పెంచాలని, కార్మికులకు నిలిపివేసిన రాజధాని సామాజిక పెన్షన్‌ను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన అనంతరం సిహెచ్ బాబూరావు, రవి, భాగ్యరాజు మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని అమరావతిలోని అసెంబ్లీ, రాష్ట్ర సచివాలయం, హైకోర్టు, రాజధాని గ్రామాల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఫిబ్రవరి జీతాన్ని వెంటనే చెల్లించాలని కమిషనర్‌ను కోరారు. రాజధాని అమరావతికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోందని, కానీ రాజధానిలో పని చేస్తున్న కార్మికుల బతుకులను మాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. రాజధాని కార్మికులకు ఏ రోజున జీతాలు చెల్లిస్తారో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్రమంతా పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రూ.21 వేల జీతం ఇస్తూ, ఇక్కడ వారికి మాత్రం రూ.12 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. ఒకే రకమైన విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మికుల పట్ల వేతనాల్లో వివక్ష చూపడం తగదన్నారు. ఇస్తున్న అరకొర జీతాలూ ఏ నెలకు ఆ నెల సక్రమంగా చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. కార్మికుల సంఖ్య తగ్గిపోవడంతో ఉన్న కార్మికులపై పని భారం పడి వారి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక పెన్షన్‌ను గత ప్రభుత్వం నాలుగు వేల మంది కార్మికులకు నిలిపివేసిందని, వాటిని తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పునరుద్ధరిస్తామని టిడిపి కూటమి నాయకులు చెప్పారని, టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా ఈ పెన్షన్‌ను పునరుద్ధరించాలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు బుజ్జి, శ్రీలత, చిట్టిబాబు, శాంతకుమారి పాల్గొన్నారు.

ఏనుగుల జోన్ పెట్టొద్దని ర్యాలీ

- కలెక్టర్‌కు, డిఎఫ్ఒకు వినతులు

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం మన్యం జిల్లా

పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలంలో జనావాసాల మధ్య ఏనుగుల జోన్ ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేస్తూ పలు గ్రామాల ప్రజలు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా చేశారు. ప్రజా సంఘాల ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పలు గ్రామాల ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు సుందరయ్య భవనం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. తిరిగి కాంప్లెక్స్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చి జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కి వినతి పత్రం అందజేశారు. అనంతరం డిఎఫ్ఒ పిలుపుతో వారి ఆఫీసుకు వెళ్లి సమస్యలు, ఇబ్బందులు వివరించారు. దీనికి డిఎఫ్ఒ ప్రసూన మాట్లాడుతూ ఏనుగుల జోన్ పెట్టడం ప్రభుత్వ నిర్ణయమని, ప్రజల సమస్యల్ని పరిశీలిస్తామని తెలిపారు.

తొలుత ధర్నా నుద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మునాయుడు మాట్లాడారు. సీతానగరం, పార్వతీపురం మండలాల పరిధిలోని అప్పయ్యపేట, రేపటివలస, జోగింపేట, గుచ్చిమి, రేపటి వలస, అంటివలస, తాన్నసీతారాంపురం, చినరాయుడిపేటలోని 1100 ఎకరాల కొండ సరిహద్దుల్లో రైతులకు, ప్రజలకు తెలపకుండా గ్రామ సభలు జరపకుండా ఏనుగుల జోన్ పేరుతో ఫారెస్ట్ అధికారులు కందకాల తవ్వకాల పనులు చేపట్టారని అన్నారు. ఈ పనులను నిలుపుదల చేయాలని, ఏనుగులు జోన్‌ను పార్వతీ పురం మన్యం జిల్లా నడి బొడ్డున ఉన్న సీతానగరం మండలంలో పెట్టడం అంటే ఆయా మండలాలు, జిల్లా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడడమేనని తెలిపారు. ఈ ప్రాంతంలో కందకాలు ట్రెంచ్ కటింగ్‌లు తవ్వకాలు చేపట్టడం వల్ల గిరిజనులు, దళితులు, పేదలు గత 50 ఏళ్ల నుంచి పెంచుకున్న తోటలు, భూములు నాశనమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇరు మండలాల ప్రజలకు పెనుముప్పు పొంచి ఉందని, అధికారులు తక్షణమే ఏనుగులు జోన్ ఆపాలని, ట్రెంచ్ పనులు నిలుపుదల చేయాలని, ఈ కొండచుట్టూ గల గ్రామాల ప్రజల, రైతులకు రక్షణ కల్పించాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు గవర వెంకటరమణ, బి అప్పారావు, కృష్ణ, రెడ్డి రమణమూర్తి, సత్యనారాయణ వెంకటరమణతో పాటు పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

కార్పొరేట్ల ఎగవేత భారతం

- పదేళ్లలో రూ.16 లక్షల కోట్ల మొండి బాకీల రద్దు
- సగం పైగా బడా పారిశ్రామికవేత్తలవే
- రూ.61 వేల కోట్లు ఎగవేసిన 29 కంపెనీలు
- మంత్రి సీతారామన్ వెల్లడి

న్యూఢిల్లీ : దేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని విధంగా ప్రధాని నరేంద్ర మోడీ హయాంలో బ్యాంకుల్లో మొండి బాకీలు రద్దయ్యాయి. మొత్తం పారు బకాయిల్లో బడా పరిశ్రమలు, సర్వీసు రంగాలకు చెందినవే సగానికి పైగా ఉన్నాయి. సామాన్యుడు లేదా ఓ రైతు బతుకుదెరువు కోసం లక్ష రూపాయలు అప్పు చేసి చెల్లించకుంటేనే ముప్పుతిప్పలు పెట్టే బ్యాంకులు.. పదేళ్లలో రూ.9 లక్షల కోట్లకు పైగా కార్పొరేట్ల అప్పులను రద్దు చేశాయి. ఇదే విషయాన్ని స్వయంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం పార్లమెంట్‌కు వెల్లడించారు. గత 10 ఆర్థిక సంవత్సరాల్లో మొత్తంగా దాదాపు రూ.16.35 లక్షల కోట్ల విలువైన మొండి బాకీలు (ఎన్‌పిఎ)లను బ్యాంక్‌లు రద్దు చేశాయని మంత్రి సీతారామన్ తెలిపారు. ముఖ్యంగా 2018-19లో అత్యధికంగా రూ.2,36,265 కోట్ల పారు బకాయిలను మాఫీ చేశాయి. 2014-15లో కనిష్టంగా రూ.58,786 కోట్ల ఎన్‌పిఎలను రద్దు చేయగా.. 2023-24లో బ్యాంకులు రూ.1,70,270 కోట్ల బకాయిలను రద్దు చేశాయి.

2024 డిసెంబర్ 31 నాటికి వాణిజ్య బ్యాంకులు 29 కంపెనీలను ఎన్‌పిఎలుగా గుర్తించాయని మంత్రి తెలిపారు. వాటిలో ప్రతి ఒక్కటి రూ. 1,000 కోట్లకు పైగా బకాయిలు కలిగి ఉన్నాయని వెల్లడించారు. వీటి మొత్తం విలువ రూ.61,027 కోట్ల పైనేనని పేర్కొన్నారు. గత పదేళ్లలో మొత్తంగా రూ.16.35 లక్షల కోట్ల మొండి బాకీలను రద్దు చేయగా.. అందులో రూ.9,26,947 లక్షల కోట్లు బడా పారిశ్రామికవేత్తలు, సర్వీసు సెక్టార్ రంగాలకు చెందినవి కావడం గమనార్హం.

ఆర్థిక సంవత్సరం	మొత్తం ఎన్‌పిఎల రద్దు (రూ. కోట్లు)	బడా పరిశ్రమలు అప్పుల మాఫీ (రూ. కోట్లు)
2014-15	58,786	31,723
2015-16	70,413	40,416
2016-17	1,08,373	68,308
2017-18	1,61,328	99,132
2018-19	2,36,265	1,48,753
2019-20	2,34,170	1,59,139
2020-21	2,04,272	1,27,050
2021-22	1,75,178	69,532
2022-23	2,16,324	1,14,528
2023-24	1,70,270	68,366
Total	16,35,379	9,26,947

Source: RBI

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) మార్గదర్శకాలు, బ్యాంకుల బోర్డులు ఆమోదించిన విధానం ప్రకారం బ్యాంకులు నాలుగేళ్ల పూర్తయిన తర్వాత పూర్తి ప్రొవిజనింగ్ (కేటాయింపులు) చేసిన వాటితో సహా నిరర్ధక ఆస్తులను రద్దు చేస్తాయని మంత్రి సీతారామన్ తెలిపారు. రుణాల తిరిగి వసూలుకు బ్యాంకులు వివిధ మార్గాలను అనుసరిస్తాయని చెప్పారు. సివిల్ కోర్టుల్లో దావా వేయడం, రుణ రికవరీ ట్రిబ్యునళ్లు, ఎన్‌సిఎల్‌టి వంటి వాటిని ఆశ్రయించడం వంటి పద్ధతులను అనుసరిస్తాయని తెలిపారు. కాగా.. రద్దు చేసిన అప్పుల వల్ల రుణ గ్రహీతలకు ప్రయోజనం ఏమీ ఉండదని మంత్రి చెప్పడం కొసమెరుపు.

కాశినాయన క్షేత్రానికి 32 ఎకరాలు

- అన్నమయ్య కళాక్షేత్రం పీఠం అధ్యక్షులు డిమాండ్
- కడప కలెక్టరేట్ ఎదుట నిరసన

కడప కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విజయశంకర్ తదితరులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

వైఎస్ఆర్ జిల్లా కాశినాయన మండలంలోని కాశినాయన క్షేత్రానికి 32.5 ఎకరాలు కేటాయించాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠం అధ్యక్షులు విజయశంకర్ డిమాండ్ చేశారు. ఆధ్యాత్మిక కేంద్రాల జోలికొస్తే అధోగతి పాలవుతామని డబుల్ ఇంజిన్ సర్కారు నాయకులు తెలుసుకోవాలని హెచ్చరించారు. 'కాశినాయన అన్నదాన సమారాధన, యాత్రికుల ధర్మాగ్రహ నివేదన' కార్యక్రమాన్ని సోమవారం కడప కలెక్టరేట్ ఎదుట నిర్వహించారు. అన్నమయ్య కళాక్షేత్ర పీఠం, జయ భారత్ సంస్థల ఆధ్వర్యంలో జయభారత్ సంస్థ జాతీయ అధ్యక్షులు లోకనాథం ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయ శంకర్ మాట్లాడుతూ.. కాశినాయన క్షేత్రానికి 32.5 ఎకరాలు కేటాయించని పక్షంలో గ్రామాలు, మండలాల వారీగా నిరసనలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా కాశినాయన పేరిట 60 వరకు ఆశ్రమాలు ఉన్నాయని, వాటిలో ఒకటి వైఎస్ఆర్ జిల్లా కాశినాయన క్షేత్రమని తెలిపారు. ఆధ్మాతిక కేంద్రానికి సహకారాన్ని అందించాల్సింది పోయి, అటవీ ప్రాంతమనే సాకుతో కూల్చివేతలకు పాల్పడడమేమిటని ప్రశ్నించారు. సనాతనవాది డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. డబుల్ ఇంజిన్ సర్కారు దుర్మార్గాన్ని ప్రతిఘటించాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాశినాయన ట్రస్టు డైరెక్టర్లు శివారెడ్డి, ఈశ్వరరెడ్డి, పలువురు యాత్రికులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద పడుకొని వినూత్నంగా ధర్నా చేస్తున్న గిరిజనులు

జీడిపిక్కల ధర పెంచాలి

- గిరిజన రైతుల 48 గంటల ధర్నా ప్రారంభం

ప్రజాశక్తి-పార్వతీపురం

తమ జీవనాధారమైన జీడి పిక్కలకు కిలోకు రూ.200 ధర కల్పించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యాన సోమవారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులు 48 గంటల ధర్నాకు దిగారు. జీడిపిక్కల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని, జీడి పిక్కలను రైతు సేవా కేంద్రాలు, జిసిసి ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు మండంగి లక్ష్మణరావు, గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు, నాయకులు కె రామస్వామి, పువ్వల తిరుపతిరావు, కూరంగి సీతారాం మాట్లాడారు. గతంలో గిరిజనులు కొండపోడు వ్యవసాయం చేస్తున్నప్పుడు కొండల్లో కందులు జొన్నలు, రాగులు, కొర్రలు, సామలు, ఊదలు, జనుములు అనేక రకాల పంటలు పండించేవారని తెలిపారు. గిరిజన పంటలకు గిట్టుబాటు ధర రావడంలేదని, జీడిపిక్క.. బతుకు పక్కా పేరుతో ఐటిడిఎ నుండి జీడి మొక్కలు ఇచ్చి ప్రోత్సహించారని తెలిపారు. కానీ గిరిజనులు పండించే జీడి పంటంతా దళారుల పాలవుతోందని అన్నారు. కనీసం గిట్టుబాటు ధరైనా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 80 కేజీలు జీడిపిక్కలకు రూ. 16 వేలు ఇవ్వాలని, గిరిజన ప్రాంతాల్లో కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, సాలూరు మండల కేంద్రాల్లో వంద పడకల ఆస్పత్రులు నిర్మించి గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గుమ్మలక్ష్మీపురంలో డైట్ కళాశాల, కురుపాం కేంద్రంగా మెడికల్ కళాశాల నిర్మించాలని కోరారు. గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలంటే జీడిపిక్కల పరిశ్రమలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు శంకర్రావు, అప్పారావు, హిమరిక రామారావు, మంచాల శ్రీను, గిరిజనులు పాల్గొన్నారు.

24 నుంచి 'తెలంగాణ' సిఫార్సు లేఖలు స్వీకరణ : టిటిడి

ప్రజాశక్తి - తిరుమల

తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్సు లేఖలపై శ్రీవారి దర్శనం కల్పించేందుకు అనుమతించనున్నట్లు టిటిడి వెల్లడించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ విధానం మార్చి 24 నుంచి అమల్లోకి రానుందని పేర్కొంది. విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించి ఆది, సోమవారాల్లో మాత్రమే ఈ లేఖలను స్వీకరించనున్నామని, రూ.300 దర్శనం టికెట్లకు సంబంధించిన సిఫార్సు లేఖలను బుధ, గురువారాల్లో స్వీకరిస్తామని తెలిపింది. ఒక సిఫార్సు లేఖతో ఆరుగురు మాత్రమే శ్రీవారిని దర్శించుకోవచ్చని వెల్లడించింది.

శ్రీవారి సేవలో అయ్యన్నపాత్రుడు

తిరుమల శ్రీవారిని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు సోమవారం దర్శించుకున్నారు. వేదపండితుల ఆశ్వీరచనం అనంతరం మీడియాతో ఆయన మాట్లాడారు. పార్టీలకు అతీతంగా రాష్ట్రాన్ని బాగు చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. గత ఐదేళ్లలో ఉగాది పండుగ ఎక్కడా చేయలేదని, రాష్ట్రంలో 14 వేల పంచాయతీలు ఉన్నాయని, పార్టీలకు అతీతంగా పండుగతో పాటు పంచాంగ శ్రవణం చేయాలని సూచించారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు చక్రాల వద్ద మంటలు

- అదుపు చేసిన రైల్వే సిబ్బంది

ప్రజాశక్తి - భీమడోలు

ముంబయి నుంచి భువనేశ్వర్ వెళ్తున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు చక్రాల వద్ద మంటలు వచ్చాయి. ఏలూరు జిల్లా దెందులూరు మండలం దెందులూరు-సీతంపేట రైల్వే స్టేషన్ల మధ్యలో సోమవారం ఉదయం 11.22 గంటల సమయంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఇంజన్ నుంచి మూడో భోగి చక్రాల వద్ద మంటలు చెలరేగాయి. దీనిని గమనించిన రైల్వే సిబ్బంది రైలును నిలిపివేసి మంటలను అదుపుచేసి మరమ్మతులు చేశారు. అనంతరం 20 నిమిషాల తర్వాత తిరిగి రైలు బయలుదేరింది.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు రంగారెడ్డి జిల్లా వాసులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం టేకులపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు మృతి చెందిన ఘటన సోమవారం తెల్లవారుజామున మూడు గంటలకు (భారత కాల మానం ప్రకారం) జరిగింది. టేకులపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ మాజీ ఎంపిటిసి సభ్యులు వెలిమర్తి మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పవిత్రదేవి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె ప్రగతిరెడ్డి (35), అల్లుడు రోహిత్‌రెడ్డి, వారి ఇద్దరు కుమారులు, అత్త అమెరికాలో ఉంటున్నారు. వారంతా ఫ్లోరిడా నుంచి కారులో వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ప్రగతిరెడ్డి, ఆమె కుమారుడు అర్విన్ (6), అత్త సునీత (56) అక్కడికక్కడే మృతి చెందారు. భర్త రోహిత్‌రెడ్డి, మరో కుమారుడు గాయపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి మృతితో టేకులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మోహన్‌రెడ్డి దంపతులు అమెరికాకు బయలుదేరి వెళ్లారు. మృతుల అంత్యక్రియలు అమెరికాలోని ఫ్లోరిడాలో నిర్వహించనున్నారు.

సంపాదకీయం

రైతుకు మేలు ఇలానా?

రైతులు రెక్కలు ముక్కలు చేసుకొని పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక నష్టాలపాలవడం ఏ ఏటికాయేడు పరిపాటిగా మారింది. అది ఇది కాదు ఏ పంట పండించినా అన్నదాతలకు ధర సమస్య పట్టి పీడిస్తూనే ఉంది. పంట అమ్మబోతే రైతుకు అడవి అదే పంటను వినియోగదారుడు కొనబోతే కొరివి. అటు రైతులను ఇటు వినియోగదారులను రక్షించాల్సిన ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పుకుంటున్నందునే ఈ ఉత్పాతం. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చాక ఖరీఫ్ పంటలు, ముందస్తుగా సాగు చేసిన కొన్ని రబీ పంటలూ అంగట్లోకి వచ్చాయి. చూస్తే వరి, కంది, శనగ, జొన్న, పెసర, మినుము, మొక్కజొన్న, మిరప, పత్తి, టమాటా, ఉల్లి... ఏ పంటకూ సరైన ధర లేదు. గిట్టుబాటు ధరలేమో, ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) కూడా రైతుకు పడట్లేదు. క్వింటాలుకు రూ.500 నుంచి రెండు మూడు వేల తక్కువకు తెగనమ్ముకుంటున్న ఉదంతాలు రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడ చూసినా కనిపిస్తాయి. పెట్టిన పెట్టుబడులు సైతం రాక రైతులు భారీ నష్టాలను చవి చూస్తున్నారు. మార్కెట్ నష్టాలకు తోడు కరువు, తుపాన్లు, వరదల వంటి ప్రకృతి విపత్తులు కలిగించిన నష్టాలు ఉండనే ఉన్నాయి.

ధరలు పతనమైనప్పుడు ప్రభుత్వం చేయాల్సినపని మార్కెట్‌లో జోక్యం. మార్కెటింగ్, మార్క్‌ఫెడ్, సివిల్ సప్లయిస్ తదితర సర్కారీ సంస్థలు తక్షణం రంగంలోకి దిగి రైతుల నుంచి నేరుగా పంటలను కొనుగోలు చేస్తే పోటీ నెలకొని వ్యాపారులు దారికొస్తారు. ప్రభుత్వం ఆలోచన ఆ విధంగా లేదు. రైతులు అయిన కాడికి అమ్ముకున్నాక ఎప్పటికో కొనుగోలు కేంద్రాలనడం వారిని మభ్యపెట్టే చర్య. కేంద్రాలు తెరవడానికి అనుమతులివ్వకుండా మీనమేషాలు లెక్కించడం దారుణం. ధరలు దిగజారిన సందర్భంలో మార్కెట్ ఇంటర్వెన్షన్‌కు దిగాలంటే రూ.వేల కోట్ల నిధులు కావాలి. ఆ విషయం ప్రభుత్వానికి తెలియనిదికాదు. కూటమి మేనిఫెస్టోలో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తామంది. మొన్న కూటమి సర్కారు ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ధరల స్థిరీకరణ నిధికి పెట్టింది 300 కోట్లు. వీటితో ధరలు పతనమైన పంటలన్నింటినీ ఏ విధంగా కొంటారో ఏలికలే చెప్పాలి. ఖరీఫ్‌లో 38 లక్షల టన్నుల వరి ధాన్యాన్ని కొంటామనిచెప్పి అతి కష్టం మీద 33 లక్షల టన్నులతో సరిపెట్టారు. రైతులు పండించిన మొత్తం పంటలో ప్రభుత్వం కొంటామన్నది సగం లేదు. అందులో కూడా కొన్నది తక్కువ. మిర్చి రైతులు ధర లేదని గగ్గోలు పెట్టాక ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు పోలోమని ఢిల్లీకెళ్లి మిర్చిని కొనడానికి కేంద్రం ఒప్పేసుకుందని ప్రచారం చేశారు. కేంద్రం క్వింటాలుకు నిర్ణయించిన ధర 11 వేల చిల్లర. అరకొరగానే కొంటామంది. అప్పటికే రైతులకు 13 వేల పైన ధర వస్తుంటే అంతకు రేటు తగ్గించి రైతులకు ఎంతో మేలు చేశామనడమేంటో అర్థం కాదు.

'స్వర్ణాంధ్ర విజన్ 2047' లక్ష్యంతో వ్యవసాయ వృద్ధిని పరుగులు పెట్టిస్తామంటోంది కూటమి ప్రభుత్వం. అధిక ఆదాయం వచ్చే పంటలకే ప్రోత్సాహకాలంది. ఆహార ధాన్యాలు పండిస్తే రైతులకు లాభం రాదని, పండ్ల తోటలు, ఆయిల్‌పాం, ఆక్వా సాగు వైపునకు రైతులను మళ్లిస్తామని విజన్ డాక్యుమెంట్‌లో నొక్కివక్కాణించింది. లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యాన్ని పాదుకొల్పుతామని భీషణ ప్రతిజ్ఞ చేసింది. ఎగుమతి ఆధారిత పంటలు పండిస్తే ఎక్కువ డబ్బులొస్తాయంది. అమెరికా ఆధిపత్యంలోని ప్రపంచబ్యాంక్, ఐఎంఎఫ్, డబ్ల్యుటిఒ ప్రభావంలో గల ప్రపంచ విపణి తీరు మాయింటికొస్తే ఏం తెస్తావ్, మీ ఇంటికొస్తే నాకేం ఇస్తావ్ అన్నట్లే ఉంటుంది. ఎగుమతి చేసిన మన వస్తువులకు ధరలు నిర్ణయించేదీ వాళ్లే మనం దిగుమతి చేసుకునే పంటలకు ధరలు నిర్ణయించేది కూడా మళ్లీ వాళ్లే. వాళ్లకు కావాల్సిన పంటలనే వేస్తే మనకు కావాల్సిన ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకోవాల్సిన అగత్యం పడుతుంది. హరిత విప్లవం లక్ష్యం, ఆహార ధాన్యాల స్వయం సమృద్ధి, ప్రజల ఆహార హక్కు ప్రమాదంలో పడుతుంది. విజన్ సాధన కోసం కూటమి ప్రభుత్వం ఎంచుకున్న పది సూత్రాలల్లో 'ఫార్మర్ అగ్రిటెక్' ఒకటి. అగ్రిటెక్‌లు, అగ్రి వాచ్‌లు మన చిన్న సన్నకారు రైతులను, కౌలు రైతులను రక్షింపజాలవు. వ్యవసాయ సంక్షోభాన్ని నివారింపజాలవు. ఈ తత్వాన్ని చంద్రబాబు సర్కారు తలకెక్కించుకునేనా?

మహనీయుల మాట



ఈ మంత్రములు, జపమాలలు విడిచిపెట్టు.
తలుపులన్నింటినీ బంధించి ఈ చీకటి గదిలో
ఎవరిని పూజిస్తున్నావు? కళ్ళు తెరచి చూడు.
నీవు ఆరాధించే దేవుడు నీ ఎదుట లేడు!
ఎక్కడ రైతు నేలను దున్నుతున్నాడో,
ఎక్కడ శ్రామికుడు రాళ్ళు పగులగొడుతున్నాడో
అక్కడ ఆ పరమాత్ముడున్నాడు. నీవు కూడా
నీ పట్టు పీతాంబరములు అవల పెట్టి
ఆ నేల మీదికి పదా...!

- రవీంద్రనాథ్ టాగూర్,
విశ్వకవి.

Rabindranath Tagore

పెట్టుబడిదారీ వ్యవస్థకు ట్రంప్ చికిత్స!

వ్యాఖ్య



సి.పి. చంద్రశేఖర్

ట్రంప్ రెండవసారి అమెరికా అధ్యక్ష పదవి చేపట్టాక, అమెరికా నాయకత్వంలో నడుస్తున్న ప్రపంచ పెట్టుబడిదారీ విధానం మొత్తంగా వ్యవస్థీకృత మార్పులకు లోనవుతోంది. దీనికి చోదకశక్తి అంతర్గతంగానే పని చేస్తోంది. గతంలో రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు 'మహా మాంద్యం' ఏర్పడినప్పుడు 'న్యూ డీల్'ను ప్రకటించారు. 1970 దశకంలో ద్రవ్యోల్బణం అదుపు తప్పినప్పుడు నయా ఉదారవాద విధానాలను ప్రకటించారు. ఇప్పుడు మళ్ళీ పెట్టుబడిదారీ వ్యవస్థ మరో తీవ్ర సంక్షోభంలో చిక్కుకుంది. దానికి స్పందనగా ట్రంప్ నాయకత్వంలో ఈ మార్పులు జరుగుతున్నాయి.

ఆర్థిక రంగంలో ట్రంప్ ప్రభుత్వం ప్రధానంగా ప్రవేశ పెడుతున్న మార్పులు అయిదు విధాలుగా ఉన్నాయి. వాటిలో **మొదటిది:** అధిక దిగుమతి సుంకాలను విధించడం. బైటకు తరలిపోయిన పరిశ్రమలను తిరిగి అమెరికాకు రప్పించడానికి, తద్వారా అక్కడ ఉత్పత్తిని, ఉపాధి అవకాశాలను పెంచడానికి ఈ సుంకాల పెంపు చేపట్టినట్టు చెప్పి సమర్థించుకుంటున్నారు. దేశ భద్రతకు సైతం ఈ విధానం అవసరం అంటూ చెప్తున్నారు. అయితే, ఈ విషయంలో లోతుగా, ముందుచూపుతో వ్యవహరిస్తున్నట్టు తోచదు. ఈ విధానం అమలు విషయంలో ఊగిసలాటలు కూడా కనిపిస్తున్నాయి. చౌకగా కార్మికుల శ్రమను కొల్లగొట్టగల దేశాలకు తరలిపోయిన సరుకుల ఉత్పత్తి పరిశ్రమలు ఏ మేరకు వెనక్కి వస్తాయన్నది ప్రశ్నార్థకమే.

కెనడా, మెక్సికో దేశాలపై 25 శాతం దిగుమతి సుంకం విధించారు. తర్వాత వెనక్కి తగ్గారు. కొంత జాగు తర్వాత తిరిగి సుంకం విధించారు. చైనాపై విధించే సుంకాలను పెంచారు. కార్లు, ఇతర వాహనాలు, స్టీల్, అల్యూమినియం తదితర ఉత్పత్తుల మీద కూడా సుంకాలను ప్రకటించారు. దానికి ప్రతిస్పందనగా అమెరికాతో వాణిజ్యం నడిపే దేశాలు కూడా అమెరికా దిగుమతులపై సుంకాలను ప్రకటిస్తున్నాయి.

రెండవ మార్పు: బడా పెట్టుబడిదారులు అమెరికన్ రాజ్య వ్యవస్థను స్వాధీనం చేసుకోవడం. ఇంతవరకూ సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ కమిషన్, ఫెడరల్ ట్రేడ్ కమిషన్ వంటి నియంత్రణ సంస్థలు స్వతంత్ర సంస్థలుగా ఉన్నాయి. గతంలో ఎస్ఇసి క్రిప్టో కరెన్సీ లావాదేవీలకు పగ్గాలు వేయడానికి ప్రయత్నించింది. అమెజాన్, మెటా వంటి గుత్త సోషల్ మీడియా ప్లాట్‌ఫాం సంస్థలను అదుపు చేయడానికి ఎఫ్‌టిసి ప్రయత్నించింది. ఇప్పుడు ఈ స్వతంత్ర సంస్థలను అమెరికన్ అధ్యక్షుడి శ్వేతసౌధానికి జవాబుదారీగా వ్యవహరించేలా వాటి ప్రతిపత్తిని మార్చివేశారు. బడా పెట్టుబడులు యథేచ్ఛగా దోచుకోడానికి అవకాశం కల్పించారు. ఇప్పుడు అమెరికా లోని అగ్రశ్రేణి బడా వ్యాపారవేత్తలందరూ ట్రంప్ వెనుక మోహరించి వున్నారు. ట్రంప్ కు చెందిన విధాన రూపకల్పన వేదికలలో సైతం వారు ప్రవేశించారు. వారందరిలోకీ చెప్పుకోదగ్గవాడు ఎలన్ మస్క్. ఎక్స్ అనే సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌కు, టెస్లా అనే వాహన తయారీ సంస్థకు అతడు అధిపతి. ఇప్పుడు ఎలన్ మస్క్ నేతృత్వంలో ప్రభుత్వ సామర్ధ్యాన్ని పెంచే ఒక శాఖను ఏర్పరిచాడు ట్రంప్. అదే డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ. దీనికి 50 బిలియన్ల డాలర్లు కేటాయించాడు. ప్రభుత్వానికి చెందిన ఏ విభాగమైనా ఈ డిఒజిఇ కి జవాబుదారీగా ఉండాలని ఆదేశించారు.

మూడవ మార్పు: అమెరికాతో వాణిజ్య పరంగా, దౌత్య పరంగా సంబంధాలు నెరపే దేశాల నుండి తమకు కావలసిన వ్యూహాత్మకమైన భూభాగాలను, సహజ వనరులను, ఇతర సదుపాయాలను ట్రంప్ డిమాండ్ చేస్తున్నాడు. గ్రీన్‌లాండ్, పనామా కాలువ, గాజా భూభాగం తనకే స్వంతం అని ప్రకటించాడు. అదే సమయంలో ఆ యా మిత్ర దేశాలకు అందిస్తూ వచ్చిన ఆర్థిక, సైనిక సహాయాలకు కోత పెడుతున్నాడు.

నాలుగవది: ఉక్రెయిన్‌లో గాని, గ్రీన్‌లాండ్‌లో గాని, ఇతర దేశాలలో గాని ఉన్న కీలకమైన ఖనిజాలను తమకు కేటాయించాలని బెదిరిస్తున్నాడు. తర్వాత అవసరమైతే బలప్రయోగానికి కూడా వెనుకాడేలా లేడు.

ఐదవది: ప్రపంచ రాజకీయాలన్నీ అమెరికా చుట్టూ మాత్రమే తిరిగేలా చేయడానికి రష్యాతో మళ్ళీ సత్సంబంధాలను నెలకొల్పుకోడానికి ప్రయత్నిస్తున్నాడు. యూరప్ దేశాలతో సంబంధాలలో కూడా మార్పులు చేస్తున్నాడు. రష్యాతో సంబంధాలు మెరుగుపడితే ఆ దేశంలో లభించే ముడిసరుకులను అమెరికా పొందగలుగుతుంది. అమెరికాతో యూరప్ దేశాలు వ్యాపార సంబంధాలను కొనసాగిస్తాయి కాని వాటి రక్షణ బాధ్యత నుండి అమెరికా వైదొలగుతుంది. - ఇదీ ట్రంప్ విధానం.

ట్రంప్ ఎత్తుగడల లక్ష్యం ఏమిటి?

ట్రంప్‌ను పెద్ద మెజారిటీతో గెలిపించిన శ్వేత కార్మికులకు ఏదో ఒరగబోతోందన్న అభిప్రాయాన్ని కలిగించడం. అమెరికాకు మళ్ళీ పరిశ్రమలు తిరిగి వచ్చేస్తే వాటిలో తమకు ఉపాధి లభిస్తుందన్న ఆశలు వారిలో కలిగించడం. ముఖ్యంగా అత్యంత సంపన్నుల ప్రయోజనాల కన్నా ట్రంప్ తమ ప్రయోజనాలను కాపాడేందుకే అధిక ప్రాధాన్యతనిస్తున్నాడన్న భ్రమలు వారిలో కలిగించడం ఒక లక్ష్యం.

బలహీనపడుతున్న అమెరికన్ ఆధిపత్యాన్ని తిరిగి బలంగా నెలకొల్పాలన్నది మరో లక్ష్యం.

అయితే ఈ లక్ష్యాలు ఏమేరకు నెరవేరతాయి?

1970 దశకం తర్వాత అమలు చేసిన నయా ఉదారవాద విధానాలు ద్రవ్య పెట్టుబడిపై నియంత్రణలను ఎత్తివేశాయి. రుణాల మీద ఆధారపడిన ఆర్థిక వృద్ధి వైపు అడుగులు పడ్డాయి. ఈ క్రమంలో ప్రభుత్వం పాత్ర మారిపోయింది. అట్టడుగు తరగతుల సంక్షేమం కోసం నిలబడి, అందుకోసం సంపన్నులను నియంత్రించే విధానాలకు బదులు దానికి రివర్స్‌గా దిగువ తరగతుల నుండి సంపదను కొల్లగొట్టి సంపన్నుల వద్ద సంపద మరింతగా కేంద్రీకరించబడేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది.

అయితే ఈ విధంగా సంపదను నిరవధికంగా కేంద్రీకరించడం అనేది ఎంతోకాలం పాటు కొనసాగించడం అసాధ్యం. ఈ విషయాన్ని 2008లో బద్దలైన సంక్షోభం తేటతెల్లం చేసింది. 1960 దశకం నుండి రెండు దశాబ్దాలపాటు పెట్టుబడిదారీ విధానానికి 'స్వర్ణయుగం' నడిచింది. ఆర్థిక వృద్ధి, కనీస స్థాయిలో ద్రవ్యోల్బణం, ఎక్కువ మోతాదులో ఉపాధి కల్పన, సంక్షేమ రాజ్యం అన్నీ ఆ కాలంలో సాధ్యపడ్డాయి. కాని నయా ఉదారవాద విధానాల అమలు ఫలితంగా అవన్నీ అదృశ్యమయ్యాయి. అందుచేత పెట్టుబడిదారీ దోపిడీ విధానాలను సమర్థించుకోవడం రాజకీయంగా పాత పద్ధతులలో సాధ్యపడడం లేదు.

'అమెరికాను మళ్ళీ గొప్ప దేశంగా చేద్దాం' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) అని ట్రంప్ ఇచ్చిన నినాదం అతగాడి వెనుక ఉన్న అమెరికన్ పెట్టుబడిదారుల కోసమే. తక్కిన వారందరినీ, తన మిత్ర దేశాలతో సహా బలిచేసి, అమెరికాను మాత్రమే అగ్రస్థానంలో నిలపాలన్నదే ఆ నినాదం లక్ష్యం. అందుకోసమే ట్రంప్, అతని సహచరులు అమెరికన్ రాజ్య వ్యవస్థను చేజిక్కించుకుని అతి కొద్దిగా ఉన్న 'సూపర్ రిచ్'కి మరింత సంపదను కట్టబెట్టే పనిలో ఉన్నారు.

తక్కిన ప్రపంచం నుండి వనరులను చేజిక్కించుకుని తద్వారా అతి కొద్దిమంది సూపర్ రిచ్ వద్ద సంపదలను మరింతగా కేంద్రీకరించి, ఈ క్రమంలో అమెరికాలో ఉన్న కార్మిక వర్గానికి కొంత వరకూ విదిలిస్తే సరిపోతుందన్న దృష్టితో వాళ్ళు ఉన్నారు.

ఈ పరిస్థితి సామ్రాజ్యవాద దేశాల మధ్య నెలకొన్న సంబంధాలలో మార్పుకు దారితీస్తోంది. గతంలో రెండు సార్లు ప్రపంచయుద్ధాలకు దారి తీసిన విధంగా సామ్రాజ్యవాదుల మధ్య వైరుధ్యాలు ఈ సారి పరిణమించకపోవచ్చు. ఆ సామ్రాజ్యవాద దేశాలలో ఒక ఆధిపత్య దేశం తన స్వార్థం కోసం తక్కిన సామ్రాజ్యవాద మిత్రులను సైతం తొక్కిపెట్టడానికి తయారౌతోంది. అందుకోసం తన మాజీ శత్రువులతో సైతం చేతులు కలిపేందుకు సిద్ధపడుతోంది.

తక్కిన ప్రపంచాన్ని మొత్తంగా తన వలసగా మార్చుకుని తద్వారా తన దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థను కాపాడుకోవచ్చునని అమెరికన్ పాలకవర్గం భావిస్తున్నట్టు ఉంది. కాని ఇది ఒక వికృతమైన ప్రయత్నంగా తయారై విఫలం కాక తప్పదు. ఒక దురహంకారి నాయకత్వంలో అమెరికన్ శత కోటీశ్వరుల గుంపు సాగించే దోపిడీ ఎల్లకాలమూ కొనసాగిపోతుందనే భ్రమలో ఉన్నారు. కాని ఈ భ్రమ పటాపంచలు కాక తప్పదు.

(స్వేచ్ఛానుసరణ)



'అమెరికాను మళ్ళీ గొప్ప దేశంగా చేద్దాం' (మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్) అని ట్రంప్ ఇచ్చిన నినాదం అతగాడి వెనుక ఉన్న అమెరికన్ పెట్టుబడిదారుల కోసమే. తక్కిన వారందరినీ, తన మిత్ర దేశాలతో సహా బలిచేసి, అమెరికాను మాత్రమే అగ్రస్థానంలో నిలపాలన్నదే ఆ నినాదం లక్ష్యం. అందుకోసమే ట్రంప్, అతని సహచరులు అమెరికన్ రాజ్య వ్యవస్థను చేజిక్కించుకుని అతి కొద్దిగా ఉన్న 'సూపర్ రిచ్'కి మరింత సంపదను కట్టబెట్టే పనిలో ఉన్నారు. తక్కిన ప్రపంచం నుండి వనరులను చేజిక్కించుకుని తద్వారా అతి కొద్దిమంది సూపర్ రిచ్ వద్ద సంపదలను మరింతగా కేంద్రీకరించి, ఈ క్రమంలో అమెరికాలో ఉన్న కార్మిక వర్గానికి కొంత వరకూ విదిలిస్తే సరిపోతుందన్న దృష్టితో వాళ్ళు ఉన్నారు.

పిపిపి పేర ప్రభుత్వ వైద్య రంగం ప్రైవేట్ గుప్పెట్లోకి

విశ్లేషణ

డా.బి.గంగారావు

పిపిపి విధానం కొత్తగా స్థాపిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలకే పరిమితం కాదు. ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న వైద్య కళాశాలల్లో కూడా ఒక్కొక్క విభాగాన్ని విడదీసి ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తారు. జిల్లా కేంద్రాల్లో ఉండే ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాంతీయ ఆసుపత్రులు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలన్నీ దశలవారీగా ప్రైవేట్ సంస్థలకు కట్టబెడతారు. కొత్తగా స్థాపించే ఆసుపత్రులు కూడా పిపిపి పద్ధతిలోనే చేపడతారు. మొత్తం ప్రభుత్వ ఆధీనంలో నడిచే వైద్య, విద్య, ఆసుపత్రులు ఇతర అన్ని రకాల ఆరోగ్య సేవల నిర్వహణ బాధ్యత నుండి రాష్ట్ర ప్రభుత్వం తప్పుకొని ప్రైవేట్ సంస్థల పరం చేస్తోంది.

రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వైద్య రంగంలో ప్రమాదకర ప్రభుత్వ-ప్రైవేటు-భాగస్వామ్య (పిపిపి) విధానానికి తెర లేపింది. వైసిపి ప్రభుత్వం స్థాపించిన, నేడు నూతనంగా చేపడుతున్న ప్రభుత్వ వైద్య కళాశాలలను, వీటికి అనుబంధంగా ఏర్పడే ఆసుపత్రులను ప్రైవేట్ సంస్థల ఆధీనంలోకి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది.

వైసిపి ప్రభుత్వ కాలంలో మంజూరైన 17 వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం పిపిపి పద్ధతిలో రూ.8548 కోట్ల నిధులు ఆమోదించగా కేవలం నాలుగేళ్లలో రూ.2225 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టి ఐదు కళాశాలలను అరకొరకగా పూర్తి చేసిందని ప్రస్తుత కూటమి ప్రభుత్వం విమర్శిస్తున్నది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కూటమి ప్రభుత్వం వైద్య రంగంలో పిపిపి విధాన అమలుకు పూనుకుందని చెబుతూ ఈ విధానం ఎంతో గొప్పదని, ప్రజలకు చాలా మేలు చేస్తుందని ప్రచారం చేస్తున్నది. పైపెచ్చు పిపిపి అంటే ప్రైవేటీకరణ కాదని కొత్తగా నిర్మిస్తున్న వైద్య కళాశాలలు, ఆసుపత్రులు అన్నీ ప్రభుత్వ అజమాయిషీలోనే ఉంటాయని, కావాలనే ప్రతిపక్ష పార్టీలు బురద జల్లుతున్నాయని ప్రజలను నమ్మించటానికి ప్రయత్నం చేస్తున్నది.

కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు పిపిపి పద్ధతిలో మొత్తం 157 వైద్య కళాశాలలు మంజూరు చేసింది. ఆంధ్ర రాష్ట్రానికి 17 కేటాయించింది. వీటిని పిపిపి పద్ధతిలోనే, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్మాణాలు, ఆపరేషన్, మెయింటినెన్స్ ఉండాలని షరతు విధించింది. ఒక్కో వైద్య కళాశాలకు దాని అనుబంధ ఆసుపత్రి నిర్మాణానికి సుమారు రూ.500 కోట్లు ప్రాజెక్టు వ్యయంగా నిర్ణయించారు. ఇందులో 40 శాతం చొప్పున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు (200+200 కోట్లు) రూ.400 కోట్లు భరించాలి. మిగిలిన రూ. 100 కోట్లు పిపిపి పద్ధతిలో ప్రైవేట్ సంస్థల నుండి సేకరించాలి. అయితే కారణాలేమైనా వీటిని కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పిపిపి పద్ధతిలో కాకుండా...రాష్ట్ర ప్రభుత్వమే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులతో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నిర్మించటానికి పూనుకుంది. ఈ వైద్య కళాశాలలకు అవసరమైన భూములు కేటాయించినప్పటికి వీటిని సకాలంలో పూర్తి చేయడానికి తీవ్ర నిర్లక్ష్యం వహించింది. పూర్తయిన కళాశాలలు దానికి అనుబంధంగా ఉన్న ఆసుపత్రులను కూడా అరకొరగానే పూర్తి చేసింది. కేవలం ఐదు వైద్య కళాశాలల్లోనే గత ఏడాది అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి.

అయితే ఆ కాలేజీలకు మంజూరైన ఎంబిబిఎస్ మెడికల్ సీట్ల భర్తీ మాత్రం కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన విధంగా సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లుగా భర్తీ చేసేందుకు పూనుకుంది. మేనేజ్‌మెంట్ కోటా సీటుకి రూ.12 లక్షలు, ఎన్ఆర్ఐ కోటా సీటుకి ఏడాదికి రూ.20 లక్షల చొప్పున నిర్ణయించి అమలుకు పూనుకుంది. కన్వీనర్ కోటాను కుదించడంతో పాటు జనరల్ కేటగిరి సీట్లకు కూడా భారీగా ఫీజులు నిర్ణయించింది. ఈ పద్ధతిని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. అధికారంలోకి వస్తే ఈ పద్ధతిని, సెల్ఫ్ ఫైనాన్స్ ఫీజులను పూర్తిగా రద్దు చేస్తామని, ఈ కళాశాలలన్నింటి నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వమే చేపడుతుందని ప్రచారం చేసింది. పూర్తి కాని కళాశాలలను, ఆసుపత్రులను కూడా ప్రభుత్వమే పూర్తి చేసి ప్రభుత్వమే నిర్వహిస్తుందని వాగ్దానం చేసింది. అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకిచ్చిన వాగ్దానానికి తిలోదకాలిచ్చి సెల్ఫ్ ఫైనాన్స్ పద్ధతి రద్దు చేయకుండా గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగిస్తూ వైద్య విద్యార్థులపై తీవ్ర భారానికి నిస్సిగ్గుగా జై కొట్టింది. భవిష్యత్‌లో కన్వీనర్ కోటా సీట్లు తగ్గిపోయి క్రమేణా సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లుగా మారిపోనున్నాయి. దీంతో సామాన్య, పేద, దిగువ తరగతి విద్యార్థులు మంచి ర్యాంకులు సంపాదించినా భారీ ఫీజులు చెల్లించుకోలేక వైద్య విద్యకు దూరమవుతారు.

వైద్య రంగంలో పిపిపి అంటే?

కేంద్ర ప్రభుత్వం 2020 సంవత్సరం నుండి వైద్య రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధాన అమలుకు పూనుకుంది. గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో యూజర్ చార్జీల వసూలుకు ప్రభుత్వాలే పూనుకునేవి. లేబరేటరీలు, స్కానింగ్ వంటి సేవలు ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన కొన్ని రాష్ట్రాల్లో అమల్లో ఉన్నాయి. మన రాష్ట్రంలో కూడా వీటితో పాటు 104, 108 అంబులెన్స్ సేవలు కూడా ఈ పద్ధతిలో కొనసాగుతున్నాయి.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన విధానం ఇప్పటివరకు అనుసరిస్తున్న విధానానికి పూర్తిగా భిన్నమైంది. 2020 వరకు దేశంలో ప్రభుత్వ, ప్రవేట్ వైద్య కళాశాలలే ఉండేవి. ఈ నూతన పిపిపి విధానంలో వైద్య కళాశాలల స్థాపనకుగాను ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వమే అన్ని సదుపాయాలు సమకూరుస్తుంది. దీనికిగాను మౌలిక సదుపాయాల కల్పనలో వయబిలిటీ గ్యాప్ ఫండ్స్ (వైజిఎఫ్) అనే పథకాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా చేపట్టే మౌలిక సదుపాయాలన్నీ పిపిపి లో ప్రైవేట్ సంస్థల ఆధీనంలోనే చేపట్టాలి. ఇందుకయ్యే ప్రాజెక్టు వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 30 నుండి 40 శాతం నిధులు గ్రాంట్ రూపంలో చెల్లిస్తుంది. ఈ విధానం ఆంధ్ర రాష్ట్రంలో అమలు చేయటానికి కూటమి ప్రభుత్వం తొలిసారిగా గత బడ్జెట్లో రూ.2 వేల కోట్లను కూడా వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద కేటాయించింది.

ఈ పథకం క్రింద వైద్య కళాశాలకు, దానికి అనుబంధంగా నిర్మించే ఆసుపత్రికి అవసరమైన భూమిని ప్రైవేట్ సంస్థకి రాష్ట్ర ప్రభుత్వమే ఉచితంగా లీజుకిస్తుంది. లీజు కాల పరిమితి 60 నుండి 99 ఏళ్ల వరకు ఉంటుంది. భూమితో పాటు కళాశాలకు, ఆసుపత్రి నిర్మాణానికి అవసరమయ్యే మొత్తం పెట్టుబడిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా 80 శాతం గ్రాంట్ రూపంలో ప్రైవేట్ సంస్థకి ఇస్తాయి. మిగిలిన 20 శాతం పెట్టుబడిని లీజు భూమిని బ్యాంకుల్లో తనఖా పెట్టి ప్రైవేట్ సంస్థ రుణ రూపంలో సమకూర్చుకుంటుంది. వైద్య కళాశాల ఆపరేషన్, మెయింటెనెన్స్‌లో 50 శాతం ఐదేళ్ల పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే భరిస్తాయి. అంతేగాక వైద్య కళాశాలకు అనుబంధంగా ఉండే ఆసుపత్రిని ప్రభుత్వ, ప్రైవేటు అనే రెండు విభాగాల కింద వేరు చేసి నిర్వహించబడుతుంది. ఉదాహరణకు 1000 పడకల పిపిపి ఆసుపత్రిలో పేదలకు 440 పడకలు కేటాయిస్తే మిగిలిన 560 పడకలు వాణిజ్య ప్రాతిపదికన నిర్వహించబడతాయి. వాటికి ప్రైవేట్ రంగంలో కార్పొరేట్ వైద్య రేట్లు నేడు ఎలా అమలు చేస్తున్నారో అలా నిర్ణయించబడతాయి. పేదలకు కేటాయించిన పడకల నిర్వహణ, ఓపి ఫీజు, శస్త్ర చికిత్సలు, ఇతర వైద్య ఖర్చులు మొత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్ సంస్థకు చెల్లించాలి. కొంత భాగాన్ని యూజర్ చార్జీల రూపంలో పేదల నుండి కూడా వసూలు చేస్తారు.

ఈ వైద్య కళాశాల నిర్వహణ మొత్తం ప్రైవేట్ సంస్థే చూస్తుంది. కళాశాల, ఆసుపత్రిపై పూర్తి అధికారాలు ప్రైవేట్ సంస్థకే కల్పించబడతాయి. అలాగే విద్యార్థుల హాస్టళ్లు, మెస్ వంటి నిర్వహణ కూడా ప్రైవేట్ సంస్థకే చెందుతుంది. ఒకవేళ వైద్య కళాశాలకు అనుబంధంగా ఆసుపత్రి నిర్మించకపోతే జిల్లా కేంద్రంలో ఉండే ప్రభుత్వ ఆసుపత్రిని పూర్తిగా అన్ని విభాగాలు ఉపయోగించుకోవడానికి, ఆసుపత్రిని కూడా ప్రైవేట్ సంస్థకు అనుబంధంగా మార్చటానికి అనుమతిస్తారు. వీటిలో పని చేసే డాక్టర్లను విద్యార్థుల బోధనకు కూడా వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఈ ఆసుపత్రిపై కూడా పూర్తి ఆధిపత్యం ప్రైవేట్ సంస్థకే కల్పించబడుతుంది. ఈ విధంగా ప్రభుత్వ పెట్టుబడితో నిర్మిస్తున్న వైద్య కళాశాలలు, ఆసుపత్రులను ప్రైవేట్ సంస్థల లాభాల కోసం బలిస్తున్నారు.

రాష్ట్రంలో పిపిపి పద్ధతిలో వస్తున్న 17 వైద్య కళాశాలలు వీటికి అనుబంధంగా వచ్చే ఆసుపత్రులు పూర్తిగా ప్రైవేటు సంస్థల గుత్తాధిపత్యంలోనే వస్తాయి. కాని, ప్రభుత్వ ఆధీనంలోనే ఉంటాయి అనే ప్రభుత్వ ప్రచారంలో ఏ మాత్రం వాస్తవం లేదు. కేవలం ప్రజలను మోసగించడానికే ఈ ప్రచారం.

పిపిపి విధానం కొత్తగా స్థాపిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాలలకే పరిమితం కాదు. ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న వైద్య కళాశాలల్లో కూడా ఒక్కొక్క విభాగాన్ని విడదీసి ప్రైవేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తారు. జిల్లా కేంద్రాల్లో ఉండే ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాంతీయ ఆసుపత్రులు, పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలన్నీ దశలవారీగా ప్రైవేట్ సంస్థలకు కట్టబెడతారు. కొత్తగా స్థాపించే ఆసుపత్రులు కూడా పిపిపి పద్ధతిలోనే చేపడతారు. మొత్తం ప్రభుత్వ ఆధీనంలో నడిచే వైద్య, విద్య, ఆసుపత్రులు ఇతర అన్ని రకాల ఆరోగ్య సేవల నిర్వహణ బాధ్యత నుండి రాష్ట్ర ప్రభుత్వం తప్పుకొని ప్రైవేట్ సంస్థల పరం చేస్తోంది.

ఉన్నత విద్యా రంగంలో కూడా!

వైద్య రంగంలోనే కాకుండా విద్యా రంగంలో కూడా కేంద్ర ప్రభుత్వం ఇటువంటి హానికర విధానాన్ని గత కొంత కాలం నుండి అమలు చేసేందుకు పూనుకుంది. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థల్లో ఈ పిపిపి విధానం అమలుకు 2017లోనే ఉన్నత విద్య ఫైనాన్సింగ్ ఏజెన్సీ (హెచ్ఇఎఫ్ఏ) అనే సంస్థను ఏర్పాటు చేసి ప్రైవేటీకరణ విధానాలు అమలు చేస్తున్నది. ఈ సంస్థకు కేంద్ర బడ్జెట్ నుండి నిధులు కేటాయించి వాటిని ఉన్నత విద్యారంగంలోని ఐఐటి, ఎన్ఐటి, ఐఐఎం, ఇతర సెంట్రల్ యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలకు మౌలిక సదుపాయాల కల్పన, పరిశోధనల అభివృద్ధి పేర రుణాల రూపంలో నిధులు ఇస్తుంది. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టు కింద అయ్యే మొత్తం వ్యయానికి సరిపడా నిధులు ఇవ్వదు. ప్రాజెక్టు వ్యయంలో కేవలం 50 శాతం మాత్రమే రుణ రూపంలో ఇస్తుంది. మిగిలిన 50 శాతం ప్రైవేట్ సంస్థల నుండి పిపిపి పద్ధతిలో సేకరించుకోవాలి. దీని ద్వారా ఉన్నత విద్యా సంస్థల్లోకి ప్రైవేట్ సంస్థలను కేంద్ర ప్రభుత్వం చొప్పిస్తున్నది. ఈ సంస్థలు విద్యార్థుల నుండి వివిధ రూపాల్లో అధిక ఫీజులు, చార్జీల వసూలు ద్వారా లాభదాయకమైనవిగా వాటిని మార్చుకుంటున్నాయి. అంతేగాక కొత్తగా రకరకాల సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు కూడా ఏర్పాటు చేస్తూ తద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వ విద్యా సంస్థల యాజమాన్యాలు చెల్లిస్తున్నాయి. ఇది కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా సంస్థలకే పరిమితం కాదు. ఇప్పుడు రాష్ట్రాలకు కూడా ఈ విధానాన్ని విస్తరించటానికి పథకం రూపొందించింది. దీనిని కూడా కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అమలుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నది.

మొత్తంగా కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రంగాల్లో ప్రైవేటీకరణ విధానాలు వేగంగా అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా మౌలిక సదుపాయాల రంగంలో ప్రభుత్వ పాత్ర వదులుకొని కార్పొరేట్ శక్తుల గుత్తాధిపత్యాన్ని పెంచుతున్నది. సామాజిక రంగంలో కూడా ఇదే వైఖరిని అవలంబిస్తున్నది. రాష్ట్రాలకు పిపిపి, వయబిలిటీ గ్యాప్ ఫండ్స్ పేర నిధులు ఎరేసి రాష్ట్ర ప్రభుత్వాలను లోబర్చుకుంటున్నది. ఈ ప్రజా వ్యతిరేక విధానాలపై కూటమి ప్రభుత్వం పెదవి విప్పడంలేదు. పైగా కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలను తలకెత్తుకొని, బిజెపితో అంటకాగుతూ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నది. ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను పూర్తిగా ప్రైవేట్ శక్తుల గుప్పెట్లో పెట్టడానికి సిద్ధమైంది. ఈ ప్రమాదకర విధానాన్ని వెనక్కి కొట్టటమే రాష్ట్ర ప్రజల ముందున్న కర్తవ్యం.

/ వ్యాసకర్త సెల్ : 9490098792 /

కిడ్నీ వ్యాధికి మరొకరు బలి

ప్రజాశక్తి-ఎ.కొండూరు (ఎన్‌టిఆర్ జిల్లా)
ఎన్‌టిఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం చైతన్య నగర్ తండా బిసి కాలనీకి చెందిన భూక్యా లక్ష్మణ్ (27) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని సిపిఎం పార్టీ నాయకులు సందర్శించి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి పి.ఆనందరావు డిమాండ్ చేశారు. నివాళులర్పించిన వారిలో సిఐటియు ఏ కొండూరు మండల కార్యదర్శి జెట్టి వెంకటేశ్వరావు, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.కుమార్ నాయక్, గిరిజన నాయకులు జమలమ్మ ఉన్నారు.

జూన్ 26న విద్యుత్ రంగ ఉద్యోగుల సమ్మె

- విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్ల జాతీయ సమన్వయ కమిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో
జూన్ 26న విద్యుత్ రంగ ఉద్యోగుల సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్ల జాతీయ సమన్వయ కమిటీ (ఎన్‌సిసిఒఇఇఇ) పిలుపునిచ్చింది. ఎన్‌సిసిఒఇఇఇ దక్షిణ ప్రాంత సమావేశం చెన్నైలోని డి జానకి రామన్ భవన్‌లో ఆదివారం జరిగింది. సమన్వయ కమిటీ కన్వీనర్ పిఎన్ చౌదరి సమావేశాన్ని ప్రారంభించి విద్యుత్ రంగం ప్రస్తుత స్థితిపై చర్చ కోసం ప్రతిపాదనలు చేశారు. 2000లో ఏర్పడినప్పటి నుండి ఎన్‌సిసిఒఇఇఇ చరిత్ర, పోరాటాలను, ముఖ్యంగా రాష్ట్ర విద్యుత్ బోర్డులను (ఎస్‌ఇబిలు) ప్రైవేటీకరించే లక్ష్యంతో విద్యుత్ బిల్లు 2000కి దాని వ్యతిరేకంగా ఆందోళనలను గుర్తు చేశారు. ఎన్‌సిసిఒఇఇఇ అవిశ్రాంత ఆందోళనలతో అప్పటి ఎన్‌డిఎ ప్రభుత్వం బిల్లును పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి సూచించవలసి వచ్చిందని పేర్కొన్నారు. తరువాత అవసరమైన సవరణలు చేశారని, దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్ రంగ నిర్మాణంలో ఎక్కువ పాత్ర పోషించాయని అన్నారు. యుపిఎ-1 ప్రభుత్వంలో వామపక్ష పార్టీలు, ఎన్‌సిసిఒఇఇఇ నుండి కీలకమైన మద్దతు, ఒత్తిడితో క్రాస్-సబ్సిడీలను నిలుపుకోవడానికి, గ్రామీణ విద్యుదీకరణను పెంచడానికి మరిన్ని సవరణలు చేశారని తెలిపారు. ఈ ఒత్తిడి రాజీవ్ గాంధీ గ్రామీణ విద్యుదీకరణ యోజన (ఆర్‌జిజివివై) ప్రారంభించడానికి దారితీసిందన్నారు. ఇది విద్యుత్ రంగంలో విస్తృత విద్యుదీకరణ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ బాధ్యతను నిర్ధారించే దిశగా ఒక ప్రధానమైన విధాన మార్పును సూచిస్తుందని వివరించారు.

చండీగఢ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో చర్యలు, పుదుచ్చేరిలో పొంచి ఉన్న ముప్పును ఆయన సూచిస్తూ, కొనసాగుతున్న ప్రైవేటీకరణ ప్రయత్నాలను నొక్కి చెప్పారు. కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక ప్రకటించిన విధంగా మే 20న లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జాతీయ సమ్మె జరగనుందన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం ప్రాముఖ్యతను, దానికి వ్యతిరేకంగా సమీకరించాల్సిన తక్షణ అవసరాన్ని తెలియజేశారు. రాష్ట్ర డిస్కామ్‌ల ప్రైవేటీకరణ ఎజెండాను వేగవంతం చేయడానికి మంత్రుల బృందం ఏర్పడిందని, ప్రైవేట్ రంగ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో ఎఐపిఇఎఫ్ ఛైర్మన్ శైలేంద్ర దూబే, ఇఇఎఫ్ఐ జనరల్ సెక్రటరీ సుదీప్ దత్తా, సిఒటిఇఇ జనరల్ సెక్రటరీ ఎస్ రాజేంద్రన్, ఎఐఎఫ్ఇఇ అధ్యక్షులు, ఎస్ మూర్తి, ఎఐఎఫ్ఒపిడిఇ నేత వి సంపత్ కుమార్, ఎఐపిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్, సమర్ సింకా, ఎఐపిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి రత్నాకర్, టిఎన్ఇబిఇఎఫ్ ప్రధాన కార్యదర్శి ఎ సెక్కిజార్, కేరళ, కర్ణాటక, పుదుచ్చేరి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి నాయకులు పాల్గొన్నారు.

భవిష్యత్ కార్యాచరణ

1. కార్మిక కోడ్‌ల నోటిఫికేషన్‌ను తగలబెట్టడంతోపాటు ఉమ్మడి నిరసన ప్రదర్శనలను చేపట్టాలి. అన్ని విద్యుత్ స్టేషన్లు, సబ్ స్టేషన్లు, కార్యాలయాల్లో ఆందోళన నిర్వహించాలి
2. ఏప్రిల్ 15 నాటికి రాష్ట్ర స్థాయి భారీ ఉమ్మడి సమావేశాలు నిర్వహించాలి
3. కార్మిక కోడ్‌లు, విద్యుత్ రంగానికి సంబంధించిన నిర్దిష్ట సమస్యలపై దృష్టి సారించే రెండు వేర్వేరు ఉమ్మడి కరపత్రాలు వేయాలి
4. అన్ని విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లకు ఉమ్మడి కరపత్రాల పంపిణీ
5. కార్మిక కోడ్‌కు వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి ఏప్రిల్ చివరి వారంలో గేట్ సమావేశాలు నిర్వహించాలి
6. మే మొదటి వారం నాటికి రాష్ట్ర రాజధానుల్లో భారీ ర్యాలీలు
7. వీధుల్లో సమావేశాలు, చిన్న బహిరంగ సమావేశాలు, ఇంటింటి ప్రచారాలతో విద్యుత్ ఉద్యోగులు, ఇంజినీర్లను పాల్గొనేలా చేయడం
8. లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు ప్రకటించిన జాతీయ సమ్మెలో విద్యుత్ ఉద్యోగులు పాల్గొనాలి. విద్యుత్ రంగ సంఘాలు ప్రత్యేక సమ్మె నోటీసును సమర్పించాలి
9. సమ్మె రోజున జిల్లా ప్రధాన కార్యాలయంలో సామూహిక సమీకరణ జరగాలి
10. జూన్ 26న జరిగే చారిత్రాత్మక విద్యుత్ రంగ సమ్మెకు సిద్ధం కావాలి

భోగాపురం విమానాశ్రయ పనుల్లో బాంబ్ బ్లాస్టింగ్

- వ్యక్తి మృతి

ప్రజాశక్తి-భోగాపురం
భోగాపురం విమానాశ్రయం పనుల్లో రహదారికి అడ్డుగా ఉన్న బండరాలను బాంబులు పెట్టి తొలగించే క్రమంలో అకస్మాత్తుగా బాంబు పేలి ఓ వ్యక్తి మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. విమానాశ్రయం లోపల అంతర్గత రహదారుల నిర్మాణంలో పెద్ద పెద్ద బండ రాళ్లు ఉన్నాయి. వీటిలో తొలగించేందుకు ఓ వ్యక్తికి కాంట్రాక్ట్ ఇచ్చారు. ఆ కాంట్రాక్టర్ వద్ద రామచంద్ర పేట గ్రామానికి చెందిన కొత్తయ్య పనిచేస్తున్నారు. ఎప్పటిమాదిరిగానే సోమవారం మధ్యాహ్నం బండరాళ్లకు రంధ్రాలు పెట్టి అందులో మందు గుండు సామగ్రి నింపుతున్న క్రమంలో పేలుడు సంభవించింది. దీంతో కొత్తయ్య తీవ్రంగా గాయపడ్డారు. తగరపువలసలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
అస్సెట్ రికవరీ బ్రాంచ్ (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001. ఈ-మెయిల్: arb.vijayawada@unionbankofindia.bank

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: మెస్సర్స్ శ్రీ సాయి రత్న ఎంటర్‌ప్రైజెస్ ఫాల్ జి బ్రిక్స్ ఇండస్ట్రీ, ప్రొప్రయిటర్ శ్రీమతి పులివర్తి అనురాధ, భర్త: రత్నబాబు, డి.నెం. 11/6/96/2, వైష్ణవి నగర్, సాగర్ కెనాల్ దగ్గర, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా-522403. **తనఖాదారు(లు)/హామీదారు(లు): 1. శ్రీమతి పులివర్తి అనురాధ,** భర్త: రత్నబాబు, డి.నెం. 11/6/96/2, వైష్ణవి నగర్, సాగర్ కెనాల్ దగ్గర, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా-522403. **2. శ్రీ పులివర్తి రత్నబాబు,** తండ్రి: వెంకట స్వామి, డి.నెం. 11/6/96/2, వైష్ణవి నగర్, సాగర్ కెనాల్ దగ్గర, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా-522403. **3. శ్రీమతి పులివర్తి అనురాధ,** భర్త: రత్నబాబు, 2-167, పెదకూరపాడు, గుంటూరు-522402. **4. శ్రీ పులివర్తి రత్నబాబు,** తండ్రి: వెంకట స్వామి, 2-167, పెదకూరపాడు, గుంటూరు-522402.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002) ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి మెస్సర్స్ శ్రీ సాయి రత్న ఎంటర్‌ప్రైజెస్ ఫాల్ జి బ్రిక్స్ ఇండస్ట్రీస్ కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.30-01-2023** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంక్‌కు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని తేది. **02-11-2024** న అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.30-01-2023** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు ఇక్కడ వివరించబడ్డాయి:
ఆస్తి - శ్రీ పి.రత్నబాబు గారి ఆస్తులు **1)**. సత్తెనపల్లి-గుంటూరు రోడ్డు, వైష్ణవి నగర్, సత్తెనపల్లి టౌన్, దగ్గరి డోర్ నెం.11-6-96/2, వడ్డవల్లి గ్రామం, సబ్ డివిజన్ తర్వాత రెవెన్యూ రికార్డుల ప్రకారం డి.నెం.8-1ఏ3ఏలో వాణిజ్యపరమైన ఖాళీ స్థలం 1331 చ.గ.లలో ఉంది (అనగా తహశీల్దార్ జారీ చేసిన సర్టిఫికేట్, ప్రత్యేక రిజిస్టర్డ్ నెం. 683/2014) వడ్డవల్లి గ్రామం, డి.నెం.8-1ఏ1ఏలో ఎకరా 0.04 1/2 సెంట్లు, వడ్డవల్లి గ్రామం, డి.నెం. 8-1ఏ1సి1లో ఎకరా 0.23 సెంట్లు మొత్తం రెండు సంఖ్యలు ఒక ఎకరా 0.27 1/2 సెంట్లు లేదా 1331 చ.గ.ల ఖాళీ స్థలం పులివర్తి రత్నబాబుకు చెందినది ఈ దిగువ హద్దులలో **తూర్పు:** తిప్పబోయిన చిన్నమ్మ గారి స్థలం, **పడమర:** పులవర్తి అనురాధ గారి స్థలం, **ఉత్తరం:** గుంటూరు మాచర్ల రోడ్డు, **దక్షిణం:** కడియం పెద్ద అబ్బాయి గారి స్థలం. **2)** సత్తెనపల్లి-గుంటూరు రోడ్డు, వైష్ణవి నగర్, సత్తెనపల్లి టౌన్, దగ్గరి డోర్ నెం.11-6-96/1, వడ్డవల్లి గ్రామం సబ్ డివిజన్ తర్వాత రెవెన్యూ రికార్డుల ప్రకారం డి.నెం.8 వద్ద ఖాళీ స్థలం, వడ్డవల్లి గ్రామం, డి.నెం. 8-1ఎ1ఎ విస్తీర్ణంలో ఎకరా 0.02 సెంట్లు లేదా 96.8 చ.గ.ల ఖాళీ స్థలం పులివర్తి రత్నబాబు గారికి చెందినది ఈ దిగువ హద్దులలో **తూర్పు:** పులివర్తి రత్నబాబు గారి స్థలం, **పడమర:** తుమ్మల రంగమ్మ గారి స్థలం, **ఉత్తరం:** గుంటూరు మాచర్ల రోడ్డు, **దక్షిణం:** ఎన్.ఎస్.పి బోడె కాలువ స్థలం. **3)** సత్తెనపల్లి-గుంటూరు రోడ్డు, వైష్ణవి నగర్, సత్తెనపల్లి టౌన్, దగ్గరి డోర్ నెం.11-6-96/1, వడ్డవల్లి గ్రామం సబ్ డివిజన్ తర్వాత రెవెన్యూ రికార్డుల ప్రకారం డి.నెం.8 వద్ద ఖాళీ స్థలం, వడ్డవల్లి గ్రామం, డి.నెం. 8-1ఎ1ఎలో 80.33 చ.గ.ల ఖాళీ స్థలం పులివర్తి రత్నబాబు గారికి చెందినది ఈ దిగువ హద్దులలో **తూర్పు:** పులహారి తులసిబాయమ్మ గారి స్థలం, **పడమర:** పులివర్తి రత్నబాబు గారి స్థలం, **ఉత్తరం:** గుంటూరు మాచర్ల రోడ్డు, **దక్షిణం:** ఎన్.ఎస్.పి బోడె కాలువ స్థలం. **4)** సత్తెనపల్లి-గుంటూరు రోడ్డు, వైష్ణవి నగర్, సత్తెనపల్లి టౌన్, దగ్గరి డోర్ నెం.11-6-96/1, వడ్డవల్లి గ్రామం సబ్ డివిజన్ తర్వాత రెవెన్యూ రికార్డుల ప్రకారం డి.నెం.8 వద్ద ఖాళీ స్థలం, వడ్డవల్లి గ్రామం, డి.నెం. 8-1ఎ1ఎలో 80.50 చ.గ.ల ఖాళీ స్థలం పులివర్తి రత్నబాబు గారికి చెందినది ఈ దిగువ హద్దులలో **తూర్పు:** పులవర్తి రత్నబాబు గారి స్థలం, **పడమర:** తుమ్మల రంగమ్మ గారి స్థలం, **ఉత్తరం:** గుంటూరు మాచర్ల రోడ్డు, **దక్షిణం:** ఎన్.ఎస్.పి బోడె కాలువ స్థలం. సత్తెనపల్లి టౌన్, ఇందిరా ప్రియదర్శిని ఐ.టి.ఐ ఇన్‌స్టిట్యూట్ ఎదురుగా, వైష్ణవి నగర్, డోర్ నెం. 11-6-96/1 దగ్గర, మొత్తం విస్తీర్ణం 1588.63 చ.గ.లు (ఐటెమ్ 1+2+3+4) డి.నెం. 8, 8/1ఏ, 8/1ఏ3ఏ, ఎదురుగా ఉన్న వాణిజ్య ఖాళీ స్థలం పులివర్తి రత్నబాబు గారికి చెందినది. **5)** సత్తెనపల్లి-గుంటూరు రోడ్డు, వైష్ణవి నగర్, సత్తెనపల్లి టౌన్, దగ్గరి డోర్ నెం. 11-6-96/2, వడ్డవల్లి గ్రామం సబ్ డివిజన్ తర్వాత రెవెన్యూ రికార్డుల ప్రకారం డి.నెం.8 వద్ద ఖాళీ స్థలం, వడ్డవల్లి గ్రామం, డి.నెం. 8-1ఎ1బి1లో 175 చ.గ.ల ఖాళీ స్థలం మరియు ఆర్.సి.సి రూఫ్డ్ ఇల్లు పులివర్తి రత్నబాబు గారికి చెందినది ఈ దిగువ హద్దులలో **తూర్పు:** 24 అ.ల వెడల్పు బజారు, **పడమర:** పులివర్తి రత్నబాబు గారి స్థలం, **ఉత్తరం:** అంకమ్మరావు గారి స్థలం, **దక్షిణం:** తిప్పబోయిన చిన్నమ్మ గారి స్థలం. **శ్రీమతి పి.అనురాధ గారి ఆస్తులు: 6)** సత్తెనపల్లి-గుంటూరు రోడ్డు, వైష్ణవి నగర్, సత్తెనపల్లి టౌన్, దగ్గరి డోర్ నెం.11-6-96/2, వడ్డవల్లి గ్రామం సబ్ డివిజన్ తర్వాత రెవెన్యూ రికార్డుల ప్రకారం డి.నెం.8-1ఏలో వాణిజ్యపరమైన ఖాళీ స్థలం 1331 చ.గ.లలో ఉంది (అనగా తహశీల్దార్ జారీ చేసిన సర్టిఫికేట్, ప్రత్యేక రిజిస్టర్డ్ నెం. 683/2014) వడ్డవల్లి గ్రామం, డి.నెం.8-1ఏ1ఏలో ఎకరా 0.04 1/2 సెంట్లు, డి.నెం. 8-1ఏ1సి1లో ఎకరా 0.23, మొత్తం రెండు సంఖ్యలు ఒక ఎకరా 0.27 1/2 సెంట్లు లేదా 1331 చ.గ.ల ఖాళీ స్థలం పులివర్తి అనురాధ గారికి చెందినది ఈ దిగువ హద్దులలో **తూర్పు:** తిప్పబోయిన చిన్నమ్మ గారి స్థలం, **పడమర:** పీరోజి గుడి భూమి, **ఉత్తరం:** గుంటూరు మాచర్ల రోడ్డు, **దక్షిణం:** కడియం పెద్ద అబ్బాయి గారి స్థలం.

తేది: 11-03-2025
ప్రదేశము: విజయవాడ
అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై దృష్టి సారించాలి

- ఎపి జెఎసి నేతల డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్
నూతన ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలైనా ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల అంశాలపై దృష్టి సారించకపోవడం బాధాకరమని ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె.వి.శివారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (ఎపి జెఎసి) కార్యవర్గ సమావేశం విజయవాడ గాంధీనగర్‌లోని ఎపి ఎన్‌జిఒ హోంలో సోమవారం జరిగింది. గత ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ వల్ల ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను దృష్టిలో పెట్టుకొని నూతన ప్రభుత్వానికి తగినంత సమయం ఇచ్చామని చెప్పారు. ఇప్పటివరకు సామరస్యపూర్వకంగా తమ ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. కానీ ప్రభుత్వ కార్యాచరణ ఏమాత్రం సరిగాలేదన్నారు. ప్రభుత్వ వ్యవహార శైలి ఇలాగే ఉంటే ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లలో అసంతృప్తి వ్యక్తమయ్యే అవకాశం ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించడం తప్పితే ప్రభుత్వ ఉద్యోగులకు ఎటువంటి ప్రయోజనాలు కలగలేదన్నారు. ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర జెఎసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ అలపర్తి విద్యాసాగర్ మాట్లాడుతూ.. 2023 జూలై నుండి వేతన సవరణ ప్రారంభం కావాల్సి ఉండగా, గత ప్రభుత్వం వేతన సవరణ కమిటీని నియమించిందని, అయితే ఆ కమిటీ ఛైర్మన్ గత ఏడాది రాజీనామా చేశారని తెలిపారు. వేతన సవరణ గడువు ముగిసి రెండేళ్లవుతున్నా ఇప్పటి వరకు పిఆర్‌సి కమిటీ ఛైర్మన్‌ను నియమించకపోవడం శోచనీయమన్నారు. ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎస్. ప్రసాద్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వం కూడా డిఎ మంజూరు చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో తొలగించిన ఎంపిహెచ్ఎలను తిరిగి సర్వీస్‌లోకి తీసుకోవాలన్నారు.

ఈ సమావేశంలో కో ఛైర్మన్లు ఎం.రఘునాథ్ రెడ్డి (ఎస్టీయు), జి హృదయ రాజు (ఏపిటిఎఫ్ 1938), డి. చంద్రశేఖర్ (ఎపి పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్), వై.శ్రీనివాసరావు (ఏపిపిటిడి నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్), ఎన్.చంద్రశేఖర్ (ఆల్ ఏపీ గవర్నమెంట్ క్లాస్ ఫోర్ ఎంప్లాయిస్ సెంట్రల్ అసోసియేషన్), సిహెచ్.మంజుల (ఏపీటీఎఫ్ 257) తదితరులు పాల్గొన్నారు.

శేషాచలం ఓ జీవ నిధి

- 'బయోడైవర్సిటీ' సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - క్యాంపస్ (తిరుపతి జిల్లా)
శేషాచలం జీవ నిధి అని, విద్యార్థులకు ప్రత్యేక పాఠ్యాంశంగా జీవ వైవిధ్యంపై బోధించాలని, తిరుమలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చొద్దు' అని బయోడైవర్సిటీ ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ అన్నారు. 'శేషాచలం జీవవైవిధ్యం' అనే సదస్సు శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం సెనెట్‌హాలులో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎపి బయోడైవర్సిటీ ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ బ్యూరో కో ఆర్డినేటర్ డాక్టర్ పాకనాటి హరికృష్ణయాదవ్, అక్షర ఫౌండేషన్ అధినేత హరిబాబు ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. జీవవైవిధ్యం పట్ల విద్యార్థి దశ నుంచి అవగాహన పెంపొందించాలన్నారు.

ప్రస్తుత విద్యాశాఖ మంత్రి లోకేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లి కరికులంలో జీవవైవిధ్యంపై పాఠ్యాంశాలు చేర్చేందుకు కృషి జరుగుతుందన్నారు. అంతరించిపోతున్న కొన్ని జీవజాలాలకు శేషాచలం కొండలు అవాసంగా ఉన్నాయన్నారు. నగరాల్లో జీవవైవిధ్య అడవులు పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ మాట్లాడుతూ.. శేషాచలం జీవవైవిధ్యానికి ప్రతీక అని, దాని రక్షణ బాధ్యత అటవీ శాఖదే అన్నారు. వర్సిటీ విసి అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు మాట్లాడారు. జీవవైవిధ్యానికి విశ్వవిద్యాలయ పరంగా కృషి చేస్తామని అన్నారు.

మార్కెట్ నిబంధనల ఉల్లంఘనల కేసు నుంచి అదానీలకు విముక్తి

- బాంబే హైకోర్టు

ముంబయి : 388 కోట్ల రూపాయల మార్కెట్ నిబంధనల ఉల్లంఘన కేసు నుండి అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్), గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, మేనేజింగ్ డైరెక్టర్ రాజేష్ అదానీలకు బాంబే హైకోర్టు విముక్తి కల్పించింది. మోసం జరిగినట్లు, నిందితులు నేరపూరిత కుట్రకు పాల్పడినట్లు ఆధారాలేవీ లేవని సోమవారం వెలువరించిన తీర్పులో కోర్టు స్పష్టం చేసింది. ఎఈఎల్, దాని ప్రమోటర్లు గౌతమ్ అదానీ, రాజేష్ అదానీలు నేరపూరిత కుట్రకు, మోసానికి పాల్పడ్డారంటూ సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ (ఎస్ఎఫ్ఐఒ) 2012లో కేసు నమోదు చేసి ఛార్జిషీటు దాఖలు చేసింది. కేసు నుంచి తమకు విముక్తి కల్పించాలంటూ నిందితులు దాఖలు చేసుకున్న పిటిషన్‌ను సెషన్స్ కోర్టు అదే ఏడాది తోసిపుచ్చింది.

దీనిని సవాలు చేస్తూ 2019లో ఏఈఎల్, ఆ ఇద్దరు పారిశ్రామికవేత్తలు బాంబే హైకోర్టులో పిటిషన్ వేశారు. సెషన్స్ కోర్టు ఆదేశాలను కొట్టివేయాలని కోరారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ ఆర్ఎన్ లడ్డా సింగిల్ బెంచ్ సెషన్స్ కోర్టు ఆదేశాలను కొట్టివేసింది. కేసు నుండి ఏఈఎల్‌కు, ఇరువురు ప్రమోటర్లకు విముక్తి కల్పించింది. కోర్టుకు అందజేసిన పత్రాలు, రికార్డులను జాగ్రత్తగా పరిశీలించామని, మోసం జరిగినట్లు ఎలాంటి ఆధారాలు చూపలేకపోయారని తెలిపింది. నేరపూరిత కుట్ర జరిగిందన్న ఆరోపణలో కూడా పస లేదని తేల్చింది. నిందితులు తప్పుడు మార్గాల్లో లబ్ధి పొందారని కేవలం ఊహాజనిత అంచనాలకు రావడం సరికాదని తెలిపింది. సుప్రీంకోర్టులో అప్పీలు చేసుకునేందుకు వీలుగా ఆదేశాలపై రెండు వారాల పాటు స్టే ఇవ్వాలని ఎస్ఎఫ్ఐఒ కోరగా న్యాయస్థానం అందుకు నిరాకరించింది.

'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' టీజర్ విడుదల

కల్యాణ్ రామ్, విజయశాంతి కీలక పాత్రల్లో నటిస్తోన్న చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. సోమవారం ఈ సినిమా టీజర్ విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణ్ రామ్, విజయశాంతి సినిమాకు సంబంధించిన పలు విషయాలు మాట్లాడారు. విజయశాంతి మాట్లాడుతూ.. 'ఈ స్టోరీ వినగానే ఏదో తెలియని అనుభూతి. ఎలాగైనా చేయాలనిపించింది. కల్యాణ్ రామ్.. అన్ని విషయాలను దగ్గరుండి చూసుకున్నారు. ఇందులో నేను యాక్షన్ సీన్స్ చేశా. నా అభిమానులకు తప్పకుండా నచ్చుతుంది. తొలి షాట్‌లోనే సీన్ పూర్తిచేశా. అందరూ ఆశ్చర్యపోయారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ విజయశాంతినే' అని అన్నారు. కళ్యాణ్ రామ్ మాట్లాడుతూ 'విజయశాంతిగారితో నాకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. ఈ సినిమా విషయానికొస్తే కర్తవ్యం'లో వైజయంతి పాత్రకు కొడుకు ఉంటే ఎలా ఉంటుందో అదే ఈ సినిమా. ప్రదీప్ ఈ కథతో నావద్దకు వచ్చినప్పుడు విజయశాంతి గారు అంగీకరించకుండా చేయడం కరెక్ట్ కాదనిపించింది. ఈ సినిమాకు బిగ్గెస్ట్ పిల్లర్ ఆమె. ఈ వయసులోనూ ఎలాంటి డూప్స్ లేకుండా స్టంట్స్ అద్భుతంగా చేశారు. ఈ సినిమాలో పృథ్వీ చాలా ముఖ్యమైన పాత్ర చేశారు. 'అతనొక్కడే'లా ఈ సినిమా కూడా ఇరవై ఏళ్ల పాటు గుర్తుంటుంది' అని కల్యాణ్ రామ్ అన్నారు.

నరేశ్ '12ఎ రైల్వే కాలనీ'

నరేశ్ హీరోగా నాని కాసరగడ్డ దర్శకత్వంలో కొత్త సినిమా రూపొందుతోన్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను చిత్రబృందం విడుదల చేసింది. '12ఎ రైల్వే కాలనీ' అనే పేరు ఖరారు చేసినట్లు టీమ్ తెలిపింది. ఈమేరకు టైటిల్ టీజర్ విడుదలచేశారు. 'పొలిమేర', 'పొలిమేర 2' రైటర్ నుంచి ఈ సినిమా సిద్ధమవుతోంది.



2028లో 'పుష్ప -3'

అల్లు అర్జున్, సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం 'పుష్ప'. దీనికి సీక్వెల్‌గా గతేడాది పుష్ప-2 కూడా వచ్చింది. దీనికి మరో సీక్వెల్‌గా పార్ట్ -3 ఉంటుందని ఇప్పటికే చిత్ర బృందం ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే పార్ట్- 3 రిలీజ్ ఎప్పుడుంటుందనే విషయాన్ని తాజాగా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ వెల్లడించారు. 'రాబిన్‌హుడ్' ప్రమోషన్స్‌లో భాగంగా విజయవాడ వెళ్లిన ఆయన 'పుష్ప' సీక్వెల్ గురించి మాట్లాడారు. 2028లో 'పుష్ప 3'ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనుకుంటున్నట్లు తెలిపారు.

ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో 'వేదవ్యాస్'



ఒకనాటి స్టార్ డైరెక్టర్ ఎస్వీ కృష్ణారెడ్డి 'వేద వ్యాస్' చిత్రానికి మళ్లీ మెగా ఫోన్ పట్టనున్నారు. కొన్నాళ్లుగా దర్శకత్వానికి ఆయన దూరంగా ఉన్న విషయం తెలిసిందే. 'వేద వ్యాస్' పేరుతో ఆయన ఓ కథ రాసుకున్నారని సమాచారం. ఈ చిత్రానికి స్క్రిప్ట్ వర్క్ కూడా దాదాపు పూర్తి కావొచ్చిందని తెలుస్తున్నది. కథ డిమాండ్ మేరకు చైనా, మలేషియా నుంచి కొత్త నటీనటుల్ని ఈ సినిమాకోసం ఎంచుకునే ప్రయత్నం కూడా మొదలుపెట్టారు. గతంలో మాదిరిగానే ఈ సినిమాకు కూడా సంగీతం ఎస్వీ కృష్ణారెడ్డి అందిస్తారు. ఈ సినిమా నిర్మాత, నటీనటులు, సాంకేతిక వర్గానికి సంబంధించిన వివరాలు త్వరలో తెలియనున్నాయి.

దిల్‌రాజు బ్యానర్‌లో 'ఎల్2ఇ ఎంపురాన్'

దిల్‌రాజు నిర్మాణ సంస్థ శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ వారు మోహన్‌లాల్ కథానాయకుడిగా, పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో రూపొందిన 'ఎల్2ఇ ఎంపురాన్' చిత్రాన్ని తెలుగులో విడుదలచేస్తున్నారు. 'లూసిఫర్' సినిమాకు సీక్వెల్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను మార్చి 27, 2025న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మురళి గోపి రాసిన కథతో లైకా ప్రొడక్షన్స్, ఆశీర్వాద్ సినిమాస్, శ్రీ గోకులం మూవీస్ బ్యానర్లపై సుబాస్కరన్, ఆంటోనీ పెరుంబవూర్, గోకులం గోపాలన్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా మలయాళం, తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.

Chola Enter a better life
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పోరేట్ ఆఫీసు: చోలా క్రెస్ట్, సూపర్ బి, సి54 మరియు సి55, 4, తిరు వి క ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032, టి.ఎన్.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 (రూల్స్) మరియు సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్స్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్ 2002 ("చట్టం") యొక్క నిబంధనల క్రింద
దిగువసంతకందారు చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఆధీకృత అధికారి (సెక్యూర్డ్ క్రెడిటార్) చట్టంలోని సెక్షన్ 13(12) కింద అందించబడిన అధికారాలను అమలు చేసూ, నిబంధన 3తో చదివిన సెక్షన్ కింద డిమాండ్ నోటీసు(లు) జారీ చేయబడింది. చట్టంలోని 13 (2) పేర్కొన్న నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు సంబంధిత నోటీసు (ల)లో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీత(లు)ని పిలవడం జరిగింది. రుణగ్రహీత (లు) డిమాండ్ నోటీసు (ల) సేవలను తప్పించుకుంటున్నారని/ నివారిస్తున్నారని దిగువసంతకందారు వారు సహేతుకంగా విశ్వసిస్తున్నారు. కాబట్టి నిబంధనల ప్రకారం అనుబంధం చేయడం మరియు ప్రచురించడం ద్వారా నోటీసు సేవ ప్రభావితమవుతుంది. డిమాండ్ నోటీసు(ల)లోని విషయాలు ఇక్కడ దిగువన సంగ్రహించబడ్డాయి.

క్ర సం.	రుణగ్రహీత/సహ-రుణగ్రహీతల పేరు మరియు చిరునామా	రుణం మొత్తం	డిమాండ్ నోటీసు తేది మరియు బాకీపడిన మొత్తం	సెక్యూర్డ్ అసెట్/ ఆస్తి వివరాలు
1.	రుణ ఖాతా నెం.: HL05NUK000069201 1) శ్రీ/శ్రీమతి.సుబ్బారావు మండపాటి, 2. శ్రీ/శ్రీమతి.గీర్వాణి మండపాటి **ఇరువురి నివాసం :** డో.నం.సి-96-1, బొగ్గారం, ఈపురు, గుంటూరు, బస్టాప్ వద్ద, ఈపురు, ఆంధ్రప్రదేశ్-522 658. **ఇక్కడ కూడా :** డో.నం.253/10బి/ డో.నం.5-3ఎ123, శ్రీ నిధనంపాటి లక్ష్మీ అమ్మవారి గుడి వద్ద, కొండాయపాలెం గ్రామం, బొగ్గారం గ్రామ పంచాయతీ, ఈపురు మండలం, పల్నాడు జిల్లా, శ్రీ నిధనంపాటి లక్ష్మీ అమ్మవారి గుడి వద్ద, రొంపిచెర్ల-522 617, ఆంధ్రప్రదేశ్.	₹ 20,00,000/-	12.03.2025 రూ.21,08,945/- (ఇరవై ఒక్క లక్షల ఎనిమిది వేల తొమ్మిది వందల నలభై ఐదు రూపాయలు మాత్రమే) 11.03.2025 నాటికి	పల్నాడు జిల్లా, నరసరావుపేట రిజిస్ట్రేషన్ జిల్లా, వినుకొండ ఉపజిల్లా, ఈపురు మండలం, బొగ్గవరం గ్రామం, పంచాయతీ, కొండాయపాలెం లో ఉన్న ఆ ఆస్తి మొత్తం డో.నం.253/10బి, పడగొట్టిన డో.నం.5-3ఎ123, మూల్యాంకనం నం.525, ఆ ఆర్.సి.సి. భవనంలో విస్తీర్ణం 411.4 చ.గ.లు. ఉన్న **హద్దులు : తూర్పు :** పంచాయతీ రోడ్డు 46.3 అ.లు., **పడమర :** సోమిశెట్టి ఆంజనేయులు సైట్ 46.3 అ.లు., **ఉత్తరం :** మండపాటి శరవణ తిరుమల కేశవ ప్రసన్నాంజనేయ సాయి కుమార్ సైట్ 80.0 అ.లు., **దక్షిణం :** ఆర్ అండ్ బి రోడ్డు 80.0 అ.లు. తో అన్నీ సౌలభ్య హక్కులు.

రుణగ్రహీత(లు) డిమాండ్ నోటీసు (లు)కు కట్టుబడి ఉండాలని మరియు ఈ ప్రచురణ తేదీ నుండి 60 రోజులలోపు వర్తించే వడ్డీ, అదనపు వడ్డీ, బౌన్స్ ఛార్జీలు, ఖర్చులు మరియు ఖర్చులతోపాటు అందులో పేర్కొన్న డిమాండ్ మొత్తాన్ని చెల్లింపు యొక్క సాక్షాత్కార తేదీ వరకు చెల్లించాలని దీని ద్వారా సూచించారు. చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ సురక్షిత రుణదా అని మరియు రుణగ్రహీత (లు) పొందే రుణ సదుపాయం స్థిరాస్తి/ ఆస్తులు తనఖాగా ఉంచిన సురక్షి ఆస్తి (లు)కి వ్యతిరేకంగా సురక్షి రుణం అని రుణగ్రహీత (లు) గమనించవచ్చు. రుణగ్రహీతలు నిర్దీ గడువులోగా తమ బాధ్యతలను పూర్తి చేయడంలో విఫలమైతే, సురక్షితమైన ఆస్తులు (లు) స్వాధీనం చేసుకోవడానికి చట్టంలోని సెక్షన్ 13 (4) ప్రకారం అన్ని హక్కులను వినియోగించుకోడానికి సురక్షి రుణదాకు అర్హత ఉంటుంది. విక్రయం ద్వారా చట్టం మరియు దాని క్రింద ఉన్న నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న ఏదైనా ఇతర పరిష్కారాన్ని అమలు చేయడం ద్వారా మరియు ద్వారా వాటిని బదిలీ చేయడానికి మాత్రమే పరిమితం కాకుండా. సురక్షిత రుణదాతకు అమ్మకం లేదా బదిలీ హక్కును అమలు చేయడానికి ముందు సురక్షి ఆస్తులు(లు) **అటాచ్ మరియు/లేదా సీల్** చేయడానికి కూడా అధికారం ఉంది. సురక్షిత ఆస్తుల (ల) విక్రయం ర్వా, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు చెల్లించాల్సిన బకాయిలను కవర్ చేయడానికి తనఖా పెట్టబడిన ఆస్తుల విలువ సరిపోకపోతే, బ్యాలెన్స్ బకాయిలను తిరిగి పొందటానికి ప్రత్యేక చట్టపరమైన చర్యలను ప్రారంభించే హక్కు కూడా సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఉంది. ఈ పరిహారం అదనంగా మరియు ఏదైనా ఇతర చట్టం ప్రకారం సెక్యూర్డ్ క్రెడిటార్‌కు అందుబాటులో ఉన్న అన్ని ఇతర నివారణలకు స్వతంత్రంగా ఉంటుంది.
అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8) కి, సురక్షిత ఆస్తులను మరియు చట్టంలోని సెక్షన్ 13(13)కి రుణగ్రహీతల దృష్టిని ఆహ్వానిస్తున్నారు. దీని ద్వారా రుణగ్రహీత (లు) సురక్షిత ఆస్తి (ల)ను పాడు చేయడం లేదా వాటితో వ్యవహరించడం లేదా అమ్మకం, లీజు లేదా ఇతరత్రా (సాధారణ వ్యాపారంలో కాకుండా) ఏదైనా సురక్షి ఆస్తి(ల) యొక్క ముందస్తు వ్రాతపూర్వక అనుమతి లేకుండా బదిలీ చేయడం నుండి నిరోధించబడింది/నిషేధించబడింది సెక్యూర్డ్ క్రెడిటార్ మరియు పైన పేర్కొన్న వాటిని పాటించకపోవడం, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 29 ప్రకారం శిక్షార్హమైన నేరం. డిమాండ్ నోటీసు కాపీ కింద సంతకం చేసిన వారి వద్ద అందుబాటులో ఉంటుంది మరియు రుణగ్రహీత (లు) వారు కోరుకున్నట్లయితే, సాధారణ కార్యాలయ వేళల్లో ఏదైనా పని దినాన దిగువ సంతకం చేసిన వారి నుండి సేకరించుకోవచ్చును.

సం/-
అధీకృత అధికారి
చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్. తరపున
ప్రదేశం : పల్నాడు, ఆంధ్రప్రదేశ్
తేది : 12.03.2025

పిల్లలను కాలువలో తోసేసిన తండ్రి

- కుమార్తె మృతి, కుమారుణ్ని రక్షించిన స్థానికులు
- కానరాని తండ్రి ఆచూకీ

ప్రజాశక్తి- రామచంద్రపురం (డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ)

తన ఇద్దరి పిల్లలకు ఓ తండ్రి కాలువలోకి తీసేశారు. ఆ తర్వాత తండ్రి ఆచూకీ కానరావడం లేదు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా రామచంద్రపురం మండలం నెలపర్తిపాడు గ్రామంలో సోమవారం ఘటన చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం... రాయవరం మండలం వెంటూరుకు చెందిన పిల్లి రాజు, పిల్లి విజయ భార్యాభర్తలు. వారికి కుమారుడు సందీప్ (10), కుమార్తె కారుణ్య (6) ఉన్నారు. స్టీల్ సామాన్లు, ఇతరత్రా సామగ్రిని ఇన్‌స్టాల్‌మెంట్లపై అమ్ముకుంటూ కుటుంబాన్ని రాజు పోషిస్తున్నారు. ఇద్దరు పిల్లలను రామచంద్రపురంలోని భాష్యం స్కూల్లో చదివిస్తున్నారు. కుటుంబ పోషణ, వ్యాపారం నిమిత్తం అప్పులు చేశారు. వాటిని తీర్చలేక తరచూ భార్య వద్ద బాధపడుతూ ఉండేవారు. అందరం కలిసి ఆత్మహత్య చేసుకుందామని పలుమార్లు భార్య వద్ద అంటుండేవారు. సోమవారం మధ్యాహ్నం స్కూల్ నుంచి తన పిల్లలను ఇంటికి రాజు తీసుకొచ్చారు. వారిని ఆడిస్తూ నెలపర్తిపాడు పంట కాలువ వద్దకు చేరుకున్నారు. కాలువ చెంతన కొంతదూరం నడిపించి తన ఇద్దరి పిల్లలను దానిలో తోసేశారు. పిల్లల అరుపులు విన్న స్థానికులు పంట కాలువలోకి దిగి అక్కడ తుప్పలలో వేలాడుతున్న బాలుడిని రక్షించారు. చిన్నారి కారుణ్య అప్పటికే మృతి చెందింది. ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాలిక మృతదేహాన్ని రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాలుడిని తల్లికి అప్పగించారు. పిల్లి రాజు పరారయ్యారా? లేదా తానూ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నారా? అనేది తెలియాల్సి ఉంది. రెండు రోజుల క్రితం కాకినాడలో ఓ తండ్రి తన ఇద్దరు పిల్లలను హత్య చేసి, తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువకముందే అదే తరహాలో మరో ఘటన చోటు చేసుకోవడం చర్చనీయాంశమైంది.

సావిత్రి (ఫైల్)

ఆభరణాల కోసం దారుణ హత్య

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

బంగారు నగల కోసం 75 ఏళ్ల వద్ధురాలిని గొంతు నిలిమి హత్య చేసిన ఘటన పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలోని కొత్తపేటలో సోవారం జరిగింది. దీనిపై మృతురాలి కుటుంబీకుల వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన కొప్పెరపు సావిత్రి(75) 11 ఏళ్లుగా వినుకొండలోని కొత్తపేటలో నివాసం ఉంటున్నారు. కరోనా సమయంలో భర్త మతి చెందడంతో ఆమె ఒంటరిగానే ఉంటున్నారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వారు మార్కాపురంలోనే నివాసం ఉంటున్నారు. సావిత్రి పెద్దలుడు కాకుమాను శ్రీను వినుకొండలోని హోటల్లో పనిచేస్తుండగా, మరో అల్లుడు బ్రహ్మం ఇక్కడే వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. అయితే ప్రతిరోజు అత్తకు ఇద్దరి అల్లుళ్లలో ఎవరో ఒకరు భోజనం ఇచ్చి వెళ్తుంటారు. సోమవారం మధ్యాహ్నం రెండు గంటలప్పుడు చిన్నల్లుడు బ్రహ్మం భోజనం ఇచ్చి వెళ్లాడు. ఎప్పటిలాగే సావిత్రి చుట్టుపక్కల వారితో మాట్లాడి భోజనం చేసేందుకు ఇంట్లోకి వెళ్లారు. అనంతరం రాత్రి వరకు ఆమె బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వాళ్లు ఇంటి వద్దకు వెళ్లి చూశారు. ఇంట్లో నుండి టీవీ సౌండ్ పెద్దగా వినపడుతుండడం, ఇంటికి బయట గడి పెట్టి ఉండటం గమనించి సావిత్రి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో అల్లుళ్లు వచ్చి గడియ తీసి చూశారు. అత్త సావిత్రి ఒంటిపై తీవ్ర గాయాలతో హత్యకు గురి కావడం చూసి షాక్ అయ్యారు. ఆమె ఒంటిపై ఉన్న బంగారం చైను, గాజులు, ఉంగరాలు, చెవి దిద్దులు, బంగారు పూసల గొలుసు మొత్తం 16 సవర్ల ఆభరణాలు అపహరణకు గురైనట్లు గుర్తించారు. వినుకొండ పట్టణ సిఐ శోభన్ బాబు, ఎస్ఐలు ఘటనా స్థలిని పరిశీలించి కేసు నమోదు చేశారు. ఆభరణాల కోసమే జరిగిన హత్యగా ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చి క్లూస్ టీం, డాగ్ స్క్వాడను రంగంలోకి దించి విచారణ చేపట్టారు.

హైకోర్టు న్యాయవాదుల సంఘానికి 27న ఎన్నికలు

ప్రజాశక్తి-అమరావతి

ఎపి హైకోర్టు న్యాయవాదుల సంఘానికి ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు పోలింగ్ జరగనుంది. సాయంత్రం 5 గంటల తర్వాత ఫలితాలు వెలువడతాయి. ఈ నెల 19న నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ. ఆ తర్వాత రోజు నామినేషన్ల ఉపసంహరణ అయ్యాక తుది జాబితా వెలువడుతుంది. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది ఎం విజయ్ కుమార్ వ్యవహరిస్తారు. అధ్యక్షులు కలిగినీడి చిదంబరం మళ్లీ పోటీ చేయడంతో సంఘానికి ఇన్‌ఛార్జి అధ్యక్షులుగా ఎన్ రంగారెడ్డి నియమితులయ్యారు.

కోకో రైతులను ఆదుకోవాలి

- అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర ఇవ్వాలి
- ఉద్యాన శాఖ డైరెక్టర్‌కు రైతుల సంఘాల విజ్ఞప్తి

డైరెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

ప్రజాశక్తి- గుంటూరు

రైతుల వద్ద ఉన్న కోకో గింజలు వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులుకు ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ఎన్‌టిఆర్ తదితరుల జిల్లాల కోకో రైతులు, నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు, రైతులతో ఉద్యాన శాఖ డైరెక్టర్ కార్యాలయంలో అధికారులు, కోకో గింజల కొనుగోలు కంపెనీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోకో రైతులు తమను ఆదుకోవాలంటూ అధికారులకు విన్నవించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ప్రతినిధులు ఎస్.గోపాలకృష్ణ, బొల్లు రామకృష్ణ తదితరులు మాట్లాడుతూ కోకో గింజలను కంపెనీలు అతి తక్కువ ధరకు కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. ఇప్పటివరకు ఎటువంటి నాణ్యత ప్రమాణాల ప్రస్తావన లేకుండా కోకో గింజలు కొనుగోలు చేసిన కంపెనీలు ప్రస్తుతం నాణ్యతా ప్రమాణాల పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలకు కిలోకు రూ.700కు పైగా ధర ఉన్నా, కంపెనీలు ప్రస్తుతం రూ.550 నుండి రూ.600 మాత్రమే ధర ఇస్తున్నాయని తెలిపారు. ఇప్పటివరకులేని గ్రేడింగ్ విధానాన్ని కంపెనీలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. రోజురోజుకీ కంపెనీలు కోకో గింజల ధర తగ్గిస్తుండడంతో కౌలు రైతులు, రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పుల పాలవుతున్నారని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చి అన్ సీజన్, సీజన్ కోకో గింజలను తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీలు తగిన ధర ఇవ్వకపోతే వ్యత్యాసపు ధరను రాష్ట్ర ప్రభుత్వం కోకో రైతులకు చెల్లించే విధంగా చర్యలు తీసుకొని కోకో రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఫెడరల్ వ్యవస్థకు మోడీతో ప్రమాదం

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఫెడరల్ వ్యవస్థకు, రాజ్యాంగానికి ప్రమాదం కలిగేలా మెజారిటైజేషన్ విధానాన్ని ముందుకు తీసుకొస్తున్నారని, ఇది దేశానికి ప్రమాదమని సిపిఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ తెలిపారు. విజయవాడలోని దాసరి భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భాషల వల్ల రాష్ట్రాల అభివృద్ధి జరగదని తెలిపారు. తమిళనాడులో హిందీ భాష అమలు గురించి ఒత్తిడి చేయవద్దని హితవు పలికారు. జనాభా ప్రాతిపదికన నాలుగు రాష్ట్రాల్లో పునర్విభజన వల్ల 150 సీట్లు పెరుగుతాయన్నారు. కుటుంబ నియంత్రణ అమలు చేసే రాష్ట్రాల్లో సీట్లు తగ్గుతాయని చెప్పారు. గతంలో చంద్రబాబు.. కుటుంబంలో ఒక్కరు చాలన్నారని, ఇప్పుడు ఎక్కువ మందిని కనాలని అంటున్నారని తెలిపారు. మోడీ నిర్ణయాలను చంద్రబాబు అమలు చేయాల్సి ఉందని, రాజకీయంగా ఎదుర్కోవాలని, అసంబద్ధమైన వాదనకు తెరలేపొద్దని సూచించారు. ఏప్రిల్‌లో సిపిఐ జాతీయ సమితి సమావేశం, సెప్టెంబరులో జాతీయ మహా సభలు జరుగుతాయన్నారు.

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ.. తొమ్మిది నెలల కాలంలో రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచేశారని తెలిపారు. గతంలో జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, చంద్రబాబు రాష్ట్రాన్ని కాపాడతారని ప్రజలు నమ్మారని, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. ఏడు నెలల్లో రూ.3 లక్షల కోట్లు రాష్ట్రానికి అందించామని కేంద్ర మంత్రి అమిత్ షా తెలిపారని, ఆ నిధులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అంతంత మాత్రమే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల తక్కువగా ఉన్నాయి. ఈ మేరకు కేంద్ర ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌదరి సమాధానంలో స్పష్టమైంది. 2021-22లో రూ.21,342.43 కోట్లు, 2022-23లో రూ.13,174.27 కోట్లు, 2023-24లో 9,640.84 కోట్లు, 2024-25లో రూ.3,989.72 కోట్లు విడుదల చేశారు. అందులో పట్టణ స్థానిక సంస్థలకు 2021-22లో రూ.956 కోట్లు కేటాయించగా, రూ.1,157.35 కోట్లు విడుదల చేశారు. 2022-23లో రూ.990 కోట్లు కేటాయించగా, రూ.735.75 కోట్లు విడుదల చేశారు. 2023-24లో రూ.1,046 కోట్లు కేటాయించగా, రూ.984.55 కోట్లు విడుదల చేశారు. 2024-25లో రూ.1,109 కోట్లు కేటాయించగా, రూ.305.05 కోట్లు విడుదల చేశారు. మొత్తం నాలుగేళ్లలో రూ.4,101 కోట్లు కేటాయిస్తే, రూ.3,182.7 కోట్లు విడుదల చేశారు. గ్రామీణ స్థానిక సంస్థలకు 2021-22లో రూ.1,939 కోట్లు కేటాయించగా, రూ.969.50 కోట్లు విడుదల చేశారు. 2022-23లో రూ.2,010 కోట్లు కేటాయించగా, రూ.948.35 కోట్లు విడుదల చేశారు. 2023-24లో రూ.2,031 కోట్లు కేటాయించగా, రూ.3,974.19 కోట్లు విడుదల చేశారు. 2024-25లో రూ.2,152 కోట్లు కేటాయించగా, రూ.2,109.97 కోట్లు విడుదల చేశారు. మొత్తం నాలుగేళ్లలో రూ.8,132 కోట్లు కేటాయిస్తే, రూ.8,002.01 కోట్లు విడుదల చేశారు.

విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ ఆపాలి

- యునైటెడ్ పోర్టు అండ్ డాక్ వర్కర్స్ యూనియన్
- కార్యాచరణ ప్రకటన

ఉద్యమ కార్యాచరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలని, ప్రయివేటుపరం చేసేందుకు పిలిచిన రీ టెండర్‌ను రద్దు చేయాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు వివిఎస్ పద్మనాభరాజు డిమాండ్ చేశారు. సోమవారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో యునైటెడ్ పోర్ట్ అండ్ డాక్ వర్కర్స్ యూనియన్, విడిఎల్‌బి, డాక్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్పిటల్ ప్రయివేటీకరణలో భాగంగా పోర్టు యాజమాన్యం పిపిపి పద్ధతిలో రీ టెండర్‌ను ఆహ్వానించడం, ఏప్రిల్ 19 వరకు గడువు ఇవ్వడం, ఏప్రిల్ 21న టెండర్లు ఓపెన్ చేయడం ద్వారా పోర్టు కార్మికుల ఆరోగ్య భద్రతను అపహాస్యం చేస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. హాస్పిటల్ ప్రయివేటీకరణతో పోర్టు ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు తీవ్ర నష్టం జరుగనుందని తెలిపారు. పోర్టు యాజమాన్యమే సొంత నిధులతో హాస్పిటల్‌ను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు బి.జగన్, కె.సత్యనారాయణ మాట్లాడుతూ.. పోర్టు హాస్పటల్ ప్రయివేటీకరణకు సంబంధించిన రీ టెండర్‌ను రద్దు చేయాలంటూ తలపెట్టిన ఉద్యమ కార్యాచరణను వివరించారు. అందులో భాగంగా ఈ నెల 18 నుంచి పోర్టు ప్రాంగణంలో గేటు మీటింగ్‌లు, 24 నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు, ఏప్రిల్ ఒకటి నుంచి ఉద్యోగుల నివాస ప్రాంతాల్లో నిరసనలు, ఏప్రిల్ 9న చలో ఎఒబి కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. ఆయా కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో వి.రామలింగేశ్వరరావు, జక్కాన సత్యనారాయణ, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు. అనంతరం ఉద్యమ కార్యాచరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

మహిళలపై పోలీసు దాష్టీకమా?

- అట్టుడికిన జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ

శ్రీనగర్ : న్యాయం కోసం ఆందోళన చేస్తున్న మహిళలపై డిఎస్‌పి స్థాయి అధికారి ఒకరు కాళ్లతో తన్నుతూ, దుర్భాషలాడుతున్న వీడియో జమ్ముకాశ్మీర్ అసెంబ్లీని అట్టుడికించింది. పార్టీలకు అతీతంగా నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సి), పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి), కాంగ్రెస్‌లకు చెందిన ఎమ్మెల్యేలు ఈ ఘటనపై నిరసన తెలిపారు. జావేద్ చౌదరి, మియాన్ మెహర్ అలీ, జావైద్ మిర్చల్, జాఫర్ అలీ ఖటానా తదితరులు వెల్ వైపు దూసుకొచ్చారు. మార్షల్స్ వారిని అడ్డుకున్నారు. 'జమ్ముకాశ్మీర్ పోలీసు రాజ్యమా? పోలీసులు ఎవరినైనా కాల్చగలరా, అరెస్టు చేయగలరా? పోలీసులకు చట్టం లేదా' అని ఎన్‌సి ఎమ్మెల్యే నజీర్ గురేజి ప్రశ్నించారు. 'జమ్ముకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఈ విషయాన్ని పరిష్కరిస్తారు' అని స్పీకర్ అబ్దుల్ రహీం రాథర్ చేసిన ప్రకటనతో ఎమ్మెల్యేలు శాంతించారు.

గత నెలలో దక్షిణ కాశ్మీర్‌లోని కుల్గాంలో మాహ్ అష్మజీ ప్రాంతం నుంచి అదృశ్యమైన ముగ్గురు యువకులు అనుమానాస్పద స్థితిలో మరణించి కనిపించారు. ఈ మరణాలపై దర్యాప్తు చేయాలని కోరుతూ ఆదివారం కుల్గాంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మహిళలతో సహా నిరసనకారులను పోలీసులు తన్నుతూ, లాఠీలతో కొడుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తునకు ఆదేశించారు. ఈ ఘటనపై శ్రీనగర్ డిఐజి విచారణ జరిపి 10 రోజుల్లోగా నివేదికను అందజేస్తారని పోలీసు ఉన్నతాధికారులు సోమవారం తెలిపారు. కుల్గాం ఘటనకు వ్యతిరేకంగా జమ్ము విశ్వ విద్యాలయంలోనూ నిరసనలు జరిగాయి. పోలీసు అధికారిపై చర్యలు తీసుకోవాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.

తులసి గబ్బర్డ్‌తో రాజ్‌నాథ్ సింగ్ భేటీ

న్యూఢిల్లీ : అమెరికా డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసి గబ్బర్డ్ సోమవారం కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలను, ప్రధానంగా రక్షణ, సమాచార భాగస్వామ్య రంగాల్లో బలోపేతం చేయడంపై విస్తృతంగా చర్చలు జరిపారు. ఈ సందర్భంగా 'అమెరికా జాతీయ నిఘా అధిపతిని కలవడం సంతోషంగా ఉంది. సమావేశంలో ఇరు దేశాల మధ్య భాగస్వామ్యాన్ని మరింతగా వృద్ధి చేసుకునే మార్గాలను చర్చించాం' అని రాజ్‌నాథ్ సింగ్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. రెండు రోజుల పర్యటనకు వచ్చిన ఆమె ఆదివారం జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సమావేశమయ్యారు. అమెరికా నిఘా చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తులసి గబ్బర్డ్ రెండో విదేశీ పర్యటన ఇది. తన మొదటి విదేశీ పర్యటనలో భాగంగా తులసి గబ్బర్డ్ గత నెలలో జర్మనీ వెళ్లారు. అక్కడ మ్యూనిచ్ భద్రతా సమావేశంలో పాల్గొన్నారు.

మళ్లీ మారుతీ సుజుకీ ధరల పెంపు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి మరోమారు తమ వాహన ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 1 నుంచి తమ వాహన ధరలను 4 శాతం వరకు పెంచాలని నిర్ణయించినట్లు ఆ కంపెనీ సోమవారం రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. దీంతో గత రెండు నెలల్లో ఇది రెండోసారి పెంపు కావడం గమనార్హం. తయారీ ఖర్చులు, నిర్వహణ వ్యయాలు పెరగడం వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఈ వ్యయాల భారాన్ని కొంతభాగం వినియోగదారులకు బదిలీ చేయడం మినహా వేరే మార్గం లేదని ఆ కంపెనీ పేర్కొంది. ఈ కంపెనీ ప్రాథమిక మోడల్ ఆల్టో కె-10 నుంచి ఇన్విక్టో మోడళ్లను విక్రయిస్తోంది. వీటి ధరల శ్రేణి రూ.4 లక్షల నుంచి రూ.29 లక్షల వరకు ఉంది. ఇంతక్రితం మోడళ్లను బట్టి గరిష్ఠంగా రూ.32,500 వరకు పెంచేసింది. తాజా పెంపునతో కొనుగోలుదారులపై మరింత భారం పడనుంది.

అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల్లో నకిలీ ఉత్పత్తులు

- ఇ-కామర్స్ సంస్థల గిడ్డంగుల్లో బిఐఎస్ సోదాలు

న్యూఢిల్లీ : ఇ-కామర్స్ సంస్థల్లో నకిలీ ఉత్పత్తులు, ప్రామాణికత లేని ఉత్పత్తులపై బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్) ఎట్టకేలకు దృష్టి పెట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి దిగ్గజ ఆన్‌లైన్ విక్రేతలకు చెందిన గిడ్డంగులపై బిఐఎస్ దాడులు చేసి వేలాది ధృవీకరించని ఉత్పత్తులను స్వాధీనం చేసుకున్నట్లు వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. మార్చి 7న లక్నో, గురుగావ్, ఢిల్లీలోని ఇ-కామర్స్ గిడ్డంగులపై బిఐఎస్ దాడులు నిర్వహించింది. లక్నోలోని అమెజాన్ గిడ్డంగి నుండి 215 బొమ్మలు, 24 హ్యాండ్ బ్లెండర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిని బిఐఎస్ సర్టిఫికేషన్ లేకుండా విక్రయిస్తున్నారు. ఫిబ్రవరి 2025లో గురుగావ్‌లోని అమెజాన్ గిడ్డంగిపై జరిగిన దాడిలో 58 అల్యూమినియం ఫాయిల్స్, 34 మెటాలిక్ వాటర్ బాటిళ్లు, 25 బొమ్మలు, 20 హ్యాండ్ బ్లెండర్లు, 7 పివిసి కేబుల్స్, 2 ఫుడ్ మిక్సర్లు, 1 స్పీకర్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఫ్లిప్‌కార్ట్ గురుగావ్ గిడ్డంగిలో జరిపిన సోదాల్లో సర్టిఫికెట్లు లేని 534 స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిళ్లు, 134 బొమ్మలు, 41 స్పీకర్లు స్వాధీనం చేసుకున్నారు. బిఐఎస్ గుర్తింపు లేని ఉత్పత్తులను ఆయా సంస్థల్లో నిరంతరం విక్రయించడంపై ఫిర్యాదులు అందిస్తోన్న నేపథ్యంలో సోదాలు చేసినట్లు సమాచారం.

'ఉక్కు'పై కేంద్రం కుట్రలను తిప్పికొడతాం

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటుపరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఐక్య పోరాటాలతో తిప్పికొడతామని సిఐటియు నాయకులు యు వెంకటేశ్వర్లు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 1495వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు, ఉక్కు ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్మికుల పోరాటానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో మద్దతు తెలపాలన్నారు. కర్మాగారాన్ని కాపాడేందుకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని కోరారు. ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించేలా, సెయిల్‌లో విలీనం చేసేలా కృషి చేయాలన్నారు. రానున్న కాలంలో ఉక్కు పరిరక్షణ ఉద్యమం ప్రజా ఉద్యమంగా రూపుదాల్చనుందని తెలిపారు. త్యాగాలతో ఏర్పడ్డ కర్మాగారాన్ని త్యాగాలతోనే పరిరక్షించుకుంటామని స్పష్టం చేశారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే సిబ్బంది

సేఫ్టీ గిర్డర్‌ను ఢీకొట్టిన లారీ

- అనకాపల్లి విజయరామరాజుపేట వద్ద పక్కకు ఒరిగిన రైల్వే ట్రాక్
- గూడ్స్ లోకో పైలట్ అప్రమత్తతతో తప్పిన ముప్పు

ప్రజాశక్తి - అనకాపల్లి

అనకాపల్లి విజయరామరాజుపేట అండర్ బ్రిడ్జి వద్ద సోమవారం తెల్లవారుజామున భారీ లోడుతో వెళ్తున్న గుర్తు తెలియని లారీ రైల్వే బ్రిడ్జి సేఫ్టీ గిర్డర్‌ను ఢీకొట్టింది. అది రైల్వే ట్రాక్‌ను బలంగా తాకడంతో ట్రాక్ పక్కకు ఒరిగింది. ఇదే సమయంలో ట్రాక్‌పై ఓ గూడ్స్ రైలు వస్తుంది. ట్రాక్ ఒరిగి ఉండడాన్ని లోకో పైలట్ గమనించి అత్యవసర బ్రేకులు వేసి రైలును నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో పలు రైళ్లకు అంతరాయం కలిగింది. మూడు గంటలపాటు రైల్వే అధికారులు శ్రమించి ట్రాక్‌ను పునరుద్ధరించారు. ప్రమాద విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అక్కడకు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. టిడిపి నాయకులు సురేంద్ర, జోగి నాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ), సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆందోళన వ్యక్తం చేశారు.

నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం : సిపిఎం

ప్రమాదంపై మీడియాతో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ..క్వారీల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా పరిమితికి మించి హెవీ లోడ్‌లతో వాహనాలను తిప్పుతుండటం వల్లే ఈ ప్రమాదం జరిగిందన్నారు. రైల్వే అండర్ బ్రిడ్జిలు ఉన్న ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా అధికారుల నిరంతర పర్యవేక్షణ అవసరమన్నారు.

అనంత కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

నిధుల విడుదలపై రచ్చ

- అనంత కార్పొరేషన్‌లో మాటల యుద్ధం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం జిల్లా కార్పొరేషన్‌లో ఇటీవల విడుదల చేసిన నిధులు, డంపింగ్ యార్డు తరలింపుపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. మేయర్ మహ్మద్ వసీం అధ్యక్షతన కార్పొరేషన్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించారు. వీధి కుక్కల పట్టివేత, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లకు సంబంధించి నిధుల విడుదల, బిల్లుల చెల్లింపు అంశంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మేయరు ఒకరిపై ఒకరు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసుకున్నారు. వర్క్ ఆర్డర్ లేకుండానే రూ.34 లక్షల బిల్లులు ఇచ్చి అవినీతికి పాల్పడ్డారంటూ కార్పొరేషన్ పాలకవర్గంపై ఎమ్మెల్యే ఆరోపణలు చేశారు. రూ.14 లక్షల బిల్లులనూ ఇలాగే మంజూరు చేశారని ధ్వజమెత్తారు. దీనిపై మేయర్ మహమ్మద్ వసీం సలీం ఘాటుగానే స్పందించారు. అక్రమాలపై విచారణ జరిపించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. రూ.14 లక్షల బిల్లుల చెల్లింపుపై విచారణ చేపట్టాలంటూ కమిషనర్ బాలస్వామిని మేయర్ కోరారు. నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టి బాధ్యతలపై చర్యలు తీసుకుంటామంటూ ఎమ్మెల్యే తెలిపారు. దుర్వినియోగం అయిన నిధులను సంబంధిత వ్యక్తుల నుంచి కక్కిస్తామన్నారు.

ఐజిఎంసి స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న శాప్ ఛైర్మన్, క్రీడల నిర్వహణ కమిటీ సభ్యులు

నేటి నుంచి ప్రజాప్రతినిధుల క్రీడా సంబరాలు

- విజయవాడ ఐజిఎంసి స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ అర్బన్)

ప్రజాప్రతినిధుల క్రీడా సంబరాలకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు తెలిపారు. ఈ నెల 20 వరకు జరిగే ఈ క్రీడా సంబరాలను మంగళవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడు, క్రీడాశాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు. నగరంలోని ఐజిఎంసి స్టేడియంలో జరుగుతున్న ఏర్పాట్లను, పలు క్రీడా కోర్టులను ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, బొజ్జల సుధీర్ రెడ్డి, సుందరపు విజయ్‌కుమార్, పివిజిఆర్ నాయుడు (గణబాబు), ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, పంచుమర్తి అనురాధతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. క్రీడల నిర్వహణకు సంబంధించి ట్రయల్ గేమ్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాప్ ఛైర్మన్ రవి నాయుడు మీడియాతో మాట్లాడుతూ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు 13 రకాల క్రీడలను నిర్వహించనున్నామని తెలిపారు. ఈనెల 20న విజేతలకు బహుమతులు ప్రదానం జరుగుతుందని చెప్పారు.

గంజాయి ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్(గుంటూరు)

మంగళగిరి మండల పరిధిలో గంజాయి విక్రయిస్తున్న తొమ్మిది మంది ముఠా సభ్యులను మంగళగిరి గ్రామీణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళగిరి గ్రామీణ సిఐ వై శ్రీనివాసరావు, గ్రామీణ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ మీడియాకు తెలిపిన వివరాల మేరకు.. మంగళగిరి మండలం కాజా గ్రామానికి చెందిన యువకులు గత కొంతకాలంగా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందిన మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి కాజా గ్రామంలో నిఘా ఏర్పాటు చేశారు. కాజా పరిధిలోని నంబూరు కెనాల్ వద్ద యువకులు గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశారు. పదిమందిలో ఒక యువకుడు పరారు అవ్వగా తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుండి రూ.95 వేల విలువైన ఒక కేజీ 900 గ్రాముల గంజాయిని, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించనున్నట్లు సిఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గంజాయి విక్రయించినా... సేవించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, వరసగా మూడు కేసులు నమోదైతే వాటిని పిడి యక్ట్ కింద నమోదు చేస్తామని హెచ్చరించారు.

బాబు-పవన్ ఏకాంత భేటీ

- నాగబాబుకు మంత్రి పదవిపైనే చర్చ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం కొద్దిసేపు ఏకాంతంగా భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. మంత్రివర్గ సమావేశం ముగిసిన తరువాత వీరిద్దరూ ముఖ్యమంత్రి ఛాంబర్‌లోనే మాట్లాడుకున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా పవన్ సోదరుడు నాగబాబుకు మంత్రివర్గంలో స్థానం కల్పించే అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. అలాగే పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మకు సంబంధించిన అంశంపైనా మాట్లాడుకున్నట్లు సమాచారం. జనసేన ఆవిర్భావ సభ పిఠాపురంలో జరిగిన అనంతరం నెలకొన్న పరిస్థితులపై చంద్రబాబు ఆరా తీసినట్లు తెలిసింది.

అలాగే పుంగనూరులో టిడిపి కార్యకర్త రామకృష్ణ దారుణ హత్యకు గురైన ఘటనపై చంద్రబాబు సీరియస్ అయినట్లు తెలిసింది. దీనిపై డిజిపిని కూడా పిలిపించి మాట్లాడినట్లు సమాచారం. ఈ ఘటన, అనంతర పరిణామాలపై నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు సమాచారం.

ఎపి ఆయుర్వేద, హోమియోపతి

వైద్య వృత్తిదారుల రిజిస్ట్రీకరణ (సవరణ) బిల్లుకు ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ (ఆయుర్వేద, హోమియో, యునాని) వైద్య వృత్తిదారుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన సవరణ బిల్లును రాష్ట్ర శాసనసభ సోమవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. బిల్లును వైద్యాశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సభలో ప్రవేశపెట్టారు. ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణల ప్రకారం ఆయుర్వేద, హోమియో, యునాని వైద్య వృత్తిదారుల రిజిస్ట్రేషన్ కోసం ప్రస్తుతం అమల్లో ఉన్న ఆయుర్వేద వైద్య రిజిస్ట్రేషన్ బోర్డు, హోమియో యునాని వైద్య విధానాల రిజిస్ట్రేషన్ బోర్డు, హోమియో యునాని వైద్య విధానాల రిజిస్ట్రేషన్ బోర్డుల స్థానంలో ఆయా వైద్య విధానాల మండళ్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం బిల్లులో సవరణలు ప్రతిపాదించిందని మంత్రి వివరించారు. ఆంధ్రా ప్రాంతంలో ఆయుర్వేద, హోమియో వైద్య విధానాల్లో వృత్తి విద్య కొనసాగిస్తున్న వారి విద్యార్హతలను క్రమబద్ధీకరించడం ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమన్నారు. సభలో బిల్లును మూజువాణి ఓటుతో ఏకగ్రీవంగా ఆమోదించినట్లు ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు ప్రకటించారు.

చిత్తూరు వెంకటేశ్వరరావు మృతి పట్ల సభ సంతాపం

తణుకు మాజీ ఎమ్మెల్యే చిత్తూరి వెంకటేశ్వరరావు మృతిపట్ల శాసనసభ సంతాపాన్ని ప్రకటించింది. సంతాప తీర్మానాన్ని ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు ప్రవేశపెట్టారు. సంతాప సూచకంగా సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది.

మళ్లీ వైమానిక దాడులు

- యెమెన్‌పై అమెరికా దుర్మార్గం

దుబాయ్ : యెమెన్‌పై అమెరికా సోమవారం మరిన్ని వైమానిక దాడులకు తెగబడింది. ఎర్ర సముద్రంలోని ఓడరేవు పట్టణం హోడైదాతోపాటు రాజధాని సనాకు ఉత్తరాన ఉన్న అల్‌జాఫ్ గవర్నరేట్‌లను లక్ష్యంగా చేసుకుని అమెరికా దాడులకు పాల్పడినట్లు హౌతీలకు చెందిన అల్ మసీరా టివి తెలిపింది. ఎర్ర సముద్రంలో తిష్టవేసి ఉన్న అమెరికా విమాన వాహక నౌక యుఎస్‌ఎస్ హ్యారీ ఎస్.ట్రూమాన్ నుంచి ఈ దాడులు జరిగాయని తన నివేదికలో తెలిపింది. ఈ దాడుల్లో మృతుల, గాయపడిన వారి వివరాలు ఇంకా వెల్లడికావాల్సి ఉంది. యెమెన్‌లోని హౌతీలే లక్ష్యంగా అమెరికా దాడులకు దిగిన సంగతి తెలిసిందే. అణు చర్చలకు సంబంధించి ఇరాన్‌పై ఒత్తిడి తేవడానికి ఆ దేశంపై ట్రంప్ మరిన్ని ఆంక్షలు విధించడంతోపాటు యెమెన్‌పై దాడులకు దిగినట్లుగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ దాడులను యుద్ధ నేరంగా హౌతీ అభివర్ణించింది. ఈ దాడులను వెంటనే ఆపాలని రష్యా అమెరికాకు విజ్ఞప్తి చేసింది. డోనాల్డ్ ట్రంప్ యుద్ధోన్మాదానికి యెమెన్ మరోసారి బలవుతోంది. ట్రంప్ ఆదేశాల మేరకు అమెరికా సైన్యం ఆదివారం ఆ గల్ఫ్ దేశంపై భీకర దాడులు ప్రారంభించింది. ఆదివారం దాడుల్లో 53 మంది చనిపోయారు. ఇంకా అనేక మంది గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలు, పిల్లలే ఉన్నారు.

24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె

(మొదటిపేజీ తరువాయి)

(ఎన్‌ఒబిడబ్ల్యు) జాతీయ ఉపాధ్యక్షులు టి.రఘురామ్ మాట్లాడుతూ... ప్రభుత్వం బ్యాంకింగ్ రంగంలో అమలు చేస్తున్న కొన్ని విధానాలకు వ్యతిరేకంగా, అమలు చేయాల్సిన కొన్ని అంశాలను అమలు చేయకుండా తాత్సారం చేయడానికి వ్యతిరేకంగా ఈ సమ్మెకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ కాన్ఫెడరేషన్ (ఎఐబిఒసి) విజయవాడ ఇన్‌ఛార్జి అజీమ్ బాషా మాట్లాడుతూ... ఒక అధికారి, ఒక క్లర్క్‌తో ఈ రోజు అనేక బ్యాంక్ శాఖలు పని చేస్తున్నాయని తెలిపారు. ప్రైవేటు రంగంలో 8,500 బ్యాంక్ శాఖలకు 3.14 లక్షల మంది పని చేస్తుంటే పబ్లిక్ రంగంలో 22,500 శాఖలకు 3.30 లక్షల మంది ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. 6 లక్షలకు పైగా ఉద్యోగుల కొరత ఉందని, దీని వల్ల ఉద్యోగులకు పని ఒత్తిడి ఎక్కువై అనారోగ్యం బారిన పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం డిజిటల్ బ్యాంకింగ్ విస్తృతంగా అమలు అవుతుండటంతో 5 రోజుల పని దినాలు చేయడం వల్ల ఖాతాదారులకు ఎటువంటి ఇబ్బంది ఉండదన్నారు. అల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్ అసోసియేషన్ (ఎఐబిఒఎ) సహాయ ప్రధాన కార్యదర్శి జె.అవినాష్ మాట్లాడుతూ... బ్యాంక్ యాజమాన్యాలు గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. పని ఒత్తిడి వల్ల బ్యాంక్ అధికారులు ఆత్మహత్యలు పాల్పడుతున్నారని చెప్పారు.

పార్టీ పూర్వవైభవానికి కార్యాచరణ

- రాజకీయ, సైద్ధాంతిక, సంస్థాగత లోపాలు, బలహీనతలపై ప్రణాళిక
- రాబోయే జాతీయ మహాసభల్లో దృష్టి
- జ్యోతిబసు ప్రధాని పదవి నిరాకరణ క్షీణతకు కారణమని భావించడంలేదు..
- సిపిఎం సమన్వయకర్త ప్రకాశ్ కరత్

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్, త్రిపు రాష్ట్రాల్లో ప్రజల మద్దతు కోల్పోవడం వల్లనే సిపిఎం బలం తగ్గిపోయిందని పార్టీ సీనియర్ నేత, సమన్వయకర్త ప్రకాశ్ కరత్ చెప్పారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై రాబోయే సిపిఎం జాతీయ మహాసభల్లో చర్చిస్తామని ఆయన తెలిపారు. పార్టీ బలం క్షీణించడానికి 1996లో సీనియర్ నేత జ్యోతిబసు ప్రధాని పదవిని నిరాకరించడమే కారణమని తాను భావించడం లేదని సోమవారం పిటిఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. 'సొంతంగా పార్టీ బలం, ప్రభావం పెరగలేదన్నది వాస్తవం. పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాల్లో ప్రజల మద్దతు కోల్పోవడమే దానికి కారణం. అవి మాకు రెండూ బలమైన రాష్ట్రాలు' అని చెప్పారు. పార్టీని ఎలా పటిష్టపరచాలి అనే విషయంపైనే రాబోయే జాతీయ మహాసభల్లో దృష్టి సారిస్తామని తెలిపారు.

పార్టీ జాతీయ మహాసభల సన్నాహకాలపై కరత్ మాట్లాడుతూ గత మూడేళ్లలో రాజకీయ, సంస్థాగత సమీక్షలు నిర్వహించామని అన్నారు. రాజకీయ, సైద్ధాంతిక, సంస్థాగత కార్యాచరణలో లోపాలు, బలహీనతలను జాతీయ మహాసభల్లో గుర్తిస్తామని ఆయన చెప్పారు. 'బిజెపిని లేదా మోడీ ప్రభుత్వాన్ని ఒంటరిని చేయడం, ఓడించడం అనే లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుంటాం. అందుకోసం విస్తృత ఐక్యత అవసరం. మేము దానిని గుర్తించాం. ఈ విస్తృత ఐక్యత సాధన, విస్తృత వేదిక ఏర్పాటుపైన మేము కృషి చేయాల్సి ఉంటుంది. అదే సమయంలో దీనిని మేము వేర్వేరుగా చూడడం లేదు. సిపిఎంను బలోపేతం చేయడమంటే మొత్తంగా ప్రతిపక్షాల ఐక్యతను లేదా వామపక్షాల ఐక్యతను పటిష్టపరచడమే. మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న అనేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు వామపక్ష ప్రత్యామ్నాయ రాజకీయాలు లేదా విధానాలు కీలకమని మేము భావిస్తున్నాం' అని వివరించారు.

1996లో అప్పటి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి జ్యోతిబసుకు ఇవ్వజూపిన ప్రధానమంత్రి పదవిని అంగీకరించరాదని పార్టీ తీసుకున్న నిర్ణయం సిపిఎం బలం క్రమేపీ క్షీణించడానికి కారణమన్న వాదనతో కరత్ విభేదించారు. 'ఆ సమయంలో పార్లమెంటులో ప్రధానంగా మాకు ఉన్న బలం పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిందేనన్న వాస్తవాన్ని విస్మరించకూడదు. ప్రభుత్వంలో ఉన్నా లేదా ఏ పదవిలో ఉన్నా పార్టీ బలం పెంచుకోవచ్చునని మేము భావించలేదు. దశాబ్దాల కృషి ఫలితంగా పశ్చిమ బెంగాల్‌లో మాకు ఆ బలం చేకూరింది. వివిధ వర్గాల ప్రజల హక్కుల కోసం మేము ఆందోళనలు చేశాం. అవి 1977లో వామపక్ష కూటమి ప్రభుత్వం ఏర్పడడానికి కారణమయ్యాయి. కొన్ని మంత్రిత్వ శాఖలు తీసుకోవడం వల్ల పార్టీ బలం పెరగదు. అందుకే ఆ సమయంలో ప్రధాని పదవిని తీసుకోవడం ప్రయోజనకరం కాదని భావించాం. రాజకీయంగా యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ ఏర్పాటుకు మేము కట్టుబడి ఉన్నాం' అని అన్నారు.

1996లో సిపిఎంకు 32 మంది లోక్‌సభ సభ్యులు ఉన్నారని కరత్ గుర్తు చేస్తూ విధానాల అమలులో మైనారిటీ ప్రభుత్వానికి స్వేచ్ఛ ఉండదని చెప్పారు. పార్టీ అఖిల భారత మహాసభలకు సన్నాహాలు జరుగుతున్న తరుణంలో ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం సిపిఎంకు ఎదురు దెబ్బేనని అన్నారు.

అయినప్పటికీ పార్టీ సంస్థాగత నిర్మాణం కారణంగా మహాసభలకు సన్నాహకాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

'మా పొలిట్‌బ్యూరో, కేంద్ర కమిటీ ఉమ్మడి ప్రాతిపదికన పనిచేస్తున్నాయి. సీతారాం మరణంతో కలిగిన నష్టాన్ని అధిగమించగలిగాం' అని అన్నారు. వయోపరిమితిని 75 సంవత్సరాలుగా కేంద్ర కమిటీ నిర్ణయించినందున పార్టీకి కొత్త నాయకత్వం లభిస్తుందని చెప్పారు. '75 సంవత్సరాల వయసు దాటిన వారు కేంద్ర కమిటీకి ఎన్నిక కావడానికి అనర్హులు. కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యులను, ప్రధాన కార్యదర్శిని ఎన్నుకుంటుంది' అని పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకాష్ కరత్ వివరించారు.

టెన్త్ ప్రశాంతం

- నంద్యాలలో మారిన తెలుగు ప్రశ్నాపత్రం
- ఇన్విజిలేటర్‌ను రిలీవ్ చేసిన డిఇఒ
- చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌కు షోకాజు నోటీసులు

ప్రజాశక్తి- యంత్రాంగం

పదో తరగతి పరీక్షల్లో తొలి రోజే అపశృతులు చోటుచేసుకున్నాయి. నంద్యాల ప్రభుత్వ బాలికల పాఠశాల పరీక్షా కేంద్రంలో ఒక విద్యార్థినికి తెలుగు 70 మార్కుల ప్రశ్నాపత్రం 01టి బదులుగా వంద మార్కుల 03టి ప్రశ్నాపత్రాన్ని ఇన్విజిలేటర్ కామేశ్వరి ఇచ్చారు. పరీక్ష అయిన తర్వాత విద్యార్థులు సమాధాన పత్రాలు ఇచ్చిన తర్వాత ఈ విషయాన్ని ఇన్విజిలేటర్ గమనించి పైఅధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సాయంత్రం డిఇఒ కార్యాలయంలో జరిగిన టెలికాన్ఫరెన్స్‌లో డిఇఒ జనార్ధన్‌రెడ్డి బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్ కమిషనరేట్ డైరెక్టర్‌కు ప్రశ్నపత్రం మారిన విషయం తెలిపారు. వివరాలు పంపాలని, విద్యార్థినికి న్యాయం చేస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారు. ఇన్విజిలేటర్ కు షోకాజు నోటీసు ఇచ్చి విధుల నుండి డిఇఒ తప్పించారు. చీఫ్ సూపరింటెండెంట్ మార్గెట్, చీఫ్ డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ నరసింహులకు షోకాజ్ నోటీసు ఇచ్చారు.

కర్నూలులో మాస్ కాపీయింగ్, ఇద్దరు విద్యార్థులు డిబార్ : ఒక టీచర్ సస్పెన్షన్, మరొకరికి షోకాజు నోటీసు

కర్నూలు జిల్లా జొన్నగిరి ఉన్నత పాఠశాలలోనూ, కర్నూలు నగరంలోని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక మున్సిపల్ పాఠశాలలోనూ మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులను అధికారులు డిమాండ్ చేశారు. ఆ పరీక్షా కేంద్రాల ఇద్దరు ఇన్విజిలేటర్ల (టీచర్ల)ను సస్పెండ్ చేశారు. వారిలో ఒకరికి షోకాజ్ నోటీసు కూడా జారీ చేశారు.

నేలపై కూర్చొని పరీక్షలు

హోళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు కింద కూర్చొని పరీక్ష రాస్తుండడాన్ని గమనించి ఆ పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లను విధుల నుంచి తప్పిస్తూ, వారిద్దరినీ ఆర్‌జెడికి డిఇఒ సరెండర్ చేశారు.

టెక్కలిలో గందరగోళం

శ్రీకాకుళం జిల్లా టెక్కలి ప్రభుత్వ ఉన్నత, బాలికోన్నత పాఠశాలల వద్ద విద్యార్థులు గందరగోళానికి గురయ్యారు. సాధారణ పదో తరగతి పరీక్షలు, ఓపెన్ పదో తరగతి ఒకే కేంద్రాల్లో నిర్వహించడంతో హాజరైన విద్యార్థులు అయోమయ పరిస్థితికి గురయ్యారు. సాధారణ పదో తరగతి పరీక్షలు రాయడానికి వచ్చిన విద్యార్థులు ఓపెన్ పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్దకు వెళ్లి తమ హాల్ టికెట్ల నంబరు చూసుకున్నారు. అందులో నంబర్లు లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. పరీక్షా కేంద్రాల నిర్వాహకులు వారికి స్పష్టతనివ్వడంతో కేంద్రానికి చేరుకున్నారు.

పరీక్ష రాయాలంటే.... నది దాటాల్సిందే!

పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండల కేంద్రంలో పరీక్ష రాసేందుకు నాగావళి నది అవతల కొట్టు గ్రామానికి చెందిన విద్యార్థులు నదిని దాటుకొని వచ్చారు. విజయనగరం జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాల్లో తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో వేసవి నేపథ్యంలో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

టెన్త్ పరీక్షా కేంద్రానికి తాత్కాలిక మార్గం

కృష్ణా జిల్లా కంకిపాడు-రొయ్యూరు రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతుండడంతో కొత్తగా వేసిన సిసి రోడ్డుపై వాహనాలు నడవకుండా ముళ్ల కంచె వేశారు. దీంతో, ఈ మార్గంలోని కంకిపాడు మండలం గొడవర్రు జడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి విద్యార్థుల కోసం తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు.

98.27 శాతం మంది విద్యార్థులు హాజరు

రాష్ట్రంలో పదో తరగతి పరీక్షకు తొలిరోజు సోమవారం ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షకు 98.27 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ విజయ్‌రామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3,450 పరీక్షా కేంద్రాల్లో 6,27,277 మంది విద్యార్థులకుగానూ 6,16,451 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. 10,826 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

ఎన్‌ఆర్‌ఇజిఎస్‌లో రూ.250 కోట్ల అవినీతి

- బాధ్యులపై చర్యలు : పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి హయాంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ పథకం (ఉపాధి హామీ)లో రూ.250 కోట్ల మేర అవినీతి జరిగినట్లు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ శాసనసభలో వెల్లడించారు. సోమవారం శాసనసభ ప్రశ్నోత్తరాల సందర్భంగా 'ఎన్‌ఆర్‌ఇజిఎస్‌లో అవినీతిని నిర్మూలించడం' అనే అంశంపై జరిగిన చర్చలో పవన్‌కల్యాణ్ మాట్లాడారు. ఆడిట్ చేయాల్సిన అధికారే అవినీతికి పాల్పడ్డారన్నారు. ప్రాథమికంగా తేల్చిన అవినీతిలో ఇప్పటి వరకు రూ.71 కోట్లు రికవరీ చేశామన్నారు. ఉపాధి హామీ కూలీలకు వేతనం పెంపు అంశం కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదన్నారు. పెండింగ్ బిల్లులను త్వరలో క్లియర్ చేస్తామన్నారు. ఉపాధి హామీలో జంగిల్ క్లియరెన్స్ అనేది లేదన్నారు. చర్చలో పార్థసారధి మాట్లాడుతూ.. వైసిపి కార్యకర్తలను ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమించుకుని దొంగ మస్తర్లు వేసి వారి పార్టీ కార్యకర్తలకు నిధులను దోచిపెట్టారన్నారు. జెసిబి యంత్రాలతో పనులు చేశారని, కొన్నిచోట్ల అసలు పనులు చేయకుండానే బిల్లులు చేసుకున్నారన్నారు. ఆదోనిలో జరిగిన ఉపాధి పనులపై రీ ఆడిట్ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై సోషల్ ఆడిట్ నిర్వహించాలన్నారు. కొలికిపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తన నియోజకవర్గంలో ఉపాధి హామీలో పెద్దయెత్తున అవినీతి జరిగిందని, 77 మంది ఫీల్డ్ అసిస్టెంట్లపై శాఖాపరమైన విచారణ చేపట్టాలని కోరారు. కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ.. వ్యవసాయానికి ఎన్‌ఆర్‌ఇజిఎస్ అనుసంధానం చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు.

సమాచార సమన్వయంతో పోరాటాలకు స్ఫూర్తి

- 'టెలిసూర్' ప్రెసిడెంట్
- హవానాలో ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు

పాట్రియా ఇంటర్నేషనల్ కొలోక్వ్యామ్

హవానా నుంచి ప్రత్యేకం : ప్రపంచంలోని వివిధ దేశాల్లో పోరాడే ప్రజల మధ్య జరిగే సమాచార సమన్వయం పోరాటాలకు మరింత స్ఫూర్తి నిస్తుందని లాటిన్ అమెరికా దేశాల ప్రత్యామ్నాయ టెలివిజన్ ఛానల్ 'టెలిసూర్' ప్రెసిడెంట్ పట్రిసియా విజగ అన్నారు. క్యూబన్ ప్రెస్ డే సందర్భంగా ఆ దేశానికి చెందిన యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఆఫ్ క్యూబా (యుపిఇసి)'పాట్రియా ఇంటర్నేషనల్ కొలోక్వ్యామ్ 4వ ఎడిషన్ 'అంతర్జాతీయ సదస్సును సోమవారం హవానాలో ప్రారంభమైంది. ఈ సదస్సుకు 46 దేశాల నుండి 300మందికిపైగా ప్రతినిధులు హాజరయ్యారు. ప్రారంభ కార్యక్రమంలో మాట్లాడిన పట్రిసియా విజగ పోరాడే ప్రజల మధ్య పరస్పర సమాచార మార్పిడి అత్యంత కీలకమని చెప్పారు. టెలిసూర్ ప్రారంభం నుండి ఈ లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్లు చెప్పారు.

వెనిజులా మాజీ అధ్యక్షుడు ఛావెజ్ చొరవతో 2000 సంవత్సరంలో ప్రారంభమైన తమ సంస్థ 2005 నుండి కార్పొరేట్ మీడియా సంస్థల కట్టుకథలపై విస్తృతమైన పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. వెనిజులాతో పాటు లాటిన్ అమెరికా అంతా విస్తరించి పోరాడే ప్రజలకు సంఘీభావంగా నిలుస్తున్నట్లు తెలిపారు. ఇజ్రాయిల్‌లో చోటుచేసుకున్న అకృత్యాలను, అమానుష హింసాకాండను వెలికితీసే క్రమంలో భద్రతకు సంబంధించి తీవ్రమైన సమస్యలు ఎదుర్కున్నట్లు చెప్పారు. భాషా సంబంధిత సమస్యలు వీటికి అదనమని చెప్పారు. అటువంటి అవాంతరాలు ఎన్ని ఉన్నా అధిగమించి ముందుకు సాగుతున్నట్లు ఆమె తెలిపారు. అంతర్జాతీయంగా ఈ కృషిని మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన బాధ్యత వివిధ దేశాల్లో ఉన్న ప్రత్యామ్నాయ మీడియా సంస్థలపై ఉందని చెప్పారు. తాము ప్రారంభించిన కాలంలో సాంకేతికతకు పరిమితులుండేవని, ఇప్పుడు ఎఐతో సహా ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చిందని, దీనిని సద్వినియోగం చేసుకోవాల్సి ఉందని చెప్పారు. ఆమె ప్రసంగాన్ని హవానా విశ్వవిద్యాలయంకు చెందిన కమీల అనే జర్నలిజం విద్యార్థిని అంగ్లంలోకి అనువదించారు.

సందర్శించిన క్యూబన్ ప్రెసిడెంట్

క్యూబా ప్రెసిడెంట్ మిగాయిల్ డయాజ్ కానెల్ అంతర్జాతీయ సదస్సు జరుగుతున్న ప్రాంతాన్ని సందర్శించారు. వివిధ దేశాల నుండి వచ్చిన ప్రతినిధులను ఆయన పలకరించి, కాసేపు మాట్లాడారు. వారితో కలిసి గ్రూపు ఫోటో దిగారు.

-బి. తులసీదాస్

వర్గీకరణ నివేదికకు కేబినెట్ ఓకే

(మొదటిపేజీ తరువాయి)

సిఆర్‌డిఏ కమిషనర్‌కు కట్టబెడుతూ నిర్ణయం తీసుకున్నారు. ప్రపంచబ్యాంకు, ఎడిబి, హడ్కో, వంటి ఆర్థిక సంస్థల నుంచి వచ్చిన 15,095 కోట్ల రుణంతో అమలు చేసే మరో 37 పనుల నిర్వహణ అధికారాన్ని అమరావతి అభివృద్ధి సంస్థ చైర్మన్‌కు అప్పగించారు.

బుడమేరుకు నిధులు

గత ఏడాది తీవ్ర నష్టం కలిగించిన బుడమేరు కాలువ మరమ్మతు పనులకు నిధులు కేటాయిస్తూ నిర్ణయించారు. తాత్కాలిక పనులకు 1.80 కోట్లు, పూర్తి స్థాయి పనులకు 37.97 కోట్లు కేటాయించాలని నిర్ణయించారు. కొత్తగా ప్రకటించిన ఎపి ఇన్నోవేషన్, స్టార్ట్ అప్ పాలసీ ద్వారా ఎకో సిస్టమ్‌ను అమలుచేసేందుకు, ఇటీవల జరిగిన రాష్ట్ర పరిశ్రమల ప్రమోషన్ బోర్డు ద్వారా అనుమతించిన ప్రాజెక్టులకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అలాగే అనంతపురం సత్యసాయి జిల్లాల్లో కొత్తగా నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యంతో ఎన్‌జిఇఎల్ హరిత్ సంస్థ స్థాపించే పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు. గ్రీన్ ఎనర్జీ విధానంలో భాగంగా ఆస్తా వెంచర్స్‌కు పంప్‌డ్ స్టోరేజి ప్రాజెక్టు ఏర్పాటుకు 864 ఎకరాల భూమిని ప్రత్యామ్నాయ అటవీకరణ కింద ఇచ్చే ప్రతిపాదనలపైనా చర్చ జరిగింది. ప్రముఖ ఒబరాయ్ హొటల్స్ అధ్వర్యంలో ఉన్న ఒబరాయ్ విలాస్‌కు యాక్సస్ రోడ్ నిర్మాణానికి కూడా అనుమతిచ్చినట్లు తెలిసింది. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్ల నియామకాలపైనా నిర్ణయం తీసుకున్నారు.

కడప పేరు మళ్లీ

గతంలో కడప జిల్లా పేరును వైఎస్‌ఆర్ జిల్లాగా మార్పు చేయగా, తాజాగా దానిని వైఎస్‌ఆర్ కడప జిల్లాగా మార్చాలన్న ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అమరావతి ప్రాంతంలో వివిధ సంస్థలకు భూములు కేటాయించేందుకు ఇప్పటికే తయారైన ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదముద్ర వేసింది.

ఒంటిపూట పని విధానం : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో : ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున అంగన్వాడీ కేంద్రాలను ఒంటిపూట నిర్వహించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కోరింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి బేబిరాణి, కె సుబ్బరావమ్మ మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి, డైరెక్టర్‌కు సోమవారం లేఖ రాశారు. ఎండల తీవ్రత ఎక్కువైనందున ప్రీ స్కూల్ పిల్లలు, గర్భిణులు, బాలింతలు, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎండల వల్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకూ ఒక్కపూట మాత్రమే నిర్వహించేలా ఆదేశాలివ్వాలని లేఖలో పేర్కొన్నారు. వెయ్యి, పన్నెండు వందల జనాభా ఉన్నచోట్ల మినీ కేంద్రాలే నడుస్తున్నాయని తెలిపారు. మినీ కేంద్రం వర్కర్లు, వర్కరు, హెల్పర్ రెండు పనులు చేస్తున్నారని చెప్పారు. మినీ వర్కర్లకే పనిభారం పెరిగిందని, ఎటువంటి సెలవులు ఇవ్వడం లేదన్నారు. వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, వేసవి సెలవులు మినీ వర్కర్లకే అమలు చేయాలని కోరారు.

కనీస వేతనం ఇచ్చి కడుపు నింపండి

(మొదటిపేజీ తరువాయి)

551, 132, 57, 142, 680 జిఒలను పంచాయతీ కార్మికులకు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక పంచాయతీల్లో నాలుగు నెలల నుంచి 45 నెలల వరకూ కార్మికుల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పెండింగ్ వేతనాలు వెంటనే కార్మికులకు చెల్లించాలన్నారు. ఎన్‌ఎంఆర్‌లకు ప్రభుత్వమే జీతాలు చెల్లించాలన్నారు. కోర్టు తీర్పులను పరిగణలోకి తీసుకుని పంచాయతీ కార్మికులకు టెండర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లేకుంటే పోరాటం తప్పదని ప్రభుత్వాన్ని హెచ్చరిం చారు. యూనియన్ రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర నాయ కులు జి.రామాంజనేయులు, కె.శివప్రసాద్, సిహెచ్ సుబ్బారావు, వాకాటి రాము, గోవిందప్ప, చింతల శ్రీనివాసరావు, ఎస్.సురేంద్ర, ఆంజనేయులు, శివరావు, కృష్ణ, శారద, గౌరి, నాగన్న, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధర్నాకు యూనియన్ల సంఘీభావం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, మధ్యాహ్న భోజన పథకం కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ కె.ధనలక్ష్మి, తదితరులు ధర్నాకు సంఘీభావం తెలిపారు.

గౌహతిలోనే 'మణిపూర్' కేసుల విచారణ : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ : అస్సాంలోని గౌహతికి ఇప్పటికే బదిలీ చేసిన మణిపూర్ హింసాకాండ కేసుల విచారణ అక్కడే కొనసాగుతుందని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. అలాగే జస్టిస్ గీతా మిట్టల్ నేతృత్వంలోని కమిటీ పదవీ కాలాన్ని ఈ ఏడాది జులై 31 వరకూ పొడిగించింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. మణిపూర్ హింసాకాండ బాధితులకు సహాయం, పునరావాసం కల్పించడం కోసం జమ్ముకాశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతా మిట్టల్ నేతృత్వంలో ఒక కమిటీని 2023, ఆగస్టు 7న సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ కమిటీలో బాంబే హైకోర్టు మాజీ జడ్జి షాలిని పి జోషి, ఢిల్లీ హైకోర్టు మాజీ జడ్జి ఆశా మీనన్ కూడా ఉన్నారు. గత ఏడాది ఆగస్టులో కూడా ఈ కమిటీ పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగించారు. గౌహతికి బదిలీ చేసిన కేసుల విచారణ విషయంపై మణిపూర్ ప్రభుత్వం తరుపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సోమవారం తన వాదనలు వినిపించారు. న్యాయవాది అభ్యర్థనలను ధర్మాసనం తిరస్కరించింది. 'ఇప్పటికే బదిలీ చేసిన కేసుల విచారణ గౌహతిలోని కోర్టుల్లోనే జరుగుతుందని స్పష్టం చేస్తున్నాం' అని సిజెఐ తెలిపారు. తదుపరి విచారణను జూలై 21కి వాయిదా వేశారు. ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించడంతో సహా 27 కేసుల విచారణను గౌహతికి సుప్రీంకోర్టు 2023 ఆగస్టులో బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుల విచారణకు తగినంత మంది న్యాయమూర్తులను ఏర్పాటు చేయాలని గౌహతి హైకోర్టును సుప్రీంకోర్టు ఆదేశించింది. 2023 మే 3 నుంచి మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాకాండలో ఇప్పటి వరకూ 200 మందికి పైగా మరణించగా, అనేక వందల మంది గాయపడ్డారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వేల మంది ఇప్పటికీ పునరావాస కేంద్రాల్లోనే ఉంటున్నారు.

వైవి.సుబ్బారెడ్డికి మాతృవియోగం

- నివాళులర్పించిన వైఎస్.విజయమ్మ, ప్రముఖులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

టిటిడి మాజీ చైర్మన్, రాజ్యసభ సభ్యులు వైవి.సుబ్బారెడ్డికి మాతృవియోగం కలిగింది. ఆయన తల్లి యర్రం పిచ్చమ్మ (85) వయోభారం కారణంగా సోమవారం మృతి చెందారు. ఆమెకు నలుగురు సంతానం ఉన్నారు. వైవి సుబ్బారెడ్డితో పాటు భద్రారెడ్డి, హనుమారెడ్డి, కుమార్తె సచిదేవి ఉన్నారు. మంగళవారం బాపట్ల జిల్లా మేదరమెట్లలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పిచ్చమ్మ మృతి పట్ల మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుబ్బారెడ్డి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. అంత్యక్రియల్లో జగన్ పాల్గొననున్నారు. ఒంగోలు లాయర్ పేటలోని సుబ్బారెడ్డి నివాసంలో భౌతికకాయానికి వైఎస్ విజయమ్మ, వైసిపి సీనియర్ నాయకులు సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు బాలినేని శ్రీనివాసరెడ్డి ,ఆయన సతీమణి సచీదేవి, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి, అంబటి రాంబాబు, ఆదిమూలపు సురేష్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ,మాజీ ఎమ్మెల్యేలు కుందురు నాగార్జున రెడ్డి, పలువురు వైసిపి నాయకులు నివాళులర్పించారు.

డూప్లికేట్ ఓటరు ఐడిలపై చర్చకు నిరాకరణ

- రాజ్యసభ నుంచి ప్రతిపక్ష సభ్యులు వాకౌట్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బహుళ నకిలీ ఓటరు ఐడి కార్డులు జారీ చేయడంలోనూ, డీలిమిటేషన్‌లోనూ కేంద్ర ఎన్నికల కమిషన్ లోపాలపై చర్చకు రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ సింగ్ అనుమతి నిరాకరించారు. దీంతో ప్రతిపక్షాలు సభను వాకౌట్ చేసి తమ నిరసన తెలియజేశాయి. సోమవారం రాజ్యసభ ప్రారంభం కాగానే కాంగ్రెస్, టిఎంసి, వామపక్షాలు సహా ప్రతిపక్ష పార్టీలు ఈ అంశాన్ని లేవనెత్తాయి. ప్రతిపక్ష ఎంపిలు 267వ నిబంధన కింద నోటీసులిచ్చారు. తాము లేవనెత్తిన అంశంపై చర్చ చేపట్టాలని డిమాండ్ చేశారు. అయితే డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ మాట్లాడుతూ ఛైర్మన్ ఇచ్చిన రూలింగ్‌లకు అనుగుణంగా నోటీసులు లేనందున వాటిని ఆమోదించలేమని అన్నారు. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, టిఎంసి ఎంపిలు నకిలీ ఓటరు ఐడి కార్డుల అంశాన్ని లేవనెత్తాయి. డిఎంకె, సిపిఎం, సిపిఐ తదితర పార్టీలు దక్షిణాది రాష్ట్రాలపై తదుపరి డీలిమిటేషన్ ప్రక్రియ ప్రభావాన్ని చర్చించాలని కోరాయి. అయితే అందుకు ప్రభుత్వం నిరాకరించడంతో ప్రతిపక్ష ఎంపిలు నినాదాల హోరెత్తించారు. అయితే, వారి నోటీసులను ఆమోదించలేదని, వారు చెప్పినది ఏదీ రికార్డులో లేదని హరివంశ్ పేర్కొన్నారు. దీంతో ప్రతిపక్ష ఎంపిలు వాకౌట్ చేసి నిరసన వ్యక్తం చేశారు.

రైళ్ల రద్దీ, భద్రత, ప్రాంతీయ కేటాయింపులపై ఎంపిల ఆందోళన

రైళ్ల రద్దీ, భద్రత, ప్రాంతీయ కేటాయింపులపై ఎంపిలు పార్లమెంట్‌లో ఆందోళనలు లేవనెత్తారు. రైల్వే మంత్రిత్వశాఖపై చర్చ సందర్భంగా సోమవారం రాజ్యసభలో పలువురు ఎంపిలు.. రద్దీగా ఉండే రైళ్లు, పేలవమైన నిర్వహణ, అధిక ఛార్జీలపై ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్‌సిపి (శరద్ పవర్) పార్టీకి చెందిన ఎంపి ఫౌజియా ఖాన్ ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్లలోని దారుణమైన పరిస్థితులు ఉన్నాయని అన్నారు. బిఎస్‌పికి చెందిన ఎంపి రామ్‌జీ సాంకేతిక పురోగతి ఉన్నప్పటికీ భద్రతా సమస్యలను ఎత్తి చూపారు. ఎంపిలు మరిన్ని జనరల్ కంపార్ట్‌మెంట్లు, మెరుగైన ప్రాంతీయ కనెక్టివిటీని డిమాండ్ చేశారు. పార్లమెంటరీ ప్రశ్నలకు మంత్రిత్వశాఖ స్పందన లేకపోవడాన్ని జెఎంఎం సర్ఫ్‌రాజ్ అహ్మద్ విమర్శించారు.

మరోవైపు లోక్‌సభలో కూడా ఇదే అంశంపై జరిగిన చర్చలో ప్రతిపక్ష ఎంపిలు రైల్వేకు సంబంధించిన వివిధ సమస్యలను లేవనెత్తారు. ప్రభుత్వ నిర్వహణలో లోపాలతో రైల్వేను 'వెంటిలేటర్'పైకి తెచ్చారని విమర్శించారు. ప్రజా దిగ్గజ సంస్థను ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ తయారు చేయడంలా చేశారని, దీనివల్ల ప్రయోజనం ఉండదని ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి. కాంగ్రెస్ ఎంపి వర్ష గైక్వాడ్ మాట్లాడుతూ.. రైల్వే బడ్జెట్ 'రికార్డ్ బద్దలు కొట్టే' చర్య అని చేసిన వాదనలు తప్పు అని, వాస్తవానికి ఇది 'విఫల బడ్జెట్' అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతి అభివృద్ధి 2014 తర్వాత ప్రారంభమైందని ఒక కథనాన్ని సృష్టిస్తోందని ఆమె అన్నారు. కానీ వివరాల్లోకి వెళ్తే వాస్తవాలు స్పష్టం అవుతాయని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న వాస్తవాల ప్రకారం ప్రభుత్వ సంస్థ ఆర్థిక ఆరోగ్యం పరిస్థితి దారుణంగా ఉందని, గణాంకాలు అది 'వెంటిలేటర్'పై ఉందని చూపిస్తున్నాయని విమర్శించారు. ఎంపి శతాబ్ది రాయ్ మాట్లాడుతూ.. రైలు ప్రమాదాల్లో మరణించిన వారికి ఎంత పరిహారం చెల్లించినా తిరిగి తీసుకురాలేమని అన్నారు. టిక్కెట్లపై రద్దు ఛార్జీలు విధించడం ప్రయాణికులను హింసించడమేనని ఆమె అన్నారు. సిపిఎం ఎంపి సచ్చితానందన్ మాట్లాడుతూ.. రైల్వే ప్రైవేటీకరణకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు సర్వీస్ అందించాల్సిన రైల్వేను, ప్రజలకు దూరం చేస్తున్నారని విమర్శించారు. రైల్వేలో నియామకాలు తగ్గిపోయాయని పేర్కొన్నారు. ప్లాట్‌ఫాం టిక్కెట్టు నుంచి అన్ని రకాల టిక్కెట్ల ధరలు పెరిగాయని విమర్శించారు.

ట్రూ డౌన్ అంటే అధిక వసూళ్లలో మిగులే!

(మొదటిపేజీ తరువాయి)

ప్రాతిపదికన వినియోగదారుల వద్ద వసూలు చేసేశారు. కనుక, దానిని రూ.37,863.98 కోట్లు ప్రాతిపదికన తగ్గించి లెక్కించాలి. వినియోగదారుల దగ్గర అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వెనక్కు ఇవ్వాలి. ఇదే, ట్రూ డౌన్. అంటే ట్రాన్స్‌కో సామర్థ్యం పెరిగినందు వల్ల వచ్చిన ఫలితం కాదిది! నిర్ణయించుకున్న లక్ష్యాన్ని చేరడంలో వెనుకబడినందు వల్ల వచ్చిందిది! దీనిని టిడిపి సర్కారు ఘనతగా ఎవరన్నా ప్రచారం చేయదల్చుకుంటే అంతకన్నా తెలివితక్కువ మరొకటి ఉండబోదు. ట్రాన్స్‌కోనే అనుచిత ప్రయోజనం పొం దింది. వినియోగదారుల నుండి ఐదేళ్లపాటు, ప్రతి నెలా అదనంగా వసూలు చేసిన సొమ్ము ట్రాన్స్‌కో తన అవసరాలకు వాడుకుంటున్నది. తిరిగి, చెల్లించాల్సిన పరిస్థితి వస్తే మాత్రం ముందు రెగ్యులేటరీ కమిషన్‌కు నివేదిస్తుంది. ఆ కమిషన్ మరో ఏడాది తరువాత నిర్ణయాన్ని ప్రకటిస్తుంది. అంటే ఆరేళ్లపాటు ట్రాన్స్‌కో ఈ మొత్తాన్ని వాడుకుంటుంది. తిరిగి చెల్లించాల్సి వచ్చేసరికి, ఆ మొత్తాన్ని ట్రాన్స్‌కో డిస్కమ్‌ల ఖాతాల్లోకి జమ చేస్తుంది. డిస్కమ్‌లు వినియోగదారుల నుండి నెలనెలా వసూలు చేయవలసిన ట్రూఅప్ ఛార్జీలను ఒకేసారి పొందినట్లు జమచేసుకుంటాయి. అప్పుడు ట్రూ డౌన్ ద్వారా వినియోగదారుడికి తిరిగి రావాల్సిన మొత్తం రాదు. ఒకవేళ ఛార్జీలను పెంచరాదని ఏదైనా సంవత్సరంలో నిర్ణయిస్తే అప్పుడు కూడా ప్రభుత్వం నుండి రావాల్సిన సబ్సిడీని తగ్గిస్తారు తప్ప వినియోగదారునికి తిరిగి చెల్లించరు.

వినియోగదారులకు దక్కని ట్రూ డౌన్

అయిదేళ్లకొకసారి కాకుండా ఏడాదికొకమారు ఇటువంటి సర్దుబాటు చేపట్టాలని పలు సూచనలు కమిషన్ ముందుకు వచ్చాయి. అలా గనుక చేస్తే వినియోగదారులకు నేరుగా ట్రూ డౌన్ ప్రయోజనం దక్కవచ్చు. కానీ, ఆ సూచనలను పట్టించుకోకపోవడం వల్ల ట్రూ డౌన్ ఫలితాలు వినియోగదారులకు చేరడం లేదు. ట్రూ అప్ భారాలు మాత్రం ప్రతినెలా పడుతూనే ఉన్నాయి. ఆదాయం కూడా రూ.1666.95 కోట్ల మేరకు తగ్గింది. నిర్వహణ వ్యయం, ఇతర ఖర్చులు కలిపి రూ.269.26 కోట్ల మేరకు తగ్గాయి. ఛార్జీల ఆదాయం రూ.340 కోట్లు అదనంగా వచ్చింది. ట్రాన్స్‌కో రూ.370.83 కోట్ల మేరకు ఆదాయపన్ను కూడా చెల్లించింది.

మీకోసం

అప్పడాలు వేయించే ముందు కొద్దిసేపు ఎండలో పెడితే నూనె ఎక్కువగా పీల్చకుండా ఉంటాయి.

జీవన సౌరభం

పైవారితో గౌరవంగా సాటివారితో స్నేహంగా మెలగడం కాదు, తనకన్నా తక్కువవారితో మెలిగే తీరే వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది.

చింటూ కోరిక

చింటూ స్థానిక ఉన్నత పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్నాడు. సాయంత్రం బడి వదలగానే ఇంటికి వచ్చాడు. కాళ్ళు చేతులు కడుక్కుని, అమ్మ ఇచ్చిన పాలు తాగాడు. బడిలో జరిగిన విషయాలన్నీ అమ్మకి చెప్పాడు. కాసేపు తోటి పిల్లలతో ఆడుకున్నాడు. అప్పుడు చింటూ వాళ్ల అమ్మ 'చింటూ రేపు నీ పుట్టినరోజు కదా బజారుకు వెళ్లి నీ స్నేహితులకు ఇవ్వడానికి చాక్లెట్లు, బిస్కెట్లు, నీకు కొత్త బట్టలు కొనుక్కుని వద్దాం పద" అంది.

చింటూ మౌనంగా ఉండిపోయాడు. 'ఏమైంది కన్నా అలా ఉన్నావు?' అని దగ్గరికి తీసుకుని అడిగింది. 'అమ్మా! ఈసారి నా పుట్టినరోజుకి బట్టలు, చాక్లెట్లు వద్దు' అన్నాడు చింటూ. 'మరేం కావాలి?' అని అడిగింది అమ్మ చింటూని దగ్గరకి తీసుకుంటూ. 'రెండు కుండలు కావాలి అమ్మ' నసుగుతూ అడిగాడు చింటూ.

'పిల్లలు ఎవరైనా మంచి బట్టలు, ఆడుకునే వస్తువులు, సైకిలు, తినే వస్తువులు అడుగుతారు. నువ్వు కుండలు అడుగుతున్నావు ఏంటి?' అంది తల్లి. 'మొన్న మీ పెళ్లిరోజునాడు అనాథాశ్రమానికి వెళ్లి భోజనాలు పెట్టారు. ఎందుకు అలా చేస్తున్నారని నాన్నని అడిగాను. 'పదిమందికి ఉపయోగపడే పని చెయ్యాలి. ఇతరులకు సేవ చెయ్యాలి' అని చెప్పారు కదా! ఇప్పుడు నేను కూడా అలాంటి పనే చేయాలనుకుంటున్నాను' అన్నాడు చింటూ.

'అయితే ఈ కుండలెందుకు?' అడిగింది అమ్మ అయోమయంగా ముఖంపెట్టి.

'రోజురోజుకూ ఎండలు పెరుగుతున్నాయి కదా అమ్మ. మా తరగతి గది ముందు, పంచాయతీ ఆఫీసు దగ్గర కుండతో నీళ్లుపెట్టి దాహం తీర్చాలి అనుకుంటున్నాను' అన్నాడు చింటూ. చింటూకి వచ్చిన గొప్ప ఆలోచనకు పొంగిపోయింది తల్లి. మర్నాడు చింటూ స్కూలుకి కొత్త బట్టలు వేసుకుని రెండు కుండలు పట్టుకుని వెళ్లాడు.

సత్యం మాష్టారుకి విషయమంతా వివరించి చెప్పింది చింటూ తల్లి. 'పిల్లలు తల్లి దండ్రులను అనుకరిస్తారు. ఇతరులకు సేవ చేయాలన్న మీ ఆలోచన చింటూ కూడా ఒంటబట్టించుకున్నాడు. అని తల్లిని మెచ్చుకుని చింటూకి పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు సత్యం మాష్టారు. ఎండాకాలంలో చింటూ ఏర్పాటు చేసిన కుండలో చల్లని నీటిని తాగి ఆనందించడమే కాదు మిగిలిన పిల్లలు కూడా చింటూ బాటలో నడిచారు. పెద్దలు అభినందించారు.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

నేను గీసిన బొమ్మ

మంగినపల్లి సంజన,
8వ తరగతి,
జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల,
నిజాంపేట,
మెదక్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆర్టికల్ 370 రద్దు.. నిరుద్యోగుల్లో ఉన్నత విద్యావంతులే అధికం!

ఆగస్టు 5, 2019.. చాలామందికి గుర్తు ఉండే వుంటుంది. కొన్ని దశాబ్దాలుగా జమ్ముకాశ్మీర్‌లో అమల్లో ఉన్న ఆర్టికల్ 370 పాలనను ఏకపక్షంగా రద్దు చేసిన రోజు అది. ఆ రోజున.. రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు అందిస్తామని, యువతకి ఉపాధి మార్గం చూపిస్తామని, సరిహద్దు ఘర్షణలను రూపుమాపుతామని పాలకులు ఘనంగా చెప్పారు. ఆ పలుకులు నిజమయ్యాయని, ఈ నెల ప్రారంభంలో జమ్మూ అసెంబ్లీలో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్‌సిన్హా విజయోత్సవ ప్రసంగం కూడా చేశారు. 'యువత ఆకాంక్షలను అర్థం చేసుకుని తమ నాయకత్వ నేతృత్వంలో కాశ్మీర్ కొత్త పురోగతి శకాన్ని చూస్తోంద'ని అన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ప్రధాని మోడీ కూడా తమ ప్రభుత్వం కాశ్మీర్ యువతకి 'కొత్త అవకాశాలు' అందించిందని ఉప్పొంగిన ఛాతితో చెప్పారు. అయితే పాలకుల మాటలు వాస్తవదూరంలో ఉన్నాయని చెప్పే ఉదాహరణలు ఇప్పుడు జమ్ముకాశ్మీర్‌లో ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. 'నిరుద్యోగం పెరిగింది' అని ఎప్పుడూ అనే మాటలు అక్కడి యువత చెప్పడం లేదు. ముఖ్యంగా ఆర్టికల్ 370 రద్దు తర్వాతే నిరుద్యోగం మరింత పెరిగిందని నొక్కి వక్కాణిస్తున్నారు.

ప్రతి రోజూ ఉదయం ఆఫీస్ టైంకి 33 ఏళ్ల సర్ఫరాజ్ అహ్మద్ ఇంటి నుండి బయటికి వస్తాడు. తిరిగి సాయంత్రం ఆఫీస్ వదిలే సమయానికి ఇంటికి చేరతాడు. అయితే అతడికి ఉద్యోగం లేదు. ఏ ఆఫీస్‌కీ వెళ్లడం లేదు. ఆరు నెలలుగా ఉద్యోగం లేదన్న చేదు నిజాన్ని కుటుంబానికి చెప్పకుండా సర్ఫరాజ్ దాచాడు. 'ఆఫీస్ టైంకి బయటికి వచ్చి ఫ్రెండ్ ఆఫీసులో గడుపుతాను. సాయంత్రం ఇంటికి వెళతాను. దాచుకున్న కొద్ది డబ్బుతో ఎలాగోలా కాలం గడుపుతున్నాను. ఇప్పుడు అవి కూడా అయిపోతున్నాయి' అంటున్న సర్ఫరాజ్ కాశ్మీర్ యూనివర్శిటీలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ చేశాడు. దశాబ్ద కాలంగా 'కెరియర్‌లో ఎన్నో అప్స్ అండ్ డౌన్స్ చూశాన'ని అంటున్నాడు. ముఖ్యంగా 'ఆర్టికల్ 370 రద్దు చేసిన నాటి నుండే, పరిస్థితులు అంతకుముందు కంటే అధ్వానంగా తయారయ్యాయ'ని వాపోతున్నాడు.

2019కి ముందు జమ్మూకాశ్మీర్ నిరుద్యోగిత దేశ సగటు కంటే తక్కువగా ఉండేది. కాని ఇప్పుడు ఆ స్థాయిని దాటేసింది. ముఖ్యంగా చదువుకున్న నిరుద్యోగులు సర్ఫరాజ్ లాంటి వారు అక్కడ పెరిగిపోయారు.

కుంకుమ పువ్వు అమ్ముకుంటున్నా..

జమ్మూ సిటీకి 240 కిలోమీటర్ల దూరంలో కథువాలో ఉన్న 32 ఏళ్ల దినేష్ కుమార్ కూడా సర్ఫరాజ్‌లాగే ఉద్యోగం ఉందని కుటుంబాన్ని నమ్మిస్తున్నాడు. కెమిస్ట్రీలో డాక్టరేట్ సాధించిన దినేష్ ఇప్పుడు ఇంటింటికీ తిరిగి కుంకుమపువ్వు ప్యాకెట్లు అమ్ముతున్నాడు. 'నేను చేస్తున్న పని గురించి నా ఫ్యామిలీకి చెప్పలేను. ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫ్యాకల్టీ జాబ్ చేస్తున్నానని వాళ్లని నమ్మించాను. సేల్స్ మ్యాన్‌గా నెలకు రూ.15 వేలు కంటే ఎక్కువ రావు. ఆ డబ్బుతో మేనేజ్ చేయడం చాలా కష్టంగా ఉంది. ఇంటికి వెళ్లడమే మానేశాను. ఊళ్లో ఏ ఫంక్షన్ జరిగినా వెళ్లడం లేదు' అంటున్న దినేష్ మాటల్లో ఎంతో నిరాశ, నిస్పృహ కనిపిస్తున్నాయి.

9 ఏళ్ల క్రితం మాస్టర్స్ పూర్తిచేసిన దినేష్, డాక్టరేట్ చేసి మంచి ఉద్యోగం సాధించాలని లక్ష్యం పెట్టుకున్నాడు. రూ.50 వేల స్టైఫండ్‌తో 2019లో మొదలుపెట్టిన డాక్టరేట్‌ని ఏడాది క్రితమే పూర్తిచేశాడు. అప్పటి నుండి ఉద్యోగం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ఫలితం లేక, హోమ్ ట్యూషన్స్ పెట్టాడు. టీ కొట్టు కూడా ప్రారంభించాలనుకున్నాడు. 'డాక్టరేట్ సాధించడానికి ఎంతో కష్టపడ్డాను. అయినా నిరుద్యోగిగా మిగిలిపోయాను. ఈ బాధ ఎంతోమందిది. మానసికంగా కుంగిపోతున్నా' అని దినేష్ ఒకింత భావోద్వేగం నిండిన కళ్లతో అంటున్నాడు. సర్ఫరాజ్, దినేష్ జీవితాలు జమ్మూ-కాశ్మీర్‌లో నిరుద్యోగ సంక్షోభాన్ని ప్రతిబింబిస్తున్నాయి.

నివేదికలు ఏం చెబుతున్నాయంటే..

మార్చి నెలలో జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం అసెంబ్లీకి సమర్పించిన నివేదిక ప్రకారం 3.70 లక్షల మంది యువత ఉద్యోగాల కోసం దరఖాస్తు చేశారు. వీరికి అదనంగా 4.73 లక్షల మంది వ్యక్తులు 18-60 ఏళ్ల మధ్యవారు 'మేము పని చేయడానికి సిద్ధంగా ఉన్నాం. కానీ మాకు పని దొరకడం లేదు' అని చెప్పినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఇంకా నిరుద్యోగం కారణంగా 2020-22 మధ్య 78 మంది పౌరులు ఆత్మహత్య చేసుకున్నట్లు కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పార్లమెంటుకి తెలియజేసింది. మొన్న డిసెంబరులో కాశ్మీర్ పోలీసు విభాగంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకి 4002 పోస్టులు భర్తీకి జరిగిన రాత పరీక్షలో 5.5 లక్షల మందికి పైగా అభ్యర్థులు పాల్గొన్నారు. 2019-21 మధ్య దాదాపు 5 లక్షల మంది కాశ్మీరీలు ఉద్యోగాలు కోల్పోయారని కాశ్మీర్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అంచనా వేసింది.

ఉన్నత విద్యావంతుల్లో మరింత ఎక్కువ

ఉన్నత విద్య అభ్యసించిన పౌరుల్లో ఈ సంక్షోభం మరింత తీవ్రంగా కనిపిస్తోంది. 32 ఏళ్ల రంజీత్ సింగ్ నేషనల్ ఎలిజిబిలిటి పరీక్షలో ఉత్తీర్ణుడయ్యాడు. అలాగే హోటల్ మేనేజ్‌మెంట్‌లో బ్యాచిలర్‌డిగ్రీ చేశాడు. చరిత్ర, హాస్పిటాలిటీ, టూరిజం మేనేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీలు పొందాడు. మెరుగైన ఉపాధి అవకాశాల కోసం రెండు దశాబ్దాలకు పైగా నైపుణ్యాభివృద్ధి కోర్సులు చేశాడు. 'ఇంత చదువుకున్నా ఫలితం లేదు. ఇప్పుడు నేను నెలకు రూ.15వేలు-రూ.20 వేలు జీతం వచ్చే యోగా టీచర్‌గా చిన్న ఉద్యోగం చేస్తున్నా' అంటున్న రంజిత్ టూరిజంలోనైనా మెరుగైన ఉపాధి దొరుకుతుందని ఆశపడుతున్నాడు. టూరిజం అండ్ ట్రావెల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరాలని కలలు కన్నాడు. ఆ కోర్సులో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. కాశ్మీర్ పబ్లిక్ సర్వీస్ పరీక్ష కూడా రాశాడు.

నియామకాలు రద్దుతో ...

ఉద్యోగం కోసం దరఖాస్తుచేసిన నాలుగేళ్లకి అతని పేరు షార్ట్‌లిస్ట్‌లో ఉందని తెలిసింది. 2021లో ఇంటర్వ్యూకి కూడా వెళ్లాడు. 'జాబ్‌కి ఒక్క అడుగు దూరంలోనే ఉన్నాన'ని ఎంతో సంతోషపడ్డాడు. అయితే 2022లో గవర్నరు పాలనలో ఉన్న ఆ రాష్ట్రంలో ఆ నియామకాలని రద్దు చేశారు. ఇప్పటికీ రంజిత్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేస్తూనే ఉన్నాడు. ఈ పోస్టు కోసం గతంలో రెండంకెల సంఖ్యలో అభ్యర్థులు దరఖాస్తులు చేసేవారు. ఇప్పుడు ఆ సంఖ్య వందలకి చేరింది' అంటున్నాడు రంజిత్.

ఏడేళ్లుగా ఎదురుచూపులు

ఇంజినీరింగ్ విద్య పూర్తిచేసిన రేషి, 2017 నుండి విడుదలవ్వని నోటిఫికేషన్‌పై తీవ్ర అసంతృప్తిలో ఉంది. '2022-23లో ఇంజనీరింగ్ విద్య కోసం 5 వేల మంది విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ప్రతి ఏడాది ఈ సంఖ్య పెరుగుతూనే ఉంది. అంటే నోటిఫికేషన్ విడుదలయ్యేనాటికి ఏడు సంవత్సరాల నుండి ఎదురుచూస్తున్న గ్రాడ్యుయేట్లు పోటీలో ఉంటారు' అంటోంది.

అనిశ్చితి, అస్థిరత, ఆర్టికల్ రద్దు, తరచూ ఇంటర్నెట్ సేవలు నిలిపివేత, గవర్నరు పాలనతో ఆ రాష్ట్ర చదువుకున్న యువత దేశంలోని మిగిలిన ప్రాంతాల నిరుద్యోగుల కంటే భిన్నమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. వాస్తవ పరిస్థితులు ఇలా వుంటే అసెంబ్లీ సాక్షిగా పాలకులు పలికిన పలుకులు ఎవరిని మభ్యపెట్టడానికి?

తాగునీరు.. ఇళ్ల స్థలాలకు పట్టాలు

- ప్రజాచైతన్య యాత్రలో సమస్యల వెల్లువ
- సమస్యల పరిష్కారానికి తహశీల్దార్ కార్యాలయాల వద్ద సిపిఎం నాయకుల ఆందోళన

ప్రజాశక్తి - యంత్రాంగం

తాగునీటి సమస్యను పరిష్కరించాలని, లంక భూముల సాగుకు తగిన సౌకర్యాలు కల్పించాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలని, మురుగునీటి కాల్వలను శుభ్రం చేయాలని, పలు సమస్యలకు పరిష్కారం చూపాలని, ఇలా తాము ఎదుర్కొంటున్న సమస్యలను సిపిఎం నాయకుల ఎదుట ఏకరువుపెట్టారు. సిపిఎం చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలో తమ సమస్యలను ప్రజలు విన్నవించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ఎంపిడిఒ, తహశీల్దార్, గ్రామ సచివాలయాల ఎదుట సిపిఎం నాయకులు ఆందోళనలు చేపట్టారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రజలకు సిపిఎం నాయకులు భరోసా కల్పించారు.

మత్స్యకారులకు గతేడాదికి సంబంధించిన వేట నిషేధ పరిహారం చెల్లించాలని, ఎన్ఎఒబి నిర్వాసితులకు పెండింగ్ ప్యాకేజీలు ఇవ్వాలని, నేవీ నిర్మాణ పనుల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని సిపిఎం ప్రజాచైతన్య యాత్రలో ప్రజలు విన్నవించిన సమస్యలపై అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం ఎంపిడిఒ, తహశీల్దార్ కార్యాలయాల వద్ద, జెడ్. చింతువ, కొత్తపట్నం గ్రామ సచివాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యాన ధర్నాలు నిర్వహించారు. అల్లూరి జిల్లాలోని అనంతగిరి మండల పరిధిలో హైడ్రోపవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని కోరుతూ చిట్టంపాడు నుంచి ములియగుడ మీదుగా అనంతగిరి వరకూ ఐదు కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, జడ్‌పిటిసి సభ్యులు దీసరి గంగరాజు ఆధ్వర్యాన మండల పరిషత్ కార్యాయాన్ని ముట్టడించారు. అనంతరం అధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం సీతగుంటలో పిఎం జన్‌మన్ ఇళ్లకు ఆర్థిక సాయాన్ని రూ.పది లక్షలకు పెంచాలని తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. డుంబ్రిగుడ మండలం సాగర పంచాయతీ అడప వలసలో సిసి రోడ్లు, డ్రెయినేజీ, ఇతర సమస్యలపై ప్రజలు విన్నవించారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలంటూ అనంతగిరి మండల కేంద్రానికి పాదయాత్రగా వస్తున్న గిరిజనులు, సిపిఎం నాయకులు

కృష్ణానది నడిబొడ్డున తమకు ఇచ్చిన 30 ఎకరాల లంక పొలాల సమస్య తీవ్రంగా ఉందని, సాగు చేసుకునేందుకు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గుంటూరు జిల్లా కుంచనపల్లి దళిత లంక పొలాల రైతులు తమ సమస్యను సిపిఎం నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. సుమారు 200 కుటుంబాలు నివాసం ఉంటున్నాయని, 50 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు లేవని, చెరువు పోరంబోకులో 40 కుటుంబాలు దీర్ఘకాలంగా ఇల్లు వేసుకుని నివాసం ఉంటున్నామని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలని కాకుమాను మండలం కొండపాటూరు, కాకుమాను ఎస్‌టి కాలనీ వాసులు తమ సమస్యను ఏకరువు పెట్టారు.

శ్రీకాకుళం తుమ్మావీధిలో విద్యుత్ లో వోల్టేజ్ సమస్య ఉందని, మెహర్‌బాబా ఎలిమెంటరీ స్కూల్ పైకప్పు పెచ్చులు ఊడి పడడంవల్ల విద్యార్థులు చదువుకోవడానికే భయపడుతున్నారని, మురుగు నీటి కాలువల్లో పూడికలు తొలగించకపోవడంతో ఎక్కడికక్కడ లైనింగ్ తెగిపోయి రోడ్లపైకి మురుగునీరు వచ్చి చేరుతోందని ఇలా పలు సమస్యలను సిపిఎం నాయకులకు కాలనీ వాసులు చెప్పుకొచ్చారు. విజయనగరం 46వ డివిజన్ వినాయక నగర్‌లో ప్రజాచైతన్య యాత్ర చేపట్టారు. నివాసం ఉన్న చోట జిఒ నెంబర్ 30 ప్రకారం రెగ్యులర్ చేయాలని, ఇళ్లులేని పేదలకు రెండు సెంట్లు భూమి ఇచ్చి రూ.లక్షలు మంజూరు చేయాలని ప్రజలు విన్నవించారు. కర్నూలు జిల్లా పెద్దకడుబూరు మండల కేంద్రంలో సిపిఎం రాష్ట్ర నాయకులు జి.రామన్న పర్యటించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని మండల అధికారులకు వినతిపత్రాలు ఇచ్చారు. నంద్యాలలోని టిడ్కో ఇళ్లను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్ పరిశీలించారు. టిడ్కో ఇళ్ల చుట్టూ ముళ్ల కంపలు, పొదలు తొలగించకపోవడంతో విషసర్పాలు తిరుగుతున్నాయని, ప్రజలకు రక్షణ లేదన్నారు. టిడ్కో గృహాల్లో నివసించే ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నెల్లూరు, నెల్లూరురూరల్, కోవూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరు, ముత్తుకూరు మండలాల్లో ప్రజా చైతన్య యాత్రలు కొనసాగాయి.

ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్రను బుట్టాయగూడెం బస్టాండ్ సెంటర్ వద్ద సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మొడియం నాగమణి జెండా ఊపి ప్రారంభించారు. కూటమి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆమె విమర్శించారు. దెందులూరు తహశీల్దార్ కార్యాలయం ధర్నా నిర్వహించి సమస్యలపై తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

బిసిసిఐ నిర్ణయం సరైందే

- బ్రూక్ నిషేధంపై మొయిన్, రషీద్
- ఐపిఎల్ సీజన్-18

ముంబయి: ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్) 2025 సీజన్ నుంచి అర్థాంతరంగా వైదొలిగిన ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ హారీ బ్రూక్‌పై రెండేళ్ల నిషేధం విధించింది. అతనిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) తీసుకున్న నిర్ణయాన్ని ఇంగ్లండ్ స్టార్ స్పిన్నర్లు మొయిన్ అలీ, ఆదిల్ రషీద్ సమర్థించారు. రెండేళ్ల పాటు బ్రూక్‌పై నిషేధం విధించడం తప్పేమీ కాదని, ఆటగాళ్లు అకస్మాత్తుగా 'తప్పుకోవాలనే' నిర్ణయం తీసుకోవడం వల్ల జట్టు కూర్పు దెబ్బతింటుందని మొయిన్ తెలిపాడు. గాయం వల్ల సీజన్ నుంచి తప్పుకొంటే ఎవరూ తప్పుబట్టరు. బోర్డు కూడా ఇందుకు మినహాయింపు ఇస్తుంది. కానీ వేరే కారణాలు చూపుతూ అర్ధంతరంగా తప్పుకోవడం ఏమాత్రం సరికాదరి బ్రూక్ తీరును మొయిన్ అలీ తప్పుబట్టాడు. ఇదేవిధంగా రషీద్ కూడా బిసిసిఐ నిర్ణయాన్ని సమర్థించాడు. ఇదిలా ఉంటే.. ఐపిఎల్-2025 మెగా వేలంలో బ్రూక్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.6.25కోట్లకు కొనుగోలు చేసింది. మరోవైపు మొయిన్ అలీని కోల్‌కతా నైట్‌రైడర్స్ రూ.2 కోట్లకు కొనుగోలు చేసింది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఎంపికైన బ్రూక్.. మార్చి 22 నుంచి జరిగే ఐపిఎల్ 18వ సీజన్‌లో పాల్గొనాల్సి ఉంది.

నిబంధన ప్రకారమే

సవరించిన ఐపిఎల్ నిబంధనల ప్రకారం.. ఎవరైనా ఆటగాడు వేలంలో తన పేరు నమోదు చేసుకొని అమ్ముడైన తర్వాత సీజన్‌కు అందబాటులో ఉండాల్సిందే. గాయం తప్ప ఇతరత్రా కారణాలను సాకులుగా చెబితే కుదరదు. ఇలా సీజన్ నుంచి అనూహ్యంగా తప్పుకొన్న ఆటగాళ్లను రెండు సీజన్ల పాటు లీగ్‌లో పాల్గొనకుండా నిషేధం విధిస్తారు. ఈ మేరకు ఐపిఎల్ నియమావళిలో నిబంధనలు పొందుపరిచారు. తాజా నిబంధన ప్రకారమే హ్యారీ బ్రూక్‌పై చర్యలు తీసుకున్నట్లు బోర్డు అధికారి ఒకరు వెల్లడించారు. దీంతో 2025, 2026 సీజన్లలో బ్రూక్ పాల్గొనేందుకు వీలుండదు. ఈ మేరకు సదరు క్రికెటర్‌తో పాటు, ఇంగ్లండ్ వేల్స్ క్రికెట్ బోర్డు(ఇసిబి)కు సమాచారం ఇచ్చారు. నిజానికి బ్రూక్ ఇలా చేయడం ఇదేం మొదటిసారి కాదు.

గత ఏడాది కూడా..

గతేడాది కూడా తన నానమ్మ మృతి కారణం చూపుతూ ఏకంగా లీగ్ మొత్తానికి దూరంగా ఉన్నాడు. ఈ ఏడాది ఇంగ్లండ్ క్రికెట్‌కే తన ప్రాధాన్యత అని స్వదేశంతో భారత్ (జూన్‌లో)తో జరిగే సిరీస్‌కు ముందు పూర్తిస్థాయి ఉత్తేజంతో అందుబాటులో ఉండేందుకు ఐపిఎల్ నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించాడు.

ఢిల్లీ వైస్ కెప్టెన్‌గా డుప్లెసిస్

ఢిల్లీ క్యాపిటల్స్ వైస్ కెప్టెన్‌గా సీనియర్ బ్యాటర్ ఫాఫ్ డుప్లెసిస్ ఎంపికయ్యాడు. ఈమేరకు ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ సోమవారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. గత మూడు సీజన్‌లలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)కి కెప్టెన్‌గా ఉన్న 40ఏళ్ల డుప్లెసిస్‌ను ఇటీవల ఆ ఫ్రాంచైజీ వదులుకుంది. దీంతో డుప్లెసిస్‌ను ఢిల్లీ క్యాపిటల్ మినీ వేలంలో రూ.2కోట్ల కనీస ధరకు కొనుగోలు చేసుకుంది. ఇక ఢిల్లీ కెప్టెన్‌గా అక్షర్ పటేల్ ఎంపికైన సంగతి తెలిసిందే.

అక్రమ కేసులను తొలగించండి

- సినీ నటి కాదంబరి జత్వాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తనపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే తొలగించాలని ప్రభుత్వాన్ని సినీ నటి కాదంబరి జత్వాని కోరారు. న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి వంగలపూడి అనితకు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని ఎంబివికెలో సోమవారం మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన నిర్వహించిన విలేకరుల సమావేశంలో జత్వాని మాట్లాడారు. తాను, తన కుటుంబం కేసుల కారణంగా ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. కేసులకు సంబంధించి ఇంతవరకూ ఫోరెన్సిక్ నివేదికలు రాలేదని వాపోయారు. ఈ కేసును సిఐడికి బదిలీ చేసిన అనంతరం కూడా నిందితులపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు. విద్యాసాగర్ బెయిల్‌పై బయటకు వచ్చి యథేచ్ఛగా తిరుగుతున్నారని పేర్కొన్నారు. విద్యాసాగర్, జిందాల్ ఢిల్లీ కోర్టులో ఇంజక్షన్ ఆర్డర్‌తో తనను వేధిస్తున్నారని తెలిపారు. మహిళా సంఘాల నాయకులు మొదటి నుంచి తనకు అండగా ఉండి సహాయ సహకారాలు అందిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సెకీ ఒప్పందాన్ని కొనసాగిస్తూ.. వైసిపితో కుమ్మక్కైన విధంగా, జత్వాని కేసులో కూడా కుమ్మక్కయ్యారా? అని ప్రశ్నించారు. ఇది అక్రమ కేసు కావడంతోనే ముగ్గురు ఐపిఎస్ అధికారులను సస్పెండ్ చేశారని, ఆ సస్పెన్షన్‌ను కొనసాగిస్తున్నారని తెలిపారు. బాధితురాలైన జత్వానిపై కేసులు ఎందుకు ఎత్తివేయడం లేదో స్పష్టం చేయాలన్నారు. మరో రాష్ట్రంలో పారిశ్రామికవేత్తపై జత్వాని కేసు పెడితే ఆ కేసులో న్యాయస్థానానికి ఆమె హాజరు కాకుండా ఉండేందుకు ఆఘమేఘాల మీద ఇక్కడ ఉదయం 6 గంటలకు ఎఫ్ఐఆర్ నమోదు చేసి 9 గంటలకు ఫ్లైట్‌లో వెళ్లి సాయంత్రానికి జత్వానిని, ఆమె కుటుంబ సభ్యులకు విజయవాడకు తీసుకొచ్చి 42 రోజులపాటు జైలులో ఉంచారని చెప్పారు. ఇంత అన్యాయం జత్వానికి జరిగినా ప్రభుత్వం న్యాయం చేయలేదన్నారు. బాధితులకు న్యాయం చేస్తామని అధికారం చేపట్టిన ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తప్పుబట్టారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నివేదిక రాలేదని సాకులు చెప్పి కేసు ఎత్తివేయకుండా తాత్సారం చేయడం తగదన్నారు. జత్వాని నుంచి తీసుకున్న డివైజ్‌లను పోలీసులు అందులో సమాచారాన్ని కాపీ చేసుకుని, న్యాయస్థానం అనుమతితో వెంటనే ఆమెకు అప్పగించాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ.. సిఎం చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్‌ను దూషించారని వెంటనే చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం మహిళలపై అఘాయిత్యాల కేసుల్లో ఎందుకు స్పందించడం లేదన్నారు. ఈ సమావేశంలో ఎన్‌పిడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సినీనటి కాదంబరి; వేదికపై సుంకర పద్మశ్రీ, రమాదేవి, దుర్గా భవాని తదితరులు

సింధు, లక్ష్యసేన్‌పైనే ఆశలు

- నేటినుంచి స్విస్ ఓపెన్ టోర్నీ

బస్సెల్(స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో పివి సింధు, లక్ష్యసేన్‌పైన అందరి దృష్టి నెలకొంది. మంగళవారం నుంచి బస్సెల్ వేదికగా స్విస్ ఓపెన్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభం కానుంది. ఈ ఏడాది వీరిద్దరూ ఒక్క టోర్నమెంట్‌లోనూ సెమీస్‌కు చేరలేదు. దీంతో రెండు ఒలింపిక్ పతకాల విజేత, 16వ సీడ్, సింధు ప్రదర్శనతోపాటు మహిళల సింగిల్స్‌లో 28వ సీడ్ మాల్విక బన్సోద్ బరిలోకి దిగుతున్నారు. వీరితోపాటు యువ షట్లర్లు అనుపమ ఉపాధ్యాయ, ఆకర్షి కశ్యప్, రక్షిత రామ్‌రాజ్ కూడా సింగిల్స్ బరిలో దిగుతున్నారు. ఇక పురుషుల సింగిల్స్‌లో 15వ ర్యాంకర్ లక్ష్యసేన్‌తోపాటు హెచ్ఎస్ ప్రణయ్, ప్రియాన్షు రాజ్‌వత్, కిరణ్ జార్జి తమ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మహిళల డబుల్స్‌లో 9వ సీడ్ ట్రీసా జోలీ-గాయత్రి గోపీచంద్, ప్రియా కుంజేబమ్-స్మృతి మిశ్రా, వైశాలి-ఆరతి కూడా రేసులో ఉన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68